సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 352

సోమవారం 4-9-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



వరుణుడు కరుణిస్తే!

నేడు నేపాల్‌తో తొలిసారి భారత్ 'ఢీ' ఈ మ్యాచ్‌కూ వాన ముప్పు - 12లో



'ఎఫ్‌డీ' నిచ్చెన ఎక్కుతారా?

వడ్డీ రేట్ల అస్థిరతలను అధిగమించేందుకు ఉపయోగపడే 'ఎఫ్‌డీ లాడార్' - 13లో



ఆదిత్య-ఎల్1 కక్ష్య పెంపు

సౌరగోళంపై పరిశోధనల కోసం ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహానికి ఇస్రో శాస్త్రవేత్తలు మొదటి సారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు.

వివరాలు 6లో ▸



సమాఖ్య వ్యవస్థపై దాడి

'ఒక దేశం-ఒకే ఎన్నిక' ఆలోచనను దేశ సమాఖ్య వ్యవస్థ మీద, రాష్ట్రాల మీద వికృత దాడిగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు.

వివరాలు 6లో ▸

పేదల ఇళ్లు లూటీ!

నిరుపేదల ఈడబ్ల్యూఎస్ గృహాలనూ వదలని చంద్రబాబు

- రూ.8,000 కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు షాపూర్జీ పల్లోంజీకి
- తాత్కాలిక భవనాల తరహాలో ప్రజాధనం స్వాహాకు స్కెచ్
- దుబాయ్ దినార్‌ల రూపంలో ముడుపులతో దొరికిపోయిన బాబు
- వినయ్ నంగాలియా, విక్కీజైన్, అంకిత్ బలదూత కీలక పాత్ర
- షాపూర్జీ పల్లోంజి నుంచి దొంగ ఇన్‌వాయిస్‌లతో నగదును బాబు పీఏకు చేరవేసిన ఆ ముగ్గురూ
- ఐటీ శాఖ నోటీసుల్లో వెలుగులోకి చంద్రబాబు నిర్వాకాలు..
- రూ.118 కోట్లకు మినహా మిగిలిన వాటికి బాబు లేఖలు
- సెక్షన్లతో తిప్పికొడుతూ తాజాగా 153 సీ కింద ఐటీశాఖ నోటీసులు



చంద్రబాబుకు వివిధ మార్గాల్లో అందించిన రూ.కోట్లను కోడ్ భాషలో స్టీల్ టన్నులుగా పేర్కొంటూ మెయిల్‌లో దాచుకున్న షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి ముసుగులో తాత్కాలిక భవనాల నిర్మాణాల్లో అడ్డంగా దోచేసిన మాజీ సీఎం చంద్రబాబునాయుడు పేదల ఇళ్ల నిర్మాణాన్ని సైతం వదల్లేదు! రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను ఒకే నిర్మాణ రంగ సంస్థకు అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి వేసిన పథకం ఆదాయపు పన్ను శాఖ తాజాగా జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో

మిగతా 5వ పేజీలో ▶

కస్టడీలోకి తీసుకుని విచారించాలి

చంద్రబాబు అవినీతిపై కేంద్ర సంస్థలు దర్యాప్తు చేయాలి: డొక్కా వరప్రసాద్

3లో

ఫ్యాక్ట్ చెక్

పీజీ వైద్య సీట్లపై ఎందుకీ ఫీట్లు?

- ఎన్ఎంసీ నుంచి నకిలీ అనుమతులు వెలువడితే ఆ మచ్చను ప్రభుత్వానికి అంటగట్టే యత్నం
- శాంతిరాంపై సోదాల విషయంలో నాటి లోకేశ్ ట్వీట్‌ను దాచిపెట్టిన 'పచ్చ'ముఠా
- ఏపీతోపాటు తమిళనాడులోనూ ఇదే తరహా వ్యవహారం వెలుగుచూసిన విషయం మరిచావా రామోజీ?
- కేవలం ఏపీలోనే ఫేక్ అనుమతులు వచ్చినట్లు రాతలా?
- ఎప్పటిలాగే వాస్తవాలు కప్పిపుచ్చి ఈనాడు రోత రాతలు

- వివరాలు 3లో

2047 నాటికి 'అభివృద్ధి భారత్'



'2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. భారత్‌లో అమలవుతున్న మానవ కేంద్రిత అభివృద్ధి మోడల్‌ను ప్రపంచ దేశాలు గుర్తించి, అనుసరిస్తున్నాయి. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగుతున్నాం'అని ప్రధాని మోదీ చెప్పారు. 6లో

నాలుగేళ్లలోనే డిగ్రీ+ బీఈడీ

- ఎన్ఈపీ-2020కి అనుగుణంగా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు.. ఐఐటీ, సీయూ, ఎన్ఐటీ వంటి 42 విద్యా సంస్థల్లో అందుబాటులోకి..
- రాష్ట్రంలో అంబేడ్కర్, జాతీయ సంస్కృత వర్సిటీల్లో ఆఫర్.. ప్రవేశాలకు త్వరలో కౌన్సెలింగ్

2లో

కొత్తగా 1,500 ఈ-బస్సులు



కొనుగోలుకు ఆర్టీసీ నిర్ణయం 2లో

రూ.1,500 కోట్లతో ప్రాజెక్టుకు సంస్థ ఆమోదం

జిల్లా కేంద్రాల మధ్య ఈ-బస్ సర్వీసులు.. వీటితో పర్యావరణ పరిరక్షణతోపాటు 27% నిర్వహణ వ్యయం తగ్గుదల

ఫ్యాక్ట్ చెక్

అక్షరం అక్షరంలో అక్కసు..

పోలవరం ప్రాజెక్టుపై 'ఈనాడు' మరో అసత్య కథనం



- చంద్రబాబు చారిత్రక తప్పిదాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేయత్నం
- ఆయన కమీషన్ల కక్కుర్తి వల్లే రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య అంచనాలకు మించి చేరిన సీపేజీ నీరు
- వాటిని తక్కువ ఖర్చుతో బయటకు పంపే పద్ధతిపై పీపీఏకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రతిపాదన
- ఆ పనులకు అనుమతి వచ్చేలోగా సన్నాహక పనులు చేస్తామని పీపీఏకు చెప్పిన రాష్ట్ర జలవనరుల శాఖ
- కానీ, తమ అనుమతి లేకుండానే పనులు చేస్తున్నారని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శికి పీపీఏ చెప్పినట్లు చిత్రీకరణ
- దానికి కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి విస్తుపోయారంటూ పచ్చి అబద్ధాలు
- ఆ అంతర్గత సమావేశంలో ఏ బల్ల కిందైనా నక్కి విన్నావా రామోజీ?
- కుక్క తోకలా తన బుద్ధి ఎప్పటికీ వంకరేనని ఎప్పటికప్పుడు చాటుకుంటున్న రామోజీ

- వివరాలు 2లో



మింగేస్తున్నారు!

14లో

అజాగ్రత్త.. మితిమీరిన దుర అలవాట్లు.. డబ్బుంటే ఏ వ్యాధి అయినా నయం అవుతుందనే ధీమా.. వెరసి మనిషి జీవితాన్ని నాశనం చేస్తోంది. ఫలితంగా నిద్ర లేవగానే ముద్ద కంటే ముందు మందు బిళ్లలు తినాల్సి వస్తోంది. మాత్రల వినియోగంపై ప్రత్యేక కథనం.

తలరాత మారేలా.. తరతరాలు బాగుపడేలా

- శ్రీకాకుళం జిల్లాలో జోరుగా ప్రగతి పనులు
- వైఎస్సార్ తర్వాత అత్యధిక పనులు చేపడుతున్న సీఎం జగన్
- ఇప్పటికే ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి పూర్తి
- యుద్ధ ప్రాతిపదికన వంశధార లిఫ్ట్, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ పనులు
- ముమ్మరంగా మూలపేట పోర్టు నిర్మాణం



పలాసలో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

ఉన్న చోట బతుకులేక ఊరిలో బతకలేక వలస పోతున్న మత్స్యకారుల కోసం మూలపేట పోర్టు.. ఏటికేటా తగ్గిపోతున్న ఉద్దానం ఆయుష్షు రేఖకు ఊపిరి పోసేందుకు మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్.. ఓ వైపు నీరున్నా మరోవైపు కన్నీరు పెడుతున్న పొలం గొంతు తడిపేందుకు వంశధార ప్రాజెక్టు, ప్రతి యేడూ ఏడుపే మిగులుతున్న పలాస శివారు ప్రాంతాల కోసం ఆఫ్‌షోర్ ప్రాజెక్టు. అంతేనా.. ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇవన్నీ కేవలం గత నాలుగేళ్ల వ్యవధిలో జరిగిన పనులు. సగటు శ్రీకాకుళం వాసి మనసు తెలుసుకుని వారి బతుకు బాగు చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంధించిన ప్రగతి బాణాలు.

దీర్ఘకాలిక సమస్యలకు చెక్

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతో పాటు వెనుకబాటును పారదోలేందుకు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లాలో కీలక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా ఆ తర్వాత వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాకనే జిల్లాలో ప్రత్యేక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. అందులో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ఒకటి. వంశ'ధార'ను అమృతధారలా మార్చి ఉద్దానం గొంతు తడిపేందుకు రూ.700కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టును నిర్మించింది. ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై జలాస్త్రాన్ని సంధిస్తోంది. ఏకంగా రూ.50కోట్లతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించింది. ఇప్పుడీ రెండు ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో జిల్లా వాసుల చిరకాల వాంఛలు నెరవేరనున్నాయి. ఇప్పటికే శ్రీకాకుళం తీరానికి మణిహారంగా నిలవనున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70కోట్లతో ప్రాజెక్టు తొలి దశ పనులను వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేసేలా నిర్మాణం వేగవంతం చేసింది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభిస్తుంది.

సాగునీటి సమస్య తీరేలా..

నేరడి నిర్మాణానికి ఒడిశా అడ్డంకులు ఇంకా తొలగలేదు. దీంతో దీనికి ప్రత్యామ్నాయంగా గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపించేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.176.35 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మరో కీలకమైన ఆఫ్‌షోర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేశారు. మహేంద్ర తనయ వద్ద పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. 26వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ.852.45కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం ప్రాజెక్టు కూడా పూర్తి కావచ్చింది.

మత్స్యకారుల కష్టాలు గట్టెక్కేలా..

సాగర మాల ప్రాజెక్ట్‌లో భాగంగా మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తోంది. అందులో భాగంగా 193 కిలోమీటర్ల తీర ప్రాంతం, సరాసరి లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద లభిస్తున్న శ్రీకాకుం జిల్లాలో కూడా ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బుడగట్లపాలెం వద్ద రూ.365.81కోట్లతో పిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ఇప్పటికే సీఎం చేతులమీదుగా శంకుస్థాపన కూడా జరిగింది. ఇది పూర్తయితే శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల మత్స్యకారులకు ప్రయోజనం కలగనుంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల మత్స్యకారులకు మేలు చేసేందుకు వజ్రపుకొత్తూరు మండలంలోని నీళ్లపేటలో ప్రస్తుతం రూ.11.95కోట్లతో జెట్టీ నిర్మాణం చేపడుతోంది. దానినే ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేసి, పనులు చేపట్టేందుకు తాజాగా వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వచ్చే ఏడాది కల్లా తొలి దశ పూర్తి..

మూలపేట పోర్టు నిర్మాణ పనులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా తొలి దశ పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అన్ని రకాల పనులు ప్రారంభమయ్యాయి.

– ఎం.శంకర్, జీఎం, విశ్వ సముద్ర నిర్మాణ సంస్థ



మెళియాపుట్టి వద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రం

రూ.2,949.70 కోట్లతో పోర్టు

ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖపట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. ఆ తర్వాత శ్రీకాకుళం జిల్లా నుంచి ఒడిశా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల పోర్టులు నిర్మిస్తున్నా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పోర్టుగా మూలపేట పోర్టును ప్రతిష్టాతకంగా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది. దానిలో భాగంగా ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది. వార్షిక సామర్థ్యం 83.3మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో 23.5మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నారు. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడ దొరుకుతున్న అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు, జిల్లా తీర ప్రాంతంలో లభ్యమవుతున్న లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద, పలాస జీడిపప్పు, ఒడిశా, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన మినరల్ శాండ్, ముడి ఇనుము, సోయామీల్, ఫెర్రో ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుంది. థర్మల్ బొగ్గు, కుకింగ్ కోల్, ఎరువులు, ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంట నూనెల దిగుమతికి ఉపయోగపడనుంది. సీఎం చేతులు మీదుగా శంకుస్థాపన జరిగిన కొన్ని రోజులకే పోర్టు పనులు ప్రారంభమయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు, పైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణం కోసం మట్టి పనులు జరిగాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులకు సంబంధించి 580 మీటర్లకుగాను 465 మీటర్ల మేరకు చేపట్టింది. మూడు కార్గో బెర్తులకుగాను బెర్తు నిర్మాణ పనులను త్వరితగతిన చేపడుతున్నారు.

క్లుప్తంగా...

160 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నతవిద్య విభాగాల్లో 160 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను 'ఉత్తమ ఉపాధ్యాయులు-2023' అవార్డులకు ఎంపిక చేసింది. వీరిలో 66 మంది ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారున్నారు. వీరికి అవార్డులు ప్రకటిస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదివారం ఉత్తర్వులిచ్చారు. వీరితో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధించేవారిలో 130 మంది ఉపాధ్యాయులను ప్రత్యేక పురస్కారాలతో సత్కరించాలని పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసింది. వీరిలో పదిమందికి రాష్ట్ర స్థాయి, 120 మందికి జిల్లాస్థాయి పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం వేదికగా పురస్కారాలు ప్రదానం చేస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 120 మందికి ఆయా జిల్లాల కలెక్టర్లు అవార్డులను అందజేస్తారు.

వ్యవసాయ ట్రాక్టర్ల అమ్మకాల్లో భారీ వృద్ధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ ట్రాక్టర్ల కొనుగోళ్లు భారీగా పెరిగాయి. 2021-22తో పోల్చి చూస్తే 2022-23లో వ్యవసాయ ట్రాక్టర్ల అమ్మకాల్లో ఏకంగా 82.14 శాతం వృద్ధి నమోదయ్యింది. 2021-22లో 19,259 వ్యవసాయ ట్రాక్టర్లను రైతులు కొనుగోలు చేయగా.. 2022-23లో ఏకంగా 35,079 వ్యవసాయ ట్రాక్టర్లు అమ్ముడయ్యాయి. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడంతో పాటు రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించడం ద్వారా ఎక్కువ ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు సబ్సిడీ రూపంలో రూ.1,052 కోట్లు వెచ్చించి రైతులకు లబ్ధి చేకూర్చింది. దీంతో రాష్ట్రంలో వ్యవసాయ ట్రాక్టర్ల కొనుగోళ్లు భారీగా పెరిగాయని రవాణా శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రతి ఆర్బీకే పరిధిలోనూ రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను ప్రభుత్వమే సబ్సిడీపై అందిస్తోంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చూస్తోంది.

ఏపీలో రూ.1.23 లక్షల కోట్లతో పోర్టు కార్యకలాపాలు

కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్



సాక్షి, విశాఖపట్నం: ఏపీలో రూ.1.23 లక్షల కోట్లతో పోర్టు కార్యకలాపాలు జరుగుతున్నాయని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖల మంత్రి శర్బానంద్ సోనోవాల్ తెలిపారు. వీటితో 113 ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. ఇందులో ఇప్పటివరకు 36 ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు. విశాఖలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. విశాఖ పోర్టు ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌ను సోమవారం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. విశాఖ పోర్టును సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామని, ఆధునికీకరణ, యాంత్రీకరణతో మెరుగు పరుస్తున్నామని వివరించారు. విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

పీవీ సత్యనారాయణకు స్వామినాథన్ అవార్డు

ఏజీ వర్సిటీ(హైదరాబాద్): ఎంఎస్ స్వామినాథన్ అవార్డు 2021-2012కి రాగోలులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ పీవీ సత్యనారాయణకు ఆదివారం అందించారు. హైబ్రిడ్ వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో కృషికి గాను సత్యనారాయణను ఈ పురస్కారం లభించింది. ఐసీఏఆర్-ఐఐఆర్ఆర్‌లోని రిటైర్డ్ ఐసీఏఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అవార్డును అందించారు.

నేటి నుంచి జీ-20 వ్యవసాయ సదస్సు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: భారత్ అధ్యక్ష స్థానం వహిస్తున్న ఈ ఏడాది జీ-20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో 'వాతావరణ ప్రతికూలతలను తట్టుకోగల వ్యవసాయం' అనే అంశంపై చర్చలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ 'ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఎడ్యుకేషన్', వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలు సెప్టెంబర్ 4, 6 తేదీల మధ్య జరగనున్న చర్చలకు కేంద్రమంత్రి శోభా కరంద్లాజే హాజరు కానున్నారు. వ్యవసాయ పరిశోధనలు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయ పద్ధతులు తదితర అంశాలపై దేశ, విదేశీ ప్రతినిధులు చర్చలు జరపనున్నారు.

60.83 లక్షల మంది అవ్వాతాతలకు రూ.1,675.96 కోట్లు

రాష్ట్రంలో 95 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ,వార్డు వలంటీర్లు ఆదివారం సెలవు రోజైనా కూడా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ కొనసాగించారు. సెప్టెంబర్ నెలకు గాను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 64,04,458 మంది లబ్ధిదారులకు రూ.1,764.83 కోట్లు విడుదల చేయగా..ఆదివారం సాయంత్రానికి 60,83,393 మంది లబ్ధిదారులకు రూ.1,675.96 కోట్లు అందజేశారు. మొత్తం లబ్ధిదారులలో 95 శాతం మందికి పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారి కోసం సోమ, మంగళవారాల్లో వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. మొత్తం 26 జిల్లాలకు 16 జిల్లాల్లో 95 శాతంపైన పంపిణీ పూర్తయినట్టు అధికారులు వివరించారు.



వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన నజీర్‌కు పింఛన్ ఇస్తున్న వలంటీర్ అహ్మద్



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకన్నపాలెంలో వెంగయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ ప్రకాష్‌బాబు



ఏలూరులో ఎండీ సైహనాజ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఎస్‌కే ముంతాజ్

కొత్తగా 1,500 ఈ-బస్సులు

కొనుగోలుకు ఆర్టీసీ నిర్ణయం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) మరిన్ని విద్యుత్ బస్సులు (ఈ-బస్సులు) కొనుగోలు దిశగా కార్యాచరణకు సంసిద్ధమవుతోంది. కొత్తగా 1,500 ఈ-బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డు సర్వీసుల కోసం 100 ఈ-బస్‌లను ఆర్టీసీ ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలకూ వీటి సేవలను విస్తరించాలని నిర్ణయించింది. అందుకోసం రెండో దశ కింద 1,500 ఈ-బస్‌లను ప్రవేశపెట్టనుంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్)తో కలిసి ఆర్టీసీ ఈ బస్సులను తీసుకురానుంది.

డీజిల్ బస్సుల స్థానంలో ఈ-బస్‌లు..

సీఈఎస్ఎల్, ఆర్టీసీ సంయుక్తంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్కో బస్సుకు రూ.కోటి చొప్పున రూ.1,500 కోట్ల బడ్జెట్‌తో ప్రాజెక్టును ఆమోదించాయి. డీజిల్ బస్సుల స్థానంలో ఈ-బస్‌లను

- రూ.1,500 కోట్లతో ప్రాజెక్టుకు సంస్థ ఆమోదం
- జిల్లా కేంద్రాల మధ్య ఈ-బస్ సర్వీసులు
- వీటితో పర్యావరణ పరిరక్షణతోపాటు 27% నిర్వహణ వ్యయం తగ్గుదల

ప్రవేశపెట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు 27 శాతం నిర్వహణ వ్యయం తగ్గుతుంది. ఇక తొమ్మిది మీటర్ల పొడవుండే ఈ-బస్‌లు అయితే కి.మీ.కు రూ.39.21, అదే 12 మీటర్ల పొడవున్న ఈ-బస్ అయితే కి.మీ.కు రూ.43.49 వ్యయం అవుతుందని అంచనా వేశారు.

జిల్లా కేంద్రాల మధ్య ఈ-బస్ సర్వీసులు

రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలతోపాటు ప్రధాన పట్టణాల్లో ఈ-బస్ సేవలను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అందుకే సమీపంలో ఉన్న జిల్లా కేంద్రాల మధ్య ఈ సర్వీసులను నిర్వహించాలని నిర్ణయించారు. మొదటగా విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు డిపోలకు వాటిని కేటాయించనున్నారు. ఆ డిపో కేంద్రాలు ఉన్న జిల్లా కేంద్రాల నుంచి రానూపోనూ 250 కి.మీ. దూరంలో ఉన్న జిల్లా కేంద్రాలతోపాటు ప్రధాన పట్టణాలకు వీటిని నడుపుతారు. ఎందుకంటే ఈ-బస్‌లకు ఓసారి చార్జింగ్ పెడితే గరిష్ఠంగా 250 కి.మీ. వరకు ప్రయాణించే అవకాశం ఉంటుంది. అందుకోసం ఆయా డిపోల్లో చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటుచేస్తారు. ఇక ఆర్టీసీకి వెయ్యి ఈ-బస్‌లను అద్దె విధానంలో అందించేందుకు సీఈఎస్ఎల్ త్వరలో టెండర్ల ప్రక్రియ నిర్వహించనుంది. అనంతరం ఈ ఏడాది చివరి నాటికి వాటిని ఆర్టీసీకి అందజేస్తుంది.

నాలుగేళ్లలోనే డిగ్రీ+బీఈడీ

- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు
- ఐఐటీ, సీయూ, ఎన్ఐటీ వంటి 42 విద్యా సంస్థల్లో అందుబాటులోకి..
- రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాతీయ సంస్కృత వర్సిటీల్లో ఆఫర్
- ప్రవేశాలకు త్వరలో కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: సైన్సు, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ కోర్సుల్లో అందుబాటులో ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఇప్పుడు బోధన రంగంలోనూ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న రెండేళ్ల బీఈడీ కోర్సు స్థానంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ-బీఈడీ, బీఏ-బీఈడీ కోర్సులను దేశంలో 42 ఐఐటీలు, ఐఐఎస్సీ, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, స్టేట్ యూనివర్సిటీలు ప్రారంభించాయి. మనరాష్ట్రంలో శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఈ కోర్సులను అందిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గత నెలలో నిర్వహించిన జాతీయ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-(ఎన్‌సెట్)-2023కు 16,004 మంది దరఖాస్తు చేసుకోగా 10,136 మంది పరీక్షకు హాజరయ్యారు. మరో రెండు మూడు రోజుల్లో ఫలితాలు వెల్లడించి, ఈ నెలలో ప్రవేశ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం ప్రకారం.. ఫౌండేషన్(1 నుంచి 2 తరగతులు), ప్రిపరేటరీ (3-5), మిడిల్ స్టేజ్ (6-8), సెకండరీ స్టేజ్ (9-12 తరగతులు)కు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులను అందిస్తున్నారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సెకండరీ స్టేజ్ (9 నుంచి 12వ తరగతి)కి సంబంధించి ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సును ప్రవేశపెట్టారు.

ఇంటిగ్రేటెడ్ బీఈడీతో ఉన్నత అవకాశాలు

ఎన్‌టీఏ నిర్వహించిన ఎన్‌సెట్ ద్వారా ఈ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు మూడేళ్ల తర్వాత నాలుగో ఏడాది చదవడం ఇష్టం లేకపోతే కోర్సు నుంచి బయటకు వచ్చేసే అవకాశం ఉంది. ఇలాంటి వారికి మూడేళ్ల డిగ్రీ పట్టాను అందిస్తారు. నాలుగేళ్ల కోర్సు పూర్తి చేస్తే పీజీ కోర్సులు చదువుకోవచ్చు.

బోధన రంగాన్ని ఎంచుకునేవారికి మంచి అవకాశాలు..




శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ-బీఈడీ, బీఏ-బీఈడీల్లో 50 చొప్పున సీట్లు ఉన్నాయి. బీఎస్సీ-బీఈడీకి 1,988 మంది, బీఏ-బీఈడీకి 1,020 మంది దరఖాస్తు చేసుకున్నారు. బోధనకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం టీచింగ్ పోస్టులను కూడా మంజూరు చేసింది. నైపుణ్యం గల టీచింగ్ ఫ్యాకల్టీకి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. ఇప్పటివరకు ఉపాధి కోర్సుగా మాత్రమే ఉన్న బీఈడీ కోర్సు బోధన రంగాన్ని ప్రొఫెషన్‌గా తీసుకునేవారికి మంచి అవకాశాలను అందిస్తుంది.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ

అక్షరం అక్షరంలో అక్కసు..

పోలవరం ప్రాజెక్టుపై 'ఈనాడు' మరో అసత్య కథనం

- చంద్రబాబు చారిత్రక తప్పిదాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేయత్నం
- ఆయన కమీషన్ల కక్కుర్తి వల్లే రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య అంచనాలకు మించి చేరిన సీపేజీ నీరు
- వాటిని తక్కువ ఖర్చుతో బయటకు పంపే పద్ధతిపై పీపీఏకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రతిపాదన
- ఆ పనులకు అనుమతి వచ్చేలోగా సన్నాహక పనులు చేస్తామని పీపీఏకు చెప్పిన రాష్ట్ర జలవనరుల శాఖ
- కానీ, తమ అనుమతి లేకుండానే పనులు చేస్తున్నారని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శికి పీపీఏ చెప్పినట్లు చిత్రీకరణ
- దానికి కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి విస్తుపోయారంటూ పచ్చి అబద్ధాలు
- ఆ అంతర్గత సమావేశంలో ఏ బల్ల కిందైనా నక్కి విన్నావా రామోజీ?
- కుక్క తోకలా తన బుద్ధి ఎప్పటికీ వంకరేనని ఎప్పటికప్పుడు చాటుకుంటున్న రామోజీ


పోలవరంలో ఇదేం దారుణం?
కేంద్ర సంస్థల అనుమతి లేకుండానే పనులు
- సీపేజీ నీటిని దిగువకు పంపేందుకు డీప్లీటింగ్ స్లూయిస్ నిర్మాణం
- కేంద్ర జల్‌శక్తి దృష్టికి తీసుకువెళ్లిన పోలవరం అథారిటీ
- విస్తుపోయిన కేంద్ర కార్యదర్శి
- చేయొద్దని చెప్పినా రాష్ట్రం వినడం లేదన్న పీపీఏ

సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు చేసిన తప్పులను సీఎం వైఎస్ జగన్‌కు ఆపాదించడం.. వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వంపై బురదజల్లుతూ నీతిమాలిన రోత రాతలను అచ్చేయడంలో తనకు అలుపే లేదని రామోజీరావు ఎప్పటికప్పుడు చాటిచెప్పుకుంటున్నారు. కుక్క తోకలా తన బుద్ధి ఎప్పటికీ వంకరేనని చాటుకోవడానికి ఆయనకు ఆయనే తెగ పోటీపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రోత రాతలను అచ్చేయడాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే 'పోలవరంలో ఇదేం దారుణం?' శీర్షికన 'ఈనాడు'లో తాజాగా ప్రచురించిన కథనం. ఆ కథనంలోని ప్రతి అక్షరంలో కాంట్రాక్టర్‌గా తన కొడుకు వియ్యంకుడిని తప్పించారనే కోపం.. డీపీటీ (దోచుకో పంచుకో తినుకో)కి అడ్డుకట్టపడిందనే అక్కసు.. చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేస్తూ సీఎం వైఎస్ జగన్ పోలవరాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తుండటంపై అసూయ కన్పించింది తప్ప అందులో వీసమెత్తు నిజంలేదు. అసలు నిజాలు ఇవీ..

> **ఈనాడు ఆరోపణ:** ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీపై తప్పుడు ఫార్ములాతో తప్పిన అంచనాలు..
>
> **వాస్తవం:** ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ముందే సీపేజీపై ఐఐటీ నిపుణులు అంచనా వేసినప్పుడు.. పునాదిని జెట్ గ్రౌటింగ్‌తో పటిష్ఠవంతం చేస్తే సీపేజీ పరిమితికి లోబడే ఉంటుందని లెక్కించారు. కానీ, టీడీపీ సర్కారు కమీషన్ల కోసం ప్రాజెక్టును పణంగా పెట్టింది. ప్రాజెక్టు ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు చేపట్టి.. వాటిని పూర్తిచేయలేక ఖాళీ ప్రదేశాలను వదిలేయడం వల్ల 2019-20లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఎగువ కాఫర్ డ్యామ్ జెట్ గ్రౌటింగ్ కూడా దెబ్బతింది. దీనివల్లే సీపేజీ అధికంగా ఉంది. చంద్రబాబు సర్కార్ తప్పిదాలను వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేసేందుకే అభూత కల్పనలతో కథనాన్ని వండివార్చావన్నది వాస్తవం కాదా రామోజీ?



***ఈనాడు ఆరోపణ:* రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య సీపేజీ (ఊట నీరు) అంచనాలకు మించి 30 రెట్లు అధికంగా వచ్చింది..**

వాస్తవం: కమీషన్లకోసం కక్కుర్తి పడి పోలవరం నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న చంద్రబాబు.. రూ.2,917 కోట్ల విలువైన పనులను రామోజీరావు కొడుకు వియ్యంకుడికి చెందిన నవయుగకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేశారు. ప్రాజెక్టు ప్రోటోకాల్‌కు విరుద్ధంగా.. సులభంగా చేయగలిగి, అధికంగా లాభాలొచ్చే పనులు చేపట్టి, కమీషన్లు వసూలుచేసుకుని డీపీటీ విధానంలో పంచుకుతిన్నారు. ఈ క్రమంలోనే గోదావరి వరదను మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలెట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేయకుండానే ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి చంద్రబాబు సర్కార్ చారిత్రక తప్పిదం చేసింది. ఇందులో మరో ఘోరం ఏమిటంటే.. కమీషన్లు రావనే నెపంతో నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పాక్షికంగా నిర్మించి, ఇరువైపులా 650 మీటర్ల ఖాళీ ప్రదేశం.. దిగువ కాఫర్ డ్యామ్‌ను పాక్షికంగా నిర్మించి, రెండు వైపులా 480 మీటర్ల ఖాళీ ప్రదేశం ఉంచింది. కాఫర్ డ్యామ్‌లు అనేవి తాత్కాలిక కట్టడాలు మాత్రమే. వాటి పునాదుల గుండా సీపేజీ రాకుండా సాధారణంగా జెట్ గ్రౌటింగ్ విధానాన్ని ఎంచుకుంటారు. ఈ పద్ధతిలో ఎగువ కాఫర్ డ్యామ్ పునాదిని పటిష్ఠపరిచారు. 2019-20లో గోదావరికి వచ్చిన భారీ వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారింది. టీడీపీ సర్కార్ ఎగువ కాఫర్ డ్యామ్‌లో వదిలేసిన ఖాళీ ప్రదేశాల గుండా 13.5 మీటర్లు/సెకను అంటే గంటకు దాదాపు 40 కిమీల వేగంతో ఆ వరద ప్రవహించడంవల్ల జెట్ గ్రౌటింగ్ బలహీనపడి సీపేజీ అనుకున్న దానికంటే ఎన్నో రెట్లు పెరిగింది. దానివల్లే రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్యలోకి సీపేజీ నీరు చేరుతోంది. దీనికి పూర్తి బాధ్యత టీడీపీ సర్కార్‌దే. కానీ, మీ దోపిడీని కప్పిపుచ్చుకునే క్రమంలో ఆ చారిత్రక తప్పును వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేస్తే ఎలా రామోజీ?

***ఈనాడు ఆరోపణ:* రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య చేరిన సీపేజీ నీటిని బయటకు పంపేందుకు డీప్లీటింగ్ స్లూయిస్ నిర్మాణాన్ని తమ అనుమతి లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని.. ఇది చెయొద్దని చెప్పినా వినడంలేదని నాలుగు రోజుల క్రితం జరిగిన అంతర్గత సమావేశంలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దృష్టికి పీపీఏ అధికారులు తీసుకెళ్లారు. దీనికి ఆయన విస్తుపోయారు..**

వాస్తవం: రామోజీరావు జర్నలిజం విలువల పతనానికి ఇది పరాకాష్ట. కేంద్ర జల్‌శక్తి శాఖ అంతర్గత సమావేశాలు నిర్వహించడం సాధారణమే. ఆ క్రమంలోనే గతనెల 29న ఓ సమావేశాన్ని నిర్వహించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం తమ మాట వినడంలేదని.. అనుమతులు తీసుకోకుండానే రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్య చేరిన సీపేజీ నీటిని బయటకు పంపేందుకు దిగువ కాఫర్ డ్యామ్ కుడి గట్టున బటర్‌ఫ్లై తూము నిర్మిస్తున్నారని పీపీఏ అధికారులు ఫిర్యాదు చేసినట్లు.. దీనికి కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి విస్తుపోయినట్లుగా అవాస్తవాలను రామోజీరావు చిత్రీకరించారు. ఆ సమావేశంలో ఏ బల్ల కింద నక్కి విన్నావ్ రామోజీ? అసలు జరిగిన విషయం ఏమిటంటే.. రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్యన చేరిన సీపేజీ నీటిని బయటకు పంపే పద్ధతిని సాంకేతికంగా మదింపు చేసి.. నిపుణులతో చర్చించి ఆర్థికంగా తక్కువ భారమయ్యేలా ఓ ప్రతిపాదనను పీపీఏకు రాష్ట్ర జలవనరుల శాఖ సమర్పించింది. దిగువ కాఫర్ డ్యామ్‌కు ఆనుకుని కుడి వైపున ఉన్న తిప్పకు అంచులో పైపు తూములు నిర్మించి.. వాటికి నాన్-రిటర్న్ వాల్వులు అమర్చి.. వాటి ద్వారా సముద్ర మట్టానికి 18 మీటర్ల ఎత్తు వరకు ఉన్న నీటిని గ్రావిటీపై బయటకు పంపి, మిగిలి ఉన్న నీటిని పంపుల ద్వారా తోడిపోసే విధానాన్ని సూచించింది. ఆ ప్రతిపాదనకు అనుమతి వచ్చేలోగా విలువైన సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో పీపీఏకు సమాచారమిచ్చే సన్నాహక పనులనే జలవనరుల శాఖ చేపట్టింది. ఇదీ వాస్తవం.

ఏకరూప పంచాయతీలపై కసరత్తు!

సాక్షి, అమరావతి: ఒకే దేశం-ఒకేసారి ఎన్నికలపై విధాన నిర్ణయం తీసుకునేందుకు యోచిస్తున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. దేశంలోని పంచాయతీలలో ఏకరూపత సాధించే దిశగా చర్యలు చేపడుతోంది. కనీస నిర్ణీత జనాభా సంఖ్య ఆధారంగా దేశమంతటా గ్రామ పంచాయతీలను పునర్విభజన జరిపే ఆలోచన చేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో తీరుగా.. ఒకే రాష్ట్రంలోనూ వేర్వేరు పంచాయతీలలో ఉండే జనాభా సంఖ్య మధ్య ఊహించని స్థాయిలో వేల సంఖ్యలో వ్యత్యాసాలు ఉన్నాయి. ఒక్కొక్క చోట 15 వేల నుంచి 20 వేల జనాభా ఉండే ఓ పెద్ద గ్రామ పంచాయతీగా ఉంటుంటే.. కొన్నిచోట్ల 500 జనాభా ఉండే గ్రామం మరో పంచాయతీగా ఉంటోంది.

- దేశమంతటా ఒకే తీరున గ్రామ పంచాయతీలు
- ప్రతి పంచాయతీలో నిర్ణీత జనాభా ఉండేలా పునర్విభజన
- కేంద్ర పంచాయతీరాజ్ శాఖ యోచన
- నేటినుంచి హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో వర్క్‌షాప్

ఉదాహరణకు రాష్ట్రంలో 13,300కి పైగా గ్రామ పంచాయతీలు ఉండగా.. ఒక్కో పంచాయతీ సరాసరి జనాభా 2,800 వరకు ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అక్కడ ఒక్కో పంచాయతీలో 20 వేలకు పైనే..

కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో సరాసరి జనాభా 20 వేలకు పైబడి ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. కేరళ వంటి రాష్ట్రంలో అతి చిన్న గ్రామ పంచాయతీలో సైతం 10 వేలకు తక్కువ జనాభా ఉండదని చెబుతున్నారు. మన రాష్ట్రంలో వందలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు సైతం ఉండగా.. 30 వేల జనాభా గల గ్రామాలు కూడా పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశమంతటా అన్ని రాష్ట్రాల్లో ఏకరీతిన కనీస ఓ నిర్దిష్ట జనాభా సంఖ్య ఆధారంగా గ్రామ పంచాయతీలను పునర్విభజన చేయడం ద్వారా గ్రామీణ స్థానిక సంస్థల స్థాయిలోనూ మెరుగైన, సమర్థవంతమైన పరిపాలనకు అవకాశం ఉంటుందా అన్న దానిపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ రాష్ట్రాలతో సంప్రదింపులు చేపట్టింది.

నేడు, రేపు వర్క్‌షాప్

చాలా రాష్ట్రాల్లో జిల్లా స్థాయిలో జెడ్పీ చైర్మన్ల ఎన్నిక పరోక్ష పద్ధతిన కొనసాగుతోంది. కానీ ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానాన్ని తేవడం వంటి స్థానిక సంస్థల స్థాయిలో పరిపాలనకు సంబంధించి అనేక అంశాలపై అవసరమైతే చట్ట సవరణలు తెచ్చేందుకు సోమ, మంగళవారాల్లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అన్ని రాష్ట్రాల అధికారులు ప్రతినిధులతో హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మన రాష్ట్రం నుంచి 9 మంది, 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 261 మంది హాజరవుతున్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి ప్రతి రెండు విడతలకోసారి రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్ల మార్పులు, చేర్పులు చేసుకునే అంశాన్ని వర్క్‌షాప్ అజెండాలో చేర్చారు.

■ తెలంగాణ

జ్ఞాపకశక్తిలో భళా దేవాన్షి

- బాలమేధావికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- చిన్నారి వయసు ఏడాది 9 నెలలు



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన చిన్నారి దేవాన్షి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): అద్భుత మేధస్సు.. అమోఘమైన జ్ఞాపకశక్తి ఆ చిన్నారి సొంతం. ఒక్కసారి చెబితే చాలు.. గుర్తించి దాని పేర్లను చెబుతుంది. ఏడాది 9 నెలల వయసున్న ఆ బాల మేధావి అసమాన ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2023లో చోటు సంపాదించింది. రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన బండారి విజయేంద్ర, మౌనిక దంపతుల కుమార్తె దేవాన్షి.. వస్తువులను గుర్తించడం, అంకెలను ఒకటి నుండి పది వరకు చెప్పడం, ఐదు రకాల జంతువుల్లా అరవడంలో దిట్ట. దీంతో కుటుంబ సభ్యులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిని సంప్రదించారు. వారి సూచనల ప్రకారం కుమార్తె ప్రతిభపై చిత్రీకరించిన వీడియోలు వంటివి సమర్పించారు. ఆ వీడియోలో దేవాన్షి 15 బొమ్మలు, ఆరు శిశువు ఉత్పత్తులు, తొమ్మిది కూరగాయలు, ఐదు కార్టూన్ పాత్రలు, శరీరంలోని 11 భాగాల చిత్రాలను గుర్తించినట్టు చూపించారు. అదనంగా 6 రైమ్‌లు, 10 యాక్షన్ పదాలు, 1 నుంచి 10 వరకు సంఖ్యలను లెక్కించడం, ఐదు జంతువుల శబ్దాలను అనుసరించడం వంటివి రికార్డు చేశారు. వాటిని పరిశీలించిన నిర్వాహకులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు కల్పించారు.

నేడు వివిధ మార్గాల్లో పలు రైళ్ల రద్దు

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక కారణాల దృష్ట్యా వివిధ మార్గాల్లో 20 దూరప్రాంతాల రైళ్లను, నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే మరో 16 ఎంఎంటీఎస్ రైళ్లను ఈ నెల 4 నుంచి 10 వరకు రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాజీపేట్-డోర్నకల్, విజయవాడ-డోర్నకల్, భద్రచాలం రోడ్-డోర్నకల్, కాజీపేట్-సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష- కాజీపేట్, సికింద్రాబాద్-వరంగల్, సిర్పూర్ టౌన్-భద్రాచలం, వరంగల్- హైదరాబాద్, కరీంనగర్-సిర్పూర్‌టౌన్, కరీంనగర్-నిజామాబాద్, కాజీపేట్-బల్లార్ష తదితర మార్గాల్లో రైళ్లు రద్దు కానున్నట్లు పేర్కొన్నారు.

ఎంఎంటీఎస్‌లు రద్దు: ఈ నెల 4 నుంచి 10 వరకు లింగంపల్లి-నాంపల్లి, లింగంపల్లి-ఫలక్‌నుమా, ఉందానగర్-లింగంపల్లి, నాంపల్లి-లింగంపల్లి, తదితర మార్గాల్లో 16 సర్వీసులు రద్దు కానున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా...

కొలంబోకు ఐఎన్ఎస్ ఢిల్లీ



బీచ్ క్లీనప్ డ్రైవ్‌లో శ్రీలంక, భారత్ నేవీ సిబ్బంది

సింధియా(విశాఖ పశ్చిమ): భారత నావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ ఢిల్లీ రెండు రోజుల పోర్ట్‌సిటీ పర్యటన అనంతరం ఆదివారం శ్రీలంక రాజధాని కొలంబోకు బయలుదేరి వెళ్లింది. శ్రీలంక నేవీ షిప్ విజయబాహుతో కలిసి సముద్ర భాగస్వామ్య విన్యాసంతో ఐఎన్ఎస్ ఢిల్లీ పర్యటన ముగుస్తుంది. భాగస్వామ్య విన్యాసాల్లో భాగంగా క్రో ఐలాండ్ బీచ్ వద్ద ఇరు దేశాల నేవీ సిబ్బంది సంయుక్తంగా బీచ్ క్లీనప్ డ్రైవ్‌ను చేపట్టారు.

వక్ఫ్ భూముల స్వాధీనానికి చర్యలు

డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 680 ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. వీటి స్వాధీనానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ముతావల్లిల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే వక్ఫ్ బోర్డు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

'పాస్‌పోర్టుల జారీ సులభతరం'

రాజంపేట: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పాస్‌పోర్టుల జారీని సులభతరం చేసేందుకు శాఖాపరంగా చేసిన కృషి ఫలించిందని విదేశీ వ్యవహారాల రాష్ట్ర విభాగాల డైరెక్టర్ (ఢిల్లీ) శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం అన్నమయ్య జిల్లా నందలూరు వచ్చారు. మాజీ ఎంపీపీ భువనబోయిన లక్ష్మీనరసయ్య స్వగృహంలో శ్రీనివాసులరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డు జారీ కంటే త్వరగా పాస్ట్‌పోర్టును లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. పాస్‌పోర్టు జారీలో అనేక నిబంధనలను సడలించామని తెలిపారు.

కృష్ణా జలాల కేటాయింపుపై వివాదం

సాక్షి, అమరావతి: కృష్ణా జలాల కేటాయింపులపై త్రిసభ్య కమిటీ రూపొందించిన ప్రతిపాదనలపై వివాదం రేగింది. గత నెల 21న కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే కన్వీనర్‌గా రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఈ భేటీకి తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ గైర్హాజరయ్యారు. కన్వీనర్ డీఎం రాయ్‌పురే, ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సమావేశమై నీటి కేటాయింపులకు సంబంధించి తెలంగాణ ఈఎన్‌సీ పంపిన ప్రతిపాదనల ఆధారంగా చర్చించారు. అనంతరం ఈ నెలాఖరు వరకు తాగునీటి అవసరాల కోసం ఏపీకి 25.29, తెలంగాణకు 6.04 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డుకు ప్రతిపాదించడానికి సిఫార్సు చేస్తూ రూపొందించిన మినిట్స్‌పై అభిప్రాయాలు చెప్పాలంటూ రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలను శుక్రవారం త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయ్‌పురే కోరారు. కృష్ణా బోర్డు అనుమతి లేకుండా తెలంగాణ జెన్‌కో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి కోసం వినియోగించుకున్న నీటిని ఆ రాష్ట్ర కోటాలో కలపాలని, ఆ మేరకు ఏపీకి నీటి కేటాయింపులు పెంచాలని ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఇప్పటికే త్రిసభ్య కమిటీకి తేల్చిచెప్పారు.

ఆస్పత్రి నుంచి కుమారస్వామి డిశ్చార్జి

శివాజీనగర: భగవంతుడు ఇది తనకు ఇచ్చిన మూడోజన్మ అని జేడీఎస్ నేత, కర్ణాటక మాజీ సీఎం హెచ్.డి.కుమారస్వామి చెప్పారు. తీవ్ర అనారోగ్యంతో బెంగళూరు బన్నేరుఘట్టలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న ఆయన ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తీవ్ర జ్వరం, చిన్నపాటి పక్షవాతానికి గురయ్యానని చెప్పారు. భగవంతుని దయ, తల్లిదండ్రుల ఆశీర్వాదంతో కోలుకున్నట్లు తెలిపారు. గత ఐదు రోజుల నుంచి మిత్రులు ఆందోళన చెందారన్నారు. ఎవరూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఇందుకు పేద, ధనిక తారతమ్యం లేదని చెప్పారు. తాను అనారోగ్యంతో ఆస్పత్రిపాలు కావడం ఇది మూడోసారి అని, తల్లిదండ్రుల దయతో గట్టెక్కానని ఆయన పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో తెలంగాణ కాంగ్రెస్ నేతకు నోటీసులు

శివాజీనగర: మహిళపై అత్యాచారం, బెదిరింపుల కేసులో విచారణకు హాజరు కావాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డికి బెంగళూరులోని కబ్బన్‌పార్కు పోలీసులు నోటీసులు జారీచేశారు. ఆయన తెలంగాణలోని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఒక మహిళను బెంగళూరులోని స్టార్ హోటల్‌కు పిలిపించి మత్తు మందు కలిపిన పండ్లరసం ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు అతనిపై కేసు నమోదైంది. అత్యాచారానికి పాల్పడి, వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు సదరు మహిళ కబ్బన్‌పార్క్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరవ్వాలని పోలీసులు నోటీసులిచ్చారు.

పీజీ వైద్య సీట్లపై ఎందుకీ ఫీట్లు?

ఎన్ఎంసీ నుంచి నకిలీ అనుమతులు వెలువడితే ఆ మచ్చను ప్రభుత్వానికి అంటగట్టే యత్నం

- శాంతిరాంపై సోదాల విషయంలో నాటి లోకేశ్ ట్వీట్‌ను దాచిపెట్టిన 'పచ్చ'ముఠా
- ఏపీతోపాటు తమిళనాడులోనూ ఇదే తరహా వ్యవహారం వెలుగుచూసిన విషయం మరిచావా రామోజీ?
- కేవలం ఏపీలోనే ఫేక్ అనుమతులు వచ్చినట్లు రాతలా?
- ఎప్పటిలాగే వాస్తవాలు కప్పిపుచ్చి ఈనాడు రోత రాతలు



సాక్షి, అమరావతి: ఉల్లిపాయను ఎంత ఉడకబెట్టినా దాని కంపు పోదు.. చింతకాయను ఎంత చితక్కొట్టినా దాని పులుపు పోదు.. అలాగే, రామోజీ రాతల రంకు రోజూ బయటపడుతున్నా ఆయన సిగ్గుపడడు. ఎందుకంటే ఆయన రామోజీ కనుక. ప్రభుత్వంపై బురద జల్లడం, నిందలు ఆపాదించడం ఆయనకు పెన్నుతో పెట్టిన విద్య. ఆ లక్షణంతోనే ఆయన కళ్లు మూసుకుని నిజానిజాలు తెలుసుకోకుండా గుడ్డిగా ఏదిపడితే అది రాసిపారేస్తున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నుంచి వైద్య కళాశాలలకు అదనపు పీజీ సీట్ల మంజూరులో జరిగిన అవకతవకల్లో రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతూ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడు. 'పీజీ వైద్య సీట్ల కోసం అక్రమాల దందా' అంటూ ఈనాడు పత్రికలో ఆదివారం కథనం రాసుకొచ్చారు. ఈ సీట్ల పెంపుపై ఎన్ఎంసీ నుంచి నకిలీ లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌ఓపీ)లు సృష్టించారు. ఈ వ్యవహారంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కళ్లు మూసుకుందని.. రాష్ట్ర ప్రభుత్వంపై మరో మచ్చ పడిందని రామోజీరావు తెగ గగ్గోలు పెట్టారు. ఢిల్లీలో కేంద్రం అజమాయిషీలో పనిచేసే ఎన్ఎంసీ పేరిట నకిలీ ఎల్‌ఓపీలు వస్తే ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంపై మచ్చ పడటం ఏమిటి?.. అసలు రామోజీరావుకు ఏమైంది..? మరీ ఇంతలా ఎందుకు దిగజారుతున్నారని మేధావులు సైతం మండిపడుతున్నారు. ఈ విషయంలో రామోజీ రాతల వెనుక వాస్తవాలను పరిశీలిస్తే..

ఎన్ఎంసీనే అప్రమత్తం చేసిన ప్రభుత్వం

2023–24 విద్యా సంవత్సరంలో పీజీ సీట్ల పెంపుదలకు సంబంధించి నంద్యాల జిల్లా శాంతిరాం వైద్య కళాశాల సమర్పించిన ఎల్‌ఓపీ నకిలీదని ఆగస్టు 29న ఎన్ఎంసీ ఆరోగ్య విశ్వవిద్యాలయం దృష్టికి తీసుకొచ్చింది. దీంతో అప్రమత్తమైన విశ్వవిద్యాలయం అధికారులు అప్పటివరకూ నిర్వహించిన పీజీ అడ్మిషన్ల ప్రక్రియను నిలిపివేశారు. శాంతిరాంలో 25 సీట్లు కాగా, అదనంగా మరో 74 సీట్లకు ఎల్‌ఓపీలు జారీ అయినట్లు గుర్తించారు. వెంటనే రాష్ట్రంలో ఇతర వైద్య కళాశాలలు సమర్పించిన ఎల్‌ఓపీలను నిశితంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో రాజమండ్రి జీఎస్ఎల్, విజయనగరం మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కూడా ఇలాంటి తతంగమే చోటుచేసుకుందని గుర్తించారు. ఈ విషయం సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే నకిలీ అనుమతుల వ్యవహారంపై ఎన్ఎంసీకి లేఖ రాయాలని ఆయన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టాలంటూ ఎన్ఎంసీని కోరాలని, విచారణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారాన్ని అందించాలని సూచించారు. దీంతో గత నెల 31న వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎన్ఎంసీకి లేఖ రాశారు. దీన్నిబట్టి చూస్తే.. కాస్త ఇంగితం ఉన్న ఎవ్వరికైనా ప్రభుత్వమే ఎన్ఎంసీని అప్రమత్తం చేసిందని అర్థమవుతుంది.

వాస్తవాలకు పాతరేయడమే రామోజీ లక్ష్యం..

ఇలా నకిలీ పీజీ సీట్ల అనుమతుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, మన విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు చేపడితే ఆ విషయాలను కప్పిపుచ్చి ఏదోకలా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా రామోజీ కుట్రచేశారు. మొత్తం వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వ తప్పిదంగా, రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థల్లో లోపంగా చూపించేందుకు వాస్తవాలను వక్రీకరించేందుకు తెగ తాపత్రయపడ్డారు. పైగా రాజకీయాలను ఆపాదిస్తూ ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేశారు. శాంతిరాం కళాశాల యజమాని వైఎస్సార్‌సీపీలో ఇటీవలే చేరారని, అందుకనే ఇది జరిగిందన్నట్లుగా ఈనాడు ఒక ముద్రవేసే ప్రయత్నం చేసింది. శాంతిరాం కళాశాల యజమాని ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన మాట వాస్తవమే. కానీ, కొద్దిరోజుల కిందటి వరకూ ఆయన ఏ పార్టీలో ఉన్నారన్న విషయాన్ని రామోజీ ఎందుకు దాచిపెట్టారు?.

నాటి లోకేశ్ ట్వీట్ ఊసెత్తని రామోజీ..

2019లో ఐటీ శాఖ తమ మద్దతుదారుడైన శాంతిరాంపై సోదాలు చేస్తోందని, మోడీ తీరును ఖండిస్తున్నామంటూ అప్పట్లో చంద్రబాబు తనయుడు లోకేశ్ చేసిన ట్వీట్‌లోని అంశాలను విస్మరించి రాతలు రాయడం రామోజీరావు నిస్సిగ్గుతనానికి నిదర్శనం. నిజానికి.. ఎల్‌ఓపీల జారీలో గోల్‌మాల్ జరిగింది ఢిల్లీలోని ఎన్ఎంసీలో.. అది రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వ్యవస్థ కాదని రాజగురువింద రామోజీకి తెలీదా? దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఆపాదించడం ఎంత వరకు సబబని వైద్య వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక కాలేజీలో తప్పు జరిగిందని తెలిసిన వెంటనే మిగిలిన కళాశాలలను పరిశీలించి స్వయంగా ప్రభుత్వమే ఎన్ఎంసీని అప్రమత్తం చేస్తే సక్రమంగా పనిచేసినట్లు కాదా రామోజీ? నకిలీల వ్యవహారంపై పూర్తిగా విచారణకు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వమే ఆదేశాలు జారీచేస్తే, ఈనాడు మాత్రం ఇక్కడే ఏదో జరిగిపోయినట్లు వక్రీకరణలు చేయడం రామోజీ దిగజారుడుతనానికి నిదర్శనం. అలాగే, ఏపీతోపాటు తమిళనాడులోనూ ఇదే తరహా వ్యవహారం వెలుగుచూసిన విషయం రామోజీ మరిచినట్లున్నారు?

మూడు వైద్య కళాశాలల్లో పీజీ సీట్లకు సంబంధించి హెల్త్ వర్సిటీ గుర్తించిన అంశాలిలా..

కోర్సు	ఎన్ఎంసీ కేటాయించిన సీట్లు	నకిలీ సీట్లు
జీఎస్ఎల్		
ఎండీ-జనరల్ మెడిసిన్	24	16
ఎంఎస్-ఓబీజీ	15	10
ఎండీ-అనస్థీషియాలజీ	8	7
ఎండీ-డెర్మటాలజీ	4	11
ఎంఎస్-జనరల్ సర్జరీ	24	16
ఎండీ-రేడియేషన్ అంకాలజీ	2	3
మొత్తం	77	63
శాంతిరాం		
ఎండీ-ఓబీజీ	2	13
ఎండీ-జనరల్ మెడిసిన్	7	17
ఎండీ-ఆప్తమాలజీ	4	6
ఎంఎస్-జనరల్ సర్జరీ	4	13
ఎండీ-రెస్పిరేటరీ మెడిసిన్	2	3
ఎంఎస్-ఈఎన్‌టీ	1	3
ఎండీ-పీడియాట్రిక్స్	2	9
ఎండీ-అనస్థీషియాలజీ	3	10
మొత్తం	25	74
మహారాజా		
ఎండీ-అనస్థీషియాలజీ	4	14
ఎండీ-రేడియో డయగ్నోసిస్	15	9
మొత్తం	19	23



దొరికిపోయిన గజదొంగ

- ఐటీ నోటీసులపై తేలు కుట్టిన దొంగలా చంద్రబాబు తీరు: కురసాల కన్నబాబు
- చిన్న కాంట్రాక్టుల్లోనే రూ.118 కోట్లు నొక్కేశారు
- 14 ఏళ్లు సీఎంగా బొక్కిందెంత?
- ఐటీ శాఖే నిగ్గు తేల్చినా ఎల్లో మీడియా ఎందుకు రాయడం లేదు?



సాక్షి ప్రతినిధి, కాకినాడ: మాజీ సీఎం చంద్రబాబు అవినీతి వ్యవహారాలపై సాక్షాత్తూ ఐటీ శాఖే నిగ్గు తేల్చినా పచ్చ మీడియా ఎందుకు కథనాలు రాయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. 'చంద్రబాబు దొరికిన దొంగ.. గజదొంగ! చిన్న కాంట్రాక్టుల్లోనే రూ.118 కోట్లు నొక్కితే 14 ఏళ్లు సీఎంగా బొక్కిందెంత? రామోజీ, ఏబీఎన్ రాధాకృష్ణ, బీఆర్ నాయుడు కళ్లకు ఇవి కనిపించడం లేదా? ఈ బాగోతాన్ని రాయాలనిపించడం లేదా?' అని నిలదీశారు. పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తి ఈ అవినీతిని ప్రశ్నిస్తారని తాను అనుకోవడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, చంద్రబాబుకు సొంత వదినే కాబట్టి ఆమె మాట్లాడటం లేదని, ఇక కమ్యూనిస్టులు ఎలాగూ స్పందించరని చెప్పారు. కన్నబాబు ఆదివారం కాకినాడలో మీడియాతో మాట్లాడారు.

తెహల్కా ఎప్పుడో చెప్పింది

చంద్రబాబు తనను ఎవరూ ఏమీ చేయలేరని, సచ్ఛీలుడినని కితాబు ఇచ్చుకుంటున్నారు. జాతీయ మీడియా కథనాలతో ఆయన ఎంత దుర్మార్గమైన అవినీతి చేశారో బహిర్గతమైంది. ఆరోపణలకు సమాధానం చెప్పకుండా వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు షోకాజ్‌పై దాటవేత వైఖరి అనుసరిస్తున్నారు. చంద్రబాబుకు డబ్బులు అందాయనడానికి వాట్సాప్ చాట్స్, ఈ-మెయిల్ ఆధారాలున్నాయని ఐటీశాఖ స్పష్టం చేసింది. చిన్న కాంట్రాక్టుల్లోనే చంద్రబాబు ఇంత డబ్బు నొక్కేశారంటే ఆయన ఎంత పెద్ద గజదొంగ అయి ఉంటాడు? ఇంత జరిగినా చంద్రబాబు నోరు విప్పట్లేదు. ఆయన వందిమాగధులు, భజన బృందాలు స్పందించడం లేదు. ఎల్లో మీడియా అసలే మాట్లాడదు. కాకినాడలో నిర్వహించిన పార్టీ జోన్-2 సమావేశంలో ఈ విషయాన్ని ఎందుకు ఖండించలేకపోయావు బాబూ? కనీసం నీ కార్యకర్తలకైనా సమాధానం చెప్పే దమ్ము లేదంటే తప్పు జరిగిందనే విషయం అర్థమవుతోంది. చంద్రబాబు ఎలా అవినీతి సామ్రాజ్యం నిర్మించుకున్నాడో 1999లోనే తెహల్కా చెప్పింది. ఓటుకు కోట్లు కేసు ద్వారా కూడా ఆయన వద్ద ఎంత అవినీతి సొమ్ము పేరుకు పోయిందో వెల్లడైంది.

లోకేశ్ పాత్ర కూడా..

ఈ అవినీతి బాగోతంలో చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ పేరు కూడా చెబుతున్నారు. చిన్నచిన్న రాజకీయ ఆరోపణలకే పరువు నష్టం దావా వేసిన చరిత్ర మీ హెరిటేజ్‌కు, మీకు ఉంది కదా! మీ అవినీతిని బహిర్గతం చేసిన జాతీయ మీడియాపై పరువు నష్టం దావా వేసే దమ్ముందా? తేలు కుట్టిన దొంగల్లా ఎందుకున్నారు? 2014లో చంద్రబాబు 650 అంశాలతో ఇచ్చిన మేనిఫెస్టోకే దిక్కు లేదు. ఎన్నికలు కాగానే దాన్ని మాయం చేశారు. అధికారంలోకి వస్తానని ఆయనకే నమ్మకం లేదు. ఇక ఆయన ప్రజలకు గ్యారెంటీ ఇవ్వడం ఏమిటి? గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి లాస్ట్ బాల్ అన్నట్లుగా చంద్రబాబు సూపర్ సిక్స్ అంటున్నారు. ఆయనకు రాజకీయ భవిష్యత్తు ఎలాగూ లేదు. పార్టీ ఉంటుందో లేదో తెలియదు. కచ్చితంగా బౌండరీలో క్యాచ్ ఇచ్చి నిష్క్రమిస్తారు.

కస్టడీలోకి తీసుకుని విచారించాలి

- చంద్రబాబు అవినీతిపై కేంద్ర సంస్థలు దర్యాప్తు చేయాలి: మాజీ ఎమ్మెల్సీ డొక్కా వరప్రసాద్
- నైతిక బాధ్యత నుంచి తప్పించుకోలేరు



సాక్షి, అమరావతి: ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎందుకు నోరు విప్పడం లేదని మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ నిలదీశారు. చంద్రబాబు అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు సమాధానం చెప్పాల్సిన నైతిక బాధ్యత చంద్రబాబుపై ఉందని, దీని నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబుకు ఐటీ శాఖ షోకాజ్ నోటీసు ఇచ్చి సమాధానం అడిగింది. సమాధానం చెప్పడంలో ఆలస్యం అయితే చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాలి. నోటీసులు ఎవరు ఇవ్వాలో కూడా ఆయనే చెబుతారా? కేంద్రంలో అనేక ప్రభుత్వాలను నడిపించానని చెప్పుకునే చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పరు? తన చేతికి కనీసం ఒక రింగు కూడా లేదని పదేపదే చెప్పుకునే చంద్రబాబు ఇప్పుడు ఏమంటారు? విక్కీ జైన్, మనోజ్ పార్థసాని ఎవరో చంద్రబాబుకు తెలీదా? విక్కీ జైన్ ద్వారా చంద్రబాబుకు డబ్బు చేరవేశారని ఐటీ శాఖ చెబుతోంది. విక్కీ జైన్ ఎవరో తెలియదని చంద్రబాబును చెప్పమనండి. వాళ్ల వాట్సాప్ చాట్స్‌లో ఈ వివరాలన్నీ ఉన్నాయి. ఐటీ శాఖ క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తే మరిన్ని డబ్బుల వివరాలు బయట పడతాయి. తక్షణం విక్కీ జైన్, మనోజ్ పార్థసానిని కస్టడీలోకి తీసుకుని ప్రజాధనాన్ని ట్రెజరీకి అప్పజెప్పాలి. అమరావతిలో చంద్రబాబు అవినీతిలో దొరికింది కొంతే. అనేక లావాదేవీల్లో ఐటీ శాఖ కేవలం రూ.118 కోట్లను మనోజ్ పార్థసాని ద్వారా పట్టుకుంది. చంద్రబాబుకు ఐటీ నోటీసులపై ఎల్లో మీడియా ఒక్క ముక్క కూడా రాయదు. ఆ చానళ్లలో ఒక్కరూ చర్చించరు. ఆ పత్రికలు చాలా విషయాలు రాస్తాయి. మరి బాబు అవినీతిపై ఎందుకు దాస్తున్నాయి? రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాత్రమే రాస్తారా? ప్రజాధనం దుర్వినియోగంపై వార్తలను ప్రజలకు అందివ్వరా?' అని మాణిక్యవరప్రసాద్ ప్రశ్నించారు.

ఒక్క హామీని కూడా సీఎం జగన్ నెరవేర్చలేదు

టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



దాడిలో గాయపడిన నాగరాజు



స్థానికులను కొడుతున్న లోకేశ్ వలంటీర్లు

గణపవరం/నిడమర్రు: సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధికి దూరం చేశారని, ఇలాంటి ముఖ్యమంత్రిని సాగనంపుదామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఆదివారం రాత్రి ఏలూరు జిల్లా గణపవరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఇచ్చిన ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. కాగా, ఉంగుటూరు నియోజకవర్గం పెదనిండ్రకొలనుకు లోకేశ్ పాదయాత్ర చేరుకోగానే... గ్రామానికి చెందిన టీటీడీ పాలక మండలి సభ్యుడు గాదిరాజు వెంకటసుబ్బరాజు(పెదబాబు) ఫ్లెక్సీపై టీడీపీ నాయకులు రాయి విసరడంతో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పెదబాబు అభిమానులు ప్రశ్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలతో పాటు యువగళం వలంటీర్లు మూకుమ్మడిగా వారిపై దాడి చేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు గాయపడ్డారు. తనకు ఏ పార్టీతో సబంధం లేకపోయినా లోకేశ్ వలంటీర్లు దాడి చేశారని నిడమర్రుకు చెందిన పిట్టా రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్కూటర్‌పై వెళుతూ లోకేశ్‌ను చూసేందుకు ఆగానని, టీడీపీ నేతలు, వలంటీర్లు తన బట్టలు చింపేసి విచక్షణ రహితంగా దాడి చేయడంతో పాటు తన బైక్‌ను కూడా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేశ్ వెంట జనం లేకనే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు విమర్శించారు. లోకేశ్ సమక్షంలోనే తన ఫ్లెక్సీలపై రాళ్లు విసురుతున్నా అడ్డుకోవడం మానేసి చోద్యం చూస్తుండటం లోకేశ్‌కే చెల్లిందని టీటీడీ పాలక మండలి సభ్యుడు పెదబాబు వ్యాఖ్యానించారు.

పెట్రో బాంబు బాబు పుణ్యమే!

- వాహనమిత్ర పథకంపై ఈనాడు వక్రీకరణలు
- చంద్రబాబు, లోకేశ్‌కూ ఇవ్వాలనే రీతిలో రామోజీ రాతలు



సాక్షి, అమరావతి: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తు.చ. తప్పకుండా అమలు చేస్తుంటే ఈనాడు రామోజీ కడుపు మంటను భరించలేకపోతున్నారు! సొంత కార్లున్న చంద్రబాబు, లోకేశ్‌కు సైతం వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని అందించాల్సిందే అన్నట్లుగా ఉంది ఆయన కథనాల తీరు! ఆటోలు, ట్యాక్సీలు, మేక్సి క్యాబ్‌లను కొనుగోలు చేసి సొంతంగా నడుపుకునే వారి కోసం ఆ పథకాన్ని రూపొందించారన్న విషయాన్ని రామోజీ గుర్తుంచుకోవాలి! దీన్ని విస్మరిస్తూ 'వాహన మిత్రకు మిగిలింది వాతే' అంటూ మరోసారి అక్కసు వెళ్లగక్కారు.

నాలుగేళ్లలో 2.74 లక్షల మందికి రూ.1,041.03 కోట్లు

సొంతంగా ఆటోలు, ట్యాక్సీలను కొనుగోలు చేసి జీవనోపాధి కోసం నడుపుకొనే వారికి చేయూతనిచ్చేందుకు వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. వాహనానికి బీమా, ఫిట్‌నెస్, మరమ్మతుల కోసం ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తామన్న హామీని సీఎం జగన్ అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో నాలుగు విడతలుగా 2,74,015 మందికి రూ.1,041.03 కోట్ల సాయాన్ని అందచేశారు. అత్యంత పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తూ సామాజిక తనిఖీల కోసం సచివాలయాల్లో జాబితాలను ప్రకటిస్తున్నారు. కారణాలు ఏవైనప్పటికీ అర్హులు ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా ఏటా రెండు దఫాలు పరిశీలన అనంతరం పథకాన్ని వర్తింప చేస్తున్నారు.

పెట్రోల్‌పై బాదుడు పాపం బాబుదే

అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలను నిర్ణయిస్తారన్నది తెలిసిందే. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతూ ఈనాడు పత్రిక రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నించింది. పెరిగిన ఇంధన ధరలతో ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారంటూ కాకి లెక్కలు ప్రచురించింది. వాస్తవానికి పెట్రోల్, డీజిల్‌పై అదనపు భారాన్ని వేసింది చంద్రబాబు ప్రభుత్వమే అన్నది రామోజీ ఉద్దేశపూర్వకంగానే మరిచిపోయినట్లుంది. 2015 ఫిబ్రవరి 5కు ముందు రాష్ట్రంలో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్, డీజిల్‌పై 22.5 శాతం వ్యాట్ ఉండగా ఆ పన్నులను టీడీపీ ప్రభుత్వం అమాంతం మార్చేసింది. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.4 చొప్పున ధరలను పెంచింది. ఆ వాస్తవాన్ని చెప్పకుండా ఈనాడు బురద చల్లుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. కోవిడ్ మహమ్మారితో రెండేళ్లు ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. రాష్ట్రానికి రావాల్సిన రూ.30 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇక టీడీపీ హయాంలో రోడ్ల మరమ్మతులను గాలికి వదిలేయడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో వీటి పునరుద్ధరణ కోసం లీటరుకు ఒక్క రూపాయి మాత్రమే రోడ్ సెస్ విధించాల్సి వచ్చింది. టీడీపీ హయాంలో భగ్గుమన్న ఇంధన ధరలతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై పడిన ఆర్థిక భారం లెక్కలను ప్రచురించే సాహసాన్ని రామోజీ చేయగలరా?.

చంద్రబాబు స్కామ్‌పై వార్తలేవి?

రామోజీ, రాధాకృష్ణ, టీవీ 5 నాయుడులను నిలదీసిన మంత్రి అప్పలరాజు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రబాబుకు ఆగస్టు నెలలో ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తుంటే రాష్ట్రంలో ఉన్న రామోజీకి, రాధాకృష్ణ, టీవీ-5 నాయుడులకు కనిపించడం లేదా, వినిపించడం లేదా? అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. సుమారు రూ.118 కోట్లు తేడా వచ్చాయని వాటికి సంబంధించి పూర్తి లెక్కలు, వివరాలు ఇవ్వకపోతే చంద్రబాబుపై పూర్తి చర్యలు తీసుకుంటామని ఐటీ శాఖ తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నా ఎల్లోమీడియా మాత్రం నాలుగులైన్ల వార్త కూడా రాయకపోవడం దారుణమని చెప్పారు. ఎల్లోమీడియా ఉన్నంతకాలం రాష్ట్రానికి మంచి రోజులు రావన్నారు. ఆయన ఆదివారం శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని సాక్షాత్తు ప్రధాని మోదీనే చెప్పారని గుర్తుచేశారు. మీ కులం వ్యక్తి అయిన చంద్రబాబు తప్పులు ప్రజలకు తెలియజేయకుండా మౌనం వహించడమే మీకు తెలుసన్న విషయం అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో మీ కులానికి చెందిన వ్యక్తి కాకుండా ఇంకెవరైనా ఇలాంటి తప్పుచేసి ఉంటే రోజుల తరబడి పతాక శీర్షికల్లో వార్తలు చూపించేవారని చెప్పారు. ఇదేనా మీ నైతిక విలువలు, సిద్ధాంతాలు అని మండిపడ్డారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల పేరుతో వినయ్, విక్కి అనే వ్యక్తుల ద్వారా బోగస్ కంపెనీలు రిజిస్టర్ చేసి వాటికి సబ్ కాంట్రాక్టులు పనులు ఇప్పించుకుని సబ్‌కాంట్రాక్టుల ఖాతాల్లో డబ్బులు వేసి తిరిగి వాటిని బాబుకు చేర్చేవారని, ఇదేనా సంపద సృష్టించడమంటే అని ప్రశ్నించారు. పోలవరం ఒరిజినల్ బిడ్డర్‌ని పక్కన పెట్టి రామోజీరావు బంధువు నవయుగ వారికి ఇచ్చేసిన ఘనుడు చంద్రబాబు అని చెప్పారు. ఇన్నాళ్లు తొడలు గొట్టిన చంద్రబాబు మూడురోజుల నుంచి మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో గ్యాస్, పెట్రోలు ధరలు పెరిగినప్పుడు సీఎం జగన్ వల్లే పెంచారని ప్రచారం చేసే పచ్చమీడియా, చంద్రబాబు.. ధరలు తగ్గినప్పుడు జగన్ వల్ల తగ్గాయని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.

పవన్ నోరు ఏమైంది?

'ప్యాకేజీ స్టార్.. ఇప్పుడు ఎందుకు నీ ప్రశ్నించేతత్వం మౌనంగా ఉంది? నీ యజమాని చంద్రబాబు అక్రమాలు బయటపడితే నువ్వు ఎందుకు ప్రశ్నించడం లేదు. అంటే నువ్వు నిజంగా ప్యాకేజీకి అమ్ముడుపోయావని అర్థమవుతోంది. రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలే పవన్‌కు ముఖ్యం' అని మంత్రి పేర్కొన్నారు.

బోగస్ ఓట్లతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

'బోగస్ ఓట్ల నివారణ..రాజకీయ పార్టీల బాధ్యత'పై సదస్సులో వక్తలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ ఎడిటర్స్, న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు

నగరంపాలెం: బోగస్ ఓట్ల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని.. ప్రజా తీర్పును తారుమారు చేస్తాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో గవర్నర్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం సంయుక్తంగా 'బోగస్ ఓట్ల నివారణ–రాజకీయ పార్టీల బాధ్యత' అనే అంశంపై గుంటూరులోని మహాత్మాగాంధీ కాలేజీలో ఆదివారం సదస్సు నిర్వహించాయి. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 ఎన్నికల్లో బోగస్ ఓటర్లు ప్రజా తీర్పును తారుమారు చేసినట్లు బెటర్ ఆంధ్రప్రదేశ్ సంస్థ సర్వేలో బహిర్గతమైందని చెప్పారు. 2022తో పోల్చితే 2023 నాటికి 7,51,411 బోగస్ ఓట్లను తొలగించగా.. చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం విడ్డూరమన్నారు. ఏపీ అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్, హైకోర్టు న్యాయవాది బి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ కొన్ని పార్టీలు వాస్తవ ఓటర్లను తొలగిస్తూ దొంగ ఓటర్లను నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఫోరం ఫర్ బెటర్ సొసైటీ జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మానవత స్వచ్ఛంద సంస్థ కో-కన్వీనర్ సలీం మాలిక్, ఎడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు, ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ముత్యం, ఏఎన్‌యూ డీన్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజ చలపతిరావు పాల్గొన్నారు.



> ఎవరి మనోభావాలూ గాయపరచకపోతే తత్వవేత్త ఉపయోగం ఏమిటి?
> – డైయోజినీజ్

సాక్షి

సోమవారం, 4 సెప్టెంబర్ 2023

అభిమాన సంపన్నులు

విద్యావంతులైన వాళ్లు ఎవరైనా జీవితాంతం తమ గురువులను స్మరించుకుంటారు. మన దేశంలో గురుశిష్య పరంపర వేదకాలం నుంచి ఉంది. పాశ్చాత్య నాగరికతల్లో కూడా క్రీస్తుపూర్వం నుంచే గురుశిష్య పరంపర కొనసాగేది. విద్య నేర్పించే గురువులే లేకుంటే, ఈ ప్రపంచం ఇంకా అజ్ఞానాంధకార యుగంలోనే మిగిలి ఉండేదేమో! గురువులు లేని లోకాన్ని ఊహించుకోలేం. గురువులు ఊరకే పాఠాలను వల్లెవేయించడమే కాదు, భావితరాలను జ్ఞానసంపన్నులుగా తీర్చిదిద్దుతారు. పరోక్షంగా సమాజాన్ని మెరుగుపరుస్తారు. బడిలో చేరిన పిల్లల మీద తల్లిదండ్రుల కంటే గురువుల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. పిల్లల్లో గురువుల మీద అమితమైన గురి ఉంటుంది. 'ఎలా ఆలోచించాలో తెలిసిన వాళ్లకు అధ్యాపకుల అవసరం లేదు' అని మహాత్మాగాంధీ అన్నారు. అయితే, అమాయకపు బాల్యావస్థలో ఆలోచనను పదునెక్కించే గురువులు అత్యవసరం.

జీవితాన్ని ప్రభావితం చేసే మానవ సంబంధాల్లో గురుశిష్య సంబంధం ప్రత్యేకమైనది. లోకంలో ఎందరో ఉత్తమ గురువులు, వారు తీర్చిదిద్దిన ఉత్తమ శిష్యులు ఉన్నారు. వారందరూ గతించిపోయినా, వారి చరిత్రను జనాలు చర్వితచర్వణంగా ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంటారు. మన పురాణాల్లోనూ గురుశిష్యుల కథలు కొల్లలుగా కనిపిస్తాయి. పురాణాల్లో దేవతలకు బృహస్పతి, రాక్షసులకు శుక్రాచార్యుడు గురువులుగా వాసికెక్కారు. అవతార పురుషులైన రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు, బలరామకృష్ణులకు సాందీపని మహర్షి గురువులుగా ఉండేవారు. పురాణ గురువుల్లో మిగిలినవారిదంతా ఒక ఎత్తు అయితే, ప్రహ్లాదుడికి పాఠాలు చెప్పిన చండామార్కుల వారిది మరో ఎత్తు. దండోపాయాన్ని సాధనంగా ఎంచుకున్న తొలిగురువు బహుశా ఆయనే! చండామార్క వారసులైన గురువులు అక్కడక్కడా తారసపడుతుంటారు.

మనుషుల్లో ఉండే వైవిధ్య వైరుధ్యాలు గురుశిష్యుల్లోనూ కనిపిస్తాయి. గురువులందరూ ఉత్తములేనని, శిష్యులందరూ ఆణిముత్యాలేనని చెప్పలేం. గురువుల్లో ఔదార్యమూ, ఉదాత్తతలతో పాటే స్వార్థ సంకుచిత లక్షణాలూ కనిపిస్తాయి. గురువులు కూడా మానవ మాత్రులే! ఏకలవ్యుడి బొటన వేలును గురుదక్షిణగా కోరిన ద్రోణుడు మనకు తెలుసు. గురువుకే పంగనామాలు పెట్టిన ఆషాఢభూతి కూడా మనకు తెలుసు. గురజాడవారి 'కన్యాశుల్కం'లోని గిరీశం ఆషాఢభూతికి ఏమీ తీసిపోయే రకం కాదు. కాకుంటే, అతగాడు గురుత్వం వెలగబెట్టాడు. గిరీశం శిష్యరికంలో వెంకటేశానికి చుట్ట కాల్చడం పట్టుబడిందే గాని, చదువు ఒంటబట్టలేదు.

అయితే, మన దేశంలో వివిధ రంగాల్లో రాణించిన గురువులు, గురువులకు గర్వకారణంగా నిలిచిన శిష్యులు ఎందరో ఉన్నారు. సాహితీరంగంలో తమదైన ముద్రవేసిన గురుశిష్యులు కొందరు ఇప్పటికీ ప్రస్తావనల్లోకి వస్తుంటారు. అటువంటి గురుశిష్యుల్లో మొదటగా చెప్పుకోవలసిన వారు – తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, ఆయన శిష్యుడు విశ్వనాథ సత్యనారాయణ. వారిద్దరూ అరుదైన గురుశిష్యులు. పాండితీ ప్రాభవంలోను, కవన శైలిలోనూ ఇద్దరూ ఇద్దరే! చెళ్లపిళ్లవారి గురించి విశ్వనాథ ఒక చమత్కార పద్యం చెప్పారు. అది: 'అల నన్నయకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం డలఘుస్వాదు... బ్రాహ్మీమయమూర్తి శిష్యుడైనా డన్నట్టి దావ్యోమపే శలచాంద్రీ మృదుకీర్తి చెళ్లపిళవంశస్వామి కున్నట్లుగన్'. నన్నయకు, తిక్కనకు తన వంటి శిష్యులెవరూ లేరని, తన గురువైన చెళ్లపిళ్ల వారికే ఆ వైభోగం, కీర్తి దక్కాయని సగర్వంగా చెప్పుకున్నారు విశ్వనాథ. అధ్యాపక వృత్తిలో కొనసాగిన విశ్వనాథకు ఎందరో ప్రత్యక్ష శిష్యులే కాకుండా, మరెందరో పరోక్ష శిష్యులూ ఉన్నారు.

విశ్వనాథను శ్రీశ్రీ 'కవికుల గురువు'గా ప్రస్తుతించడమే కాదు, 'తెలుగువాళ్ల గోల్డు నిబ్బు'గా అభివర్ణించారు. ఒకానొక సందర్భంలో 'నా వంటి కవి మరో వెయ్యేళ్ల వరకు పుట్టడు' అని విశ్వనాథ అన్నారు. దీనికి ప్రతిస్పందనగా శ్రీశ్రీ 'నిజమే! వారు పుట్టి వెయ్యేళ్లయింది' అని వ్యాఖ్యానించడం ఒక వైచిత్రి. తొలినాళ్లలో శ్రీశ్రీపై విశ్వనాథ ప్రభావం ఉండేది. తర్వాతికాలంలో అబ్బూరి రామకృష్ణారావు శ్రీశ్రీపై ఎనలేని ప్రభావం చూపారు. అబ్బూరి వద్ద శ్రీశ్రీ నేరుగా తరగతిలో పాఠాలు నేర్చుకోకపోయినా, వారిద్దరిదీ గురుశిష్య సంబంధమే! సాహితీ లోకంలో మెరికల్లాంటి శిష్యులను తయారుచేసిన మరో గురువు పుట్టపర్తి నారాయణాచార్యులు. రాచమల్లు రామచంద్రారెడ్డి, నరాల రామారెడ్డి వంటి ఉద్దండులు ఆయన శిష్యులే! ఇక భద్రిరాజు కృష్ణమూర్తి భాషాశాస్త్ర ఆచార్యులుగా సుప్రసిద్ధులు. బూదరాజు రాధాకృష్ణ, చేకూరి రామారావు, తూమాటి దొణప్ప వంటి శిష్యులను ఆయన తీర్చిదిద్దారు.

ఎందరో గురువులు ఉన్నా, శిష్యుల మనసుల్లో చెరగని ముద్రవేసే వారు కొందరే ఉంటారు. అలాంటి వారే ఉత్తమ గురువులుగా చరిత్రలో గుర్తుండిపోతారు. మన దేశానికి రెండో రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపకుడిగా ఎందరో శిష్యులను తయారు చేశారు. ఆయన మైసూరు విశ్వవిద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి వెళ్లేటప్పుడు ఆయనను గుర్రపు బండిలో కూర్చోబెట్టి శిష్యులే స్వయంగా బండిని లాక్కుంటూ వెళ్లి మరీ మైసూరు రైల్వే స్టేషన్‌లో సాగనంపారు. అదీ రాధాకృష్ణన్ ఘనత! రేపు రాధాకృష్ణన్ పుట్టినరోజు. మనకు ఉపాధ్యాయ దినోత్సవం. గురువుల ఘనతకు శిష్యుల అభిమానమే గీటురాయి! జీతంరాళ్ల కంటే శిష్యుల అభిమాన ధనమే అసలైన సిరిసంపదలుగా తలచే గురువులు ఉంటారు. అలాంటి వాళ్లే ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తారు.

దేశానికి తగిలిన చెంప దెబ్బ

కామెంట్



కరణ్ థాపర్

మొదటి ఘటన ఉత్తర ప్రదేశ్‌లో జరిగింది. హోమ్ వర్క్ చేయలేదన్న కారణంతో ఏడేళ్ల ముస్లిం బాలుడిని మిగతా పిల్లలు ఒక్కొక్కరుగా వచ్చి చెంప దెబ్బ కొట్టాలని తృప్తి త్యాగి అనే ఉపాధ్యాయురాలు ఆదేశించారు. రెండో ఘటన జమ్మూ–కశ్మీర్‌లో చోటు చేసుకుంది. పదేళ్ల బాలుడు బ్లాక్ బోర్డు పైన 'జై శ్రీరామ్' అని రాసినందుకు, ఫరూఖ్ అహ్మద్ అనే టీచర్ పిల్లలంతా చూస్తుండగా ఆ బాలుడిని క్లాసు బయటికి ఈడ్చుకెళ్లి దారుణంగా కొట్టాడు. ఇక్కడ బాధితులు పసివాళ్లు. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా వారికి లోతైన గాయాలయ్యాయి. దారుణాతి దారుణం ఏంటంటే... వారు ముస్లిములో, హిందువులో అయిన కారణంగా అలా జరగడం! అది ఏకంగా భారతదేశం పైనే జరిగిన దాడి!

మాట వినని పిల్లలు చెంపదెబ్బ తింటారని తెలియని తరం నుండేమీ నేను రాలేదు. కానీ నాన్న ఎప్పుడూ నాపై చెయ్యి ఎత్తలేదు. ఆయన ఆర్మీ ఆఫీసర్ అయినప్పటికీ నన్ను గారం చేసేవారు. సున్నితమైన మనసు గల తండ్రిగా ఆయన నా పట్ల వ్యవహరించేవారు. అమ్మ మాత్రం నన్ను క్రమశిక్షణలో ఉంచేవారు. అమ్మ చేతి దెబ్బలు ఒకటీ రెండు తిన్నట్లు కూడా నాకు గుర్తు. నిస్సందేహంగా నేను ఆ దెబ్బలకు యోగ్యమైనవాడినే! నిజానికి, ఆ విధమైన దండన ఆ కాలంలో సమర్థనీయతను కలిగి ఉందన్న సంగతి కూడా నాకు తెలియందేమీ కాదు.

అయితే గత వారం రెండు వేర్వేరు పాఠశాలల్లో, ఇద్దరు వేర్వేరు వర్గాలకు చెందిన పిల్లలపై 'ఇతర' వర్గం నుంచి జరిగింది ఇందుకు భిన్నమైనది. వారు చెంపదెబ్బలు తినలేదు. దెబ్బలు తిన్నారు. ఇది మొదటిది. ఇక రెండవది... వారిని మందలించడానికి గానీ, సరిదిద్దడానికి గానీ కొట్టలేదు. అవి వారిని అవమానించడానికీ, ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడానికీ కొట్టినవి. మూడవది, వారు వేరే మతానికి చెందిన వారైనందువల్ల జరిగినవి. వెల్లువెత్తిన మత విద్వేషం అది. ఇదేమీ పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడం కోసం జరిగినది కాదు. నిజం చెప్పాలంటే... ఆ ధోరణి గర్హనీయమైనది, నీచమైనది, అసహ్యకరమైనది.

మొదటి ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని ఖుబ్బాపూర్‌లో జరిగింది. హోమ్ వర్క్ చేయలేదన్న కారణంతో ఏడేళ్ల ముస్లిం బాలుడిని మిగతా పిల్లలు ఒక్కొక్కరుగా వచ్చి చెంపదెబ్బ కొట్టాలని తృప్తి త్యాగి అనే ఉపాధ్యాయురాలు ఆదేశించారు. ఆమె ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కూడా! ఆ బాలుడిని అలా కొట్టిస్తున్న సమయంలో ఆ టీచరు... 'మహమ్మదీయ పిల్లలు' అంటూ అవహేళనగా, అవమానకరంగా మాట్లాడుతూ, ''ఇంకా గట్టిగా కొట్టండి'' అని సాటి పిల్లల్ని ప్రోత్సహించడం మరో మాటకు తావులేకుండా వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.

రెండో ఘటన, జమ్మూ–కశ్మీర్‌లోని బనీలో చోటు చేసుకుంది. అక్కడ పదేళ్ల బాలుడు బ్లాక్ బోర్డు పైన 'జై శ్రీరామ్' అని రాశాడు.



అది చూసిన ఫరూఖ్ అహ్మద్ అనే టీచర్ ''పిల్లలంతా చూస్తుండగా ఆ బాలుడిని క్లాసు బయటికి ఈడ్చుకెళ్లి దారుణంగా కొట్టాడు. అక్కడి నుంచి ఆ బాలుడిని ప్రిన్సిపాల్ గది లోకి లాక్కెళ్లి అక్కడ మళ్లీ ఆ టీచరు, ప్రిన్సిపాల్ కలిసి, గదికి తాళం వేసి మరీ ఆ చిన్నారిని కొట్టారు. ఇంకోసారి అలా రాస్తే చంపేస్తామని హెచ్చరించారు'' అని ఎఫ్.ఐ.ఆర్.లోని వివరాలను బట్టి తెలుస్తోంది.

ఈ రెండు ఘటనలు కూడా అత్యంత భయానకమైనవి. రెండో ఘటన గురించి కొద్దిగా మాత్రమే మనకు తెలుసు. మొదటి ఘటన తాలూకు వీడియో విస్తృతంగా చక్కర్లు కొడుతూ ఉంది. ఆ వీడియోను తొలగించాలని ప్రభుత్వం ఆదేశించే లోపే సోషల్ మీడియాలో లక్షల మంది వీక్షించారు. ఏడేళ్ల ముస్లిం బాలుడిని కొట్టినందుకు వచ్చే ప్రతిస్పందన ఎలా ఉంటుందో మనకు బాగా తెలుసు. ఇక్కడే మరొక ఆందోళన కూడా కలుగుతోంది నాకు.

బాలుడి తండ్రి న్యాయం కోసం డిమాండ్ చేసే స్థితిలో లేకపోగా... రాజీపడమని, ఇంకా చెప్పాలంటే ఆ టీచర్‌ను క్షమించి, జరిగిన దానిని మరచిపొమ్మని ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. అలా ఒత్తిడి తెస్తున్నవారిలో రైతుల పోరాట యోధుడు నరేశ్ టికైత్ కూడా ఉన్నారు. బాలుడి తండ్రిని రాజీ పడమని చెబుతూ, ఎందుకంటే, ''ఆ టీచర్ చెడు ఉద్దేశంతో అలా చేయలేదు'' అంటున్నారు. ''కనీసం ఆమె క్షమాపణైనా చెప్పాలి కదా'' అని అడిగినప్పుడు, ''క్షమాపణ అనేది పెద్ద మాట. కానీ ఆమె పశ్చాత్తాపం వ్యక్తం చేశారు'' అని రాకేశ్ టికైత్ అన్నారు.

ఖుబ్బాపూర్ పరిసర ప్రాంతాల గ్రామ పెద్దల ప్రతిస్పందన అయితే మరింత నిరుత్సాహకరంగా ఉంది. పూరా గ్రామానికి చెందిన నరేంద్ర త్యాగి ఆ ఏడేళ్ల పిల్లవాడి తండ్రితో, ''ఇక ఈ నాటకాన్ని ఆపండి. గ్రామంలోకి మీడియా అడుగు పెట్టడం మాకు ఇష్టం లేదు. మీరు వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. వద్దని చెప్పండి. వెనక్కు తీసుకోండి. లేకుంటే మీరే దాని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అన్నారు.

చివరికి పోలీసులు కూడా కనీసంలో కనీసమైనా చేయలేదు. వారెంటు లేకుండా అరెస్టు చేయడానికీ, కోర్టు అనుమతి లేకుండా విచారణ చేపట్టడానికీ వీల్లేని సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ''తృప్తి త్యాగికి ద్వేషపూరిత ఉద్దేశాలు లేవు'' అని ముజఫర్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు. ఇక స్థానిక బీజేపీ ఎంపీ సంజీవ్ బాల్యాన్ ''ఇదొక చిన్న విషయం'' అనేశారంటే ప్రభుత్వ స్పందన ఎలా ఉందో మీరు ఊహించవచ్చు. ఎన్నికలు మరో ఏడు నెలల్లో ఉన్నాయి కనుక క్షమించి, ఇక ఆ విషయాన్ని మర్చిపోవాలని అది కోరుతోంది.

కానీ మీరు, నేను అలా క్షమించి, మర్చిపోకూడదని నేను అంటాను. లేదా మొత్తంగా మనం. ఇక్కడ బాధితులు పసివాళ్లు. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా వారికి లోతైన గాయాలు అయ్యాయి. అవి నయం అవడానికి ఎంతో సమయం, ఎంతగానో ప్రేమ అవసరం అవుతాయి. వారికి జరిగిన దారుణాతి దారుణం... వారు ముస్లిములో, హిందువులో అయిన కారణంగా జరిగింది. అది ఏకంగా భారతదేశం పైనే జరిగిన దాడి!

చివరిగా ఒక మాట. ఇవి 'అచ్ఛే దిన్'(మంచి రోజులు) కాదు. ఇది 'అమృత్ కాల్'కు పిలుపు కాదు. ఇది నరకానికి ప్రవేశ ద్వారం కావచ్చు. అందుకనే ఈ టీచర్లకు గుణపాఠం నేర్పాలి. ప్రభుత్వం దగ్గర నుంచి కనీసంగా మనం ఆశించగలిగింది ఇదే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తరుణోపాయం



సగం చైనాను కలుపుకొని భారత్ ఒక కొత్త మ్యాపును గీయడానికి ఇదే సమయం. అప్పుడైతే చర్చలకు మంచి స్టార్టింగ్ పాయింట్ ఉంటుంది.

– వినోద్ ఖోస్లా, వ్యాపారవేత్త

హంతకులు



ఫ్రెంచ్–పాశ్చాత్య దోపిడీని నిరోధించిన ప్రతీ ఒక్క ఆఫ్రికన్ నాయకుడినీ చంపేశారు. థామస్ శంకర, సిల్వానస్ ఒలంపియో, ప్యాట్రిస్ లుముంబా లాంటి వాళ్లందరినీ చంపేశారు.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

ఏమైంది స్వీడన్‌కు?



స్వీడన్ నియంత్రణలో లేదు. ఒక్క రాత్రిలో నాలుగు బాంబుదాడులు జరిగాయి. గోథెన్‌బర్గ్‌లో రెండు పేలుళ్లు, స్టాక్‌హోమ్‌లో ఒకటి, నిషోపింగ్‌లో ఒకటి. ఇప్పుడు స్వీడన్ 'నో–గో జోన్లు' (సురక్షితం కాని ప్రాంతాలు) మొత్తం 61 ఉన్నాయి. అయినా మీడియా ఈ సంక్షోభం మీద మాట్లాడటం లేదు.

– పీటర్ ఇమాన్యుయెల్‌సేన్, స్వీడిష్ జర్నలిస్ట్

తప్పు మీదే!



ఒకవేళ మీ మతాన్ని విమర్శించేవారి మీద హింసాత్మక చర్యలకు పాల్పడమనో, హింస సమర్థనీయమనో మీ మతం చెబుతున్నదంటే– ముందు మీ మతమే తప్పుగా ఉన్నదని అర్థం చేసుకోండి.

– అలీ మాలిక్, హేతువాది

అభిమానం



కోల్‌కతాలో నాకు తప్పనిసరిగా, 'మీరు సుజీత్ సర్కారా?' అన్న ప్రశ్న అభిమానుల నుంచి ఎదురవుతుంటుంది. నేను కాదంటాను. 'అదేంటి, 'పీకూ' తీసింది మీరే కదా?' అంటారు వాళ్ళు. అవును, నేనేనని (అబద్ధం) చెబుతాను. (పీకూ దర్శకుడు సుజీత్ సర్కార్.)

– సుజయ్ ఘోష్, 'కహానీ' దర్శకుడు

ఇంకానా?



ఒకబ్బాయితో పెద్దలు కుదిర్చిన పెళ్లిని నా కజిన్ తిరస్కరించింది. కారణం– అతడు మొదటి సంతానంగా కొడుకును కోరుకుంటున్నానని చెప్పడమే. చిత్రమేమిటంటే – అతను ఢిల్లీలో పెరిగాడు, గురుగావ్‌లోని ఒక బహుళ జాతి సంస్థలో పని చేస్తాడు. ఇది నమ్మలేని నిజం.

– రిచా సింగ్, స్ట్రాటెజీ కన్సల్టెంట్

అవీ బియ్యమంటే...



బంగ్లాదేశ్ బియ్యం అత్యున్నత నాణ్యమైనవి. నేను ఢాకా నుంచి ఎప్పుడూ 10–12 కిలోలు తెచ్చుకుంటాను. వాటిని నీటిలో ఉడికించినప్పుడు ఖీర్/పాయసం వాసనొస్తాయి. అలాగే తినబుద్ధవుతుంది. బంగ్లాదేశీ బియ్యం లాంటివి ఇండియాలో లేనే లేవు. బాస్మతి కూడా వెనకెక్కడో ఉంటుంది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సీనియర్ ఫెలో

మన కాలపు మహాకవి

సందర్భం




వారాల ఆనంద్

బెంగాల్‌లో ఒక టాగోర్‌లా, కర్ణాటకలో ఒక ఏ.కే. రామానుజన్‌లా, మలయాళంలో ఫణిక్కర్‌లా తనదయిన ఒక ప్రత్యేకమయిన స్వరంతో ప్రకృతితో మమేకమై గొప్ప కవిత్వం రాసిన మనకాలపు మహాకవి జయంత్ మహాపాత్ర. ఆయన కవిత్వం నిండా ఒడిశా ప్రజల ప్రాచీన సంస్కృతి, వర్తమాన చరిత్ర అన్నీ పరుచుకుని ఉంటాయి. అలాగని ఆయన్ని స్థానిక కవిగా భావిస్తే తప్పే అవుతుంది. ఆయన కవిత్వం ప్రపంచ ద్వారాల్ని ఒడుపుగా తెరుస్తుంది. ఒడియా, ఆంగ్ల భాషల్లో విస్తృతంగా రాసి విశ్వవిఖ్యాతి గాంచిన జయంత్ మహాపాత్ర ఆగస్ట్ 27 ఆదివారం కటక్ లోని ఒక ఆసుపత్రిలో మరణించారు.

1928 అక్టోబర్ 2న కటక్‌లో జన్మించిన జయంత్ మహాపాత్ర దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. చిన్నప్పటినుండీ ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న ఆయన భౌతిక శాస్త్రంలో పీజీ చేసి ఒడిశాలోని పలు కాలేజీల్లో ముప్ఫయి ఆరేళ్ళ పాటు భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది కవుల కంటే భిన్నంగా జయంత్ మహాపాత్ర తన 38వ ఏట కవిత్వం రాయడం మొదలు పెట్టారు. ఆయన ఇంగ్లీష్, ఒడియా రెండు భాషల్లో విరివిగా రాశారు. భారతీయ ఆంగ్ల కవిగా ప్రపంచవ్యాప్తంగా పేరు గడించారు. ఆయన మొట్టమొదటి పుస్తకం 'క్లోజ్ ది స్కై, టెన్ బై టెన్' 1970లో అచ్చయింది. తాను నివసించిన ఒడిశా ప్రాంత చరిత్ర సంస్కృతి ఆయన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. మహాపాత్ర ఇంగ్లీషు కవిత్వంలో ధ్వనించే లయ మిగతా బయటి దేశాల ఇంగ్లీష్ భాషా కవుల కంటే భిన్నంగా ఉంటుంది. దానికి కారణం ఆయనపై ఉన్న ఒడిశాలోని మౌఖిక సాహిత్యం, జానపద గీతాల ప్రభావం అనే చెప్పాలి.

మహాపాత్ర కవితా సంకలనం 'ఎ రెయిన్ ఆఫ్ లైఫ్' కవితలన్నీ బ్రిటన్‌లోని 'క్రిటికల్ క్వార్టర్లీ', 'టి.ఎల్.ఎస్.' లాంటి వాటిల్లోనూ, 'చికాగో రివ్యూ' లాంటి పత్రికల్లోనూ అచ్చయ్యాయి. అంతేకాదు అమెరికా, ఆస్ట్రేలియాలలోని సాహిత్య పత్రికల్లో కూడా వచ్చాయి. దాంతో ఆ పుస్తకానికి 'జాకోబ్ గ్లాట్ స్టైన్' అవార్డు వెతుక్కుంటూ వచ్చింది. ఆయన 30కి పైగా కవితా సంకలనాలు వెలువరించారు. అందులో అధికంగా ఇంగ్లీష్‌లోనూ, మిగతావి ఒరియాలోనూ రాశారు.

మహాపాత్ర ప్రధానంగా కవిత్వం రాసినప్పటికీ వచనం కూడా రాశారు. 'డోర్ ఆఫ్ పేపర్స్' కథా సంకలనం, అనేక వ్యాసాలూ, తన జ్ఞాపకాలూ రాశారు. ఆయన అనేక ఒడియా కవితల్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అనువాదకుడిగా కూడా ఆయనకు గొప్ప గౌరవముంది. ఆయన కవితా సంకలనం 'రిలేషన్ షిప్స్'కి 1981లో సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. మొట్టమొదటి భారతీయ ఆంగ్ల కవిగా ఆ అవార్డును అందుకున్నారు. 'సార్క్ లిటరరీ అవార్డు', 'టాటా లిటరేచర్ జీవన సాఫల్య పురస్కారం' అందుకున్నారు. ఇంకా 2009లో పద్మశ్రీ పురస్కారం, ఉత్కళ్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ కూడా అందుకున్నారు. ఫెల్లోషిప్‌ను అందుకున్న మొట్టమొదటి భారతీయ ఆంగ్ల కవి కూడా జయంత్ మహాపాత్రే!



జయంత్ మహాపాత్ర

'కవి తనకు తాను వేసుకునే అనేక ప్రశ్నలకు, తాను రాసే కవిత్వం సమాధానాలు చెబుతుంది' అంటాడు జయంత్ మహాపాత్ర. అందుకే ఆయన కవిత్వం ఆయనకు తన అంతర్, బహిర్ సంఘర్షణలకు వేదికగా నిల్చింది. కవిత్వం వర్తమాన కాలపు సంక్షోభాన్నీ, దుఃఖాన్నీ ప్రతిబించాలంటాడు.

''నేను ఒడిశాలో పుట్టాను, ఇక్కడే బతికాను, బతుకుతున్నాను, ఇక్కడి చరిత్ర నాది, కోణార్క్ నాది, కోణార్క్ వైశాల్యం నాది, వైభవం నాది, దాని ఒంటరితనం నాది... అంతే కాదు ఇక్కడి ఆకలి, ఇక్కడి కరువు కాటకాలు నావి. ఎవరయినా వాటిని దాటి నా నుంచి మరే రచనల్ని ఆశిస్తారు! నేను అదే రాశాను. రాస్తున్నాను. చెట్టు మీద మామిడి ఎట్లా పండి పోతుందో నేనూ అట్లే మరణం వైపు పరిపక్వం చెందుతున్నాను'' అన్నారు జయంత్ మహాపాత్ర. ఆయనలేని లోటు భారతీయ ఆంగ్ల కవిత్వానికే కాదు... మొత్తంగా కవిత్వ ప్రపంచానికే పూడ్చలేనిది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
మొబైల్: 94405 01281

(ఆగస్ట్ 27న జయంత్ మహాపాత్ర తుదిశ్వాస విడిచారు)

వెలుగు నీడల సయ్యాట

విశ్లేషణ



జిల్లా గోవర్ధన్

రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత స్థానం కలిగిన వ్యక్తిగా ప్రణబ్ ముఖర్జీ ఒక వెలుగు వెలిగారు. కానీ ఆయన జీవితంలో ఎన్నో నీలి నీడలూ ఉన్నాయి. ఉత్థాన, పతనాల కెరటాలు ఎన్ని వచ్చినా ఆయన తన స్వభావాన్ని వీడక అన్నింటినీ సమాన దృష్టితో స్వీకరించారు.

1973 ఫిబ్రవరిలో ప్రధాని ఇందిరా గాంధీ కేంద్ర క్యాబినెట్‌లో అనూహ్యంగా ప్రణబ్ ముఖర్జీ చోటు సంపాదించారు. ఫైనల్ లిస్టును చూసిన ఇందిర సన్నిహితుడైన జ్యోతిష్కుడు మంత్రివర్గ సభ్యుల సంఖ్యను మార్చాలని సూచించడంతో ప్రణబ్ పేరును అప్పటికప్పుడు చేర్చడం జరిగింది. ఆ తర్వాత ఆయన వెనుతిరిగి చూడలేదు.

అది 1984 అక్టోబర్ 31 ఉదయం. కలకత్తాలో రాజీవ్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తుండగా ఇందిరాగాంధీ హత్య వార్త తెలిసి హుటాహుటిన రాజీవ్‌తో సహా ఢిల్లీ చేరుకున్నారు ప్రణబ్. రాజీవ్ గాంధీని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి చర్చలు జరుగుతున్నాయి. ఒక సిక్కు రాష్ట్రపతి... ఇందిరాజీ కొడుకును ప్రధానిగా (అప్పటి పరిస్థితుల దరిమిలా) ఒప్పుకోకపోవచ్చనీ, అంచేత రాష్ట్రపతి ఢిల్లీలో లేనప్పుడే ఉపరాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ ద్వారా ప్రమాణ స్వీకారం జరిపించాలనీ రాజీవ్ సన్నిహితుల ఆలోచన. ఉత్తర యెమన్‌లో పర్యటిస్తున్న రాష్ట్రపతి జైల్ సింగ్ అప్పటికే తిరుగు ప్రయాణంలో ఉన్నారు. రాష్ట్రపతిని కాదని, ఉపరాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయటం రాజ్యాంగ బద్ధం కాదనీ, రాజకీయం దృష్ట్యా తప్పుడు సంకేతాలు వెళతాయని సీనియర్ నేతగా ప్రణబ్ ముఖర్జీ తన అనుభవంతో రాజీవ్‌కు సలహా ఇచ్చారు. ఈ సలహానే రాజీవ్ పాటించటం విశేషం. జైల్ సింగ్ ఢిల్లీ చేరుకోగానే ఆయన, రాజీవ్ గాంధీతో అదే రాత్రి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం (సాఫీగానే) జరిపించారు.



అయితే ప్రణబ్ ముఖర్జీ సలహాను రాజీవ్ సన్నిహితులు ఆయనకు మరో తీరుగా వక్రీకరించారు. రాజీవ్‌ని కాదని, ప్రణబ్ ముఖర్జీ తనే ప్రధాని పీఠం అధిరోహించాలనే ప్రయత్నంలో రాష్ట్రపతితో సీక్రెట్ చర్చలు జరుపుతున్నారని రాజీవ్ గాంధీ చెవిలో ఊదారు. రాజీవ్ ముందూ వెనక ఆలోచించక ప్రణబ్ పట్ల దురభిప్రాయం పెంచుకున్నారు. చినికి చినికి ఇది గాలివానగా మారి, ఈ సీనియర్ నేతను క్యాబినెట్ నుండి తర్వాత వర్కింగ్ కమిటీలో నుండి తప్పించి, చివరకు కాంగ్రెస్ పార్టీ నుండే వెలివేశారు.

ఎనిమిదవ లోక్‌సభ (1984) ఎన్నికల్లో, సానుభూతి ప్రభంజనంతో కాంగ్రెస్ 404 సీట్లు గెలిచి విజయఢంకా మోగించింది. రాజీవ్ గాంధీని కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డ్ ప్రణబ్ అధ్యక్షతన లోక్‌సభ లీడర్‌గా ఎన్నుకుంది; ఇక అదే రోజు సాయంత్రం రాష్ట్రపతి భవనంలో ప్రధానితో పాటు మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం. సాయంత్రం పీవీ నరసింహారావు ఫోన్ చేసి ప్రణబ్ పేరును ప్రమాణ స్వీకారం చేసేవారి జాబితా నుంచి తొలగించబడిందని చెప్పారు.

ఆ తర్వాత ప్రణబ్ ముఖర్జీ రాజకీయ కెరీర్‌లో కొంత కాలం విషాదమే రాజ్యమేలింది. 1986 జనవరిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నుండి స్థానం కోల్పోయి, 1986 ఏప్రిల్‌లో పార్టీ నుండి కూడా బహిష్కృతులయ్యారు.

అయితే పీవీ 1991 జూన్ 21న ప్రధాని అయిన మూడు రోజులకే ప్రణబ్‌ను ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ (క్యాబినెట్ మంత్రి హోదా)గా నియమించారు. పీవీ అండదండలతోనే ప్రణబ్, పార్టీ అధినేత్రి సోనియా కోటరీలో చేరి, ఆ తర్వాత రెండు దశాబ్దాలు కేంద్ర మంత్రివర్గంలో వాణిజ్య, విదేశాంగ, రక్షణ, ఆర్థిక శాఖ పదవులు చేపట్టారు. పార్టీ వ్యవహారాల్లోనూ, పార్లమెంటులోనూ కాంగ్రెస్ ఫైర్ ఫైటర్‌గా తనదైన ముద్ర వేశారు. ఆ పిదప 2012 జూలై 25 నాడు రాష్ట్రపతి పదవిని సైతం అలంకరించారు.


వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్ । 98190 96949

(ప్రణబ్ స్వీయ చరిత్ర 'ది టర్బులెంట్ ఇయర్స్' ఆధారంగా)

నమ్మకం ముఖ్యం

భగవంతుడి అనుగ్రహం పొందడానికి గురుకటాక్షం అవసరం. గురువు భక్తుడిని భగవంతుడి దగ్గరకు చేర్చగలడు. గురువుపై శిష్యులకు నమ్మకం ఉండాలి. అలా లేకపోతే ఫలితం ఉండదు. ఓ ఆశ్రమంలో గురువుగారు సిద్ధి పొందే సమయం ఆసన్నమవ్వడంతో శిష్యులు అంత్యదశలో ఏదన్నా మంత్రోపదేశం చేస్తారేమోననే ఆశతో నిరంతరం ఆయన దగ్గరే ఉంటున్నారు.

బయటి ఊళ్ళో ఉన్న ఓ శిష్యుడికి తన గురువుగారు సిద్ధి పొందబోతున్నారన్న విషయం తెలిసి



జ్యోతిర్మయం

ఆశ్రమానికి బయలుదేరాడు. అతనొచ్చే దారిలో నది పొంగి ప్రవహిస్తున్నా ఏ మాత్రం భయపడకుండా గురువును చేరాలనే లక్ష్యంతో ఆయన చెప్పిన ఓ మంత్రాన్ని జపిస్తూ ప్రవాహంలో దిగాడు. అలవోకగా నదిని దాటి గురువును చేరి నమస్కరించాడు. గురువు ఆశీర్వదించారు. అయితే అక్కడే ఉన్న శిష్యులు 'మేము రోజుల తరబడి మీ చుట్టూ ఉన్నాం. ఏదన్నా మంత్రోపదేశం చేస్తారని చూస్తున్నాం. కానీ మాకేమీ చెప్పలేదు. కానీ ఇదిగో వేరే ప్రాంతం నుంచి వచ్చిన అతనికి నీటి మీద నడిచే శక్తినిచ్చారు. అటువంటి మంత్రశక్తిని మాకు బోధించలేదు కదా' అన్నారు.

అందుకు గురువుగారు చిన్న నవ్వు నవ్వి, ''ఒరేయ్! నేను అందరికీ ఒకే విధంగానే బోధించాను. ఎవరికీ తక్కువ చేయలేదు. నేను ఇప్పటికే చేసిన మంత్రోపదేశం మీద అతనికున్న నమ్మకంతోనే నదీ ప్రవాహాన్ని తట్టుకుని ఇక్కడికి వచ్చాడు. కానీ మీకిప్పటికీ నేను చెప్పిన ఉపదేశాల మీద గానీ నా మీద కానీ పరిపూర్ణమైన నమ్మకం లేదు. అందుకే ఇంకా ఏదన్నా చెప్తానా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా మీకు నా బోధనల మీద నమ్మకం కలగాలని ఆ దేవుడికి ప్రార్థిస్తున్నాను'' అన్నారు. శిష్యులు తమ తప్పును గ్రహించి క్షమాపణలు కోరారు. వారికీ మునుపటి మంత్రోపదేశం సిద్ధించింది. గురువు గారి మాట మీద ఎప్పుడూ పూర్తి నమ్మకం ఉండాలి. లేకుంటే ఫలితం ఉండదనడానికి ఇదొక నిదర్శనం.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.పంచమి రా.9.55 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అశ్వని ప.3.19 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.26 నుండి 12.58 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.20 నుండి 9.55 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.11.

క్లుప్తంగా...

సెప్టెంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: కలియుగ వైకుంఠమైన తిరుమలలో సెప్టెంబర్‌లో విశేష పర్వదినాలను ఆదివారం టీటీడీ పీఆర్వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 7న గోకులాష్టమి, 8న ఉట్లోత్సవం, 17న బలరామ జయంతి, వరాహ జయంతి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18న వినాయక చవితి, ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 22న శ్రీవారి గరుడసేవ, 23న శ్రీవారి స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న శ్రీవారి చక్రస్నానం, ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమాప్తం, 27న శ్రీవారి బాగ్ సవారి ఉత్సవం, 28న అనంత పద్మనాభ వ్రతం జరగనున్నట్లు వెల్లడించింది.

మహానేతకు అట్లాంటాలో ఘననివాళి



సాక్షి, అమరావతి: అమెరికాలోని అట్లాంటా నగరంలో ప్రవాసాంధ్రులు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘననివాళులర్పించారు. బాంబేలాంజ్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సుమారు 200 మంది వైఎస్సార్ అభిమానులు (ఎన్నారైలు) పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ తొలి డైరెక్టర్ కృష్ణారెడ్డి.. వైఎస్సార్ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఏపీఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్ పండుగాయల రత్నాకర్, ఏపీ విదేశీవిద్య సలహాదారు డాక్టర్ కుమార్ అన్నవరపు, వైఎస్సార్‌సీపీ ముఖ్యులు చింత వెంకటరామిరెడ్డి, కొట్లూరి శ్రీనివాసు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో కిడ్నాపైన బాలుడు మృతి



సాత్విక్ (ఫైల్)

సీఎస్‌పురం (పామూరు): ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం చింతలపాలెంలో నాలుగు రోజుల కిందట జరిగిన 16 నెలల చిన్నారి సాత్విక్షాలోన్ కిడ్నాప్ విషాదాంతమైంది. అతడి మృతదేహం ఆదివారం పొలాల్లో కనిపించింది.కనిగిరి డీఎస్పీ రామరాజు, పామూరు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పశువుల కాపరులు చింతలపాలెం ఎస్సీకాలనీ సమీపంలోని పొలాల నుంచి పశువులను తోలుకొస్తుండగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న బాలుడి మృతదేహాన్ని కనుగొన్నారు. అది కిడ్నాప్ అయిన సాత్విక్షాలోన్‌దిగా గుర్తించారు. ఈనెల 30వ తేదీ రాత్రి నాయనమ్మ తిరుపాలమ్మ వద్ద పడుకున్న సాత్విక్షాలోన్ కిడ్నాప్ అయ్యాడు. దీనిపై ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాలతో క్రైమ్స్ అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు నేతృత్వంలో కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, సీఐలు కె.శ్రీనివాసరావు, శివరామక్రిష్ణారెడ్డి, రాఘవేంద్రరావు, పాపారావు, పాండురంగారావు, ఎస్‌ఐలు పి.అనిల్‌కుమార్, కె.సురేశ్, పి.మహేశ్‌కుమార్, మహేశ్ నాలుగు బృందాలుగా గాలిస్తున్నారు. ఆదివారం కనిగిరి డీఎస్పీ రామరాజు, సీఐలు, ఎస్‌ఐలు పలు ప్రాంతాల్లో ముళ్లపొదలు, పొలాల్లో గాలించారు. చివరికి పశువుల కాపరుల సమాచారంతో బాలుడి మృతదేహం లభ్యమైంది. నెలలు నిండకముందే పుట్టిన సాత్విక్షాలోన్ తల పెద్దదిగా ఉండటం, ఎదుగుదల లేకపోవడం వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో కిడ్నాప్ అయ్యాడు.

సమైక్యజీవన సౌందర్యమే భారతీయ తత్వం



మురళీనగర్ (విశాఖ ఉత్తర): సమైక్యజీవన సౌందర్యమే భారతీయ తత్వమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బిర్లా కూడలిలోని కేరళ కళా సమితితో కేరళీయుల ఓనం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భారతీయులుగా జన్మించడాన్ని మనందరం గర్వంగా చెప్పుకో వాలన్నారు. నేటి తరానికి భారతీయ తత్వం, సంస్కృతీ సంప్రదాయాలను పరిచయం చేయడానికి ఇటువంటి ఉత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. కొల్లాం లోక్‌సభ సభ్యుడు ఎన్‌కే ప్రేమ్ చందన్ మాట్లాడుతూ కేరళీయుల శ్రామిక సౌందర్యాన్ని వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ కేరళ కుటుంబ సభ్యులకు ఓనం శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌సభ కేరళ సభ్యురాలు, మళ యాళీ మిషన్ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ నందినీ మేనోన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. పదిరోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం ఆదివారంతో ము గిసింది. పులిక్కలి (పులి వేషాలు) ఆకట్టుకున్నా యి. తిరువాదిర సంప్రదాయ నృత్యం అల రించింది. మోహినీ అట్టం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకేరళం మ్యాగజైన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేరళ కళాసమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్, ప్రధాన కార్యదర్శి, కె.హరిదాస్, కోశాధికారి ఆర్.మనోజ్ కుమార్, విశాఖపట్నం నగరంలోని 1500 మంది కేరళా కుటుంబీకులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు 'శ్రీవాణి' వైభవం

176 పురాతన ఆలయాల పునరుద్ధరణ

- 2,273 నూతన ఆలయాలు నిర్మాణం
- 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.5 వేలు చొప్పున అందజేత
- పెద్ద ఎత్తున హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాల నిర్వహణ
- శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు



నాలుగేళ్ల కాలంలో శ్రీవాణి ట్రస్టు విరాళాలు రూ. వెయ్యి కోట్లకు చేరుకున్నాయి.

- 2019లో రెండు నెలల కాలంలోనే 19,737 మంది భక్తుల నుంచి శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.26.25 కోట్లు విరాళం లభించింది.
- 2020లో 49,282 మంది భక్తులు రూ.70.21 కోట్లను విరాళంగా అందించారు.
- 2021లో లక్షా 31వేల మంది భక్తులు రూ.176 కోట్లు విరాళంగా అందించారు.
- 2022లో అయితే ఏకంగా 2 లక్షల 70 వేల మంది భక్తులు రూ.282.64 కోట్లు విరాళంగా అందించారు.
- 2023లో ఇప్పటి వరకు లక్ష 58 వేల మంది భక్తులు రూ.268.35 కోట్లు విరాళంగా అందించారు.

తిరుమల: పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, హిందూ ధార్మిక ప్రచార, సేవా కార్యక్రమాలే లక్ష్యంగా శ్రీవాణి ట్రస్టు ముందుకు దూసుకుపోతోంది. భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 176 పురాతన ఆలయాలను పునరుద్ధరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 2,273 నూతన ఆలయాలు నిర్మించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అలాగే 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పెద్ద ఎత్తున హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

2019లో ట్రస్ట్ విధివిధానాలు ఖరారు:

నూతన ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణ కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించింది. 2018 ఆగస్టు 18వ తేదీనే ట్రస్ట్‌ను అప్పటి ప్రభుత్వం ప్రారంభించినా విధివిధానాలు మాత్రం 2019 సెప్టెంబర్ 23వ తేదీ ఖరారు చేశారు. అప్పటి వరకు కూడా టీటీడీ ట్రస్ట్‌లకు సంబంధించి లక్ష రూపాయలపైగా ఇచ్చిన దాతలకు మాత్రమే దర్శన సౌలభ్యం కల్పించేది. మొదటిసారి రూ.10 వేలను శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళంగా అందించిన భక్తులకు ఎలాంటి సిఫార్సు లేఖలు లేకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో శ్రీవాణి ట్రస్ట్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.


ప్రోటోకాల్ బ్రేక్ దర్శనంతో ఆదరణ:

వాస్తవానికి శ్రీవాణి ట్రస్ట్‌కు భక్తుల నుంచి విశేష స్పందన రావడానికి ప్రధాన కారణం విధివిధానాలే. అప్పటి వరకు కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలకు భక్తులు సిఫార్సు లేఖలు ద్వారా పొందడం లేదా అధిక మొత్తాన్ని దళారులకు చెల్లించి టికెట్లను పొందేవారు. శ్రీవాణి ట్రస్ట్ ప్రారంభంతో ఎలాంటి సిఫార్సు లేఖలు లేకుండా ట్రస్ట్‌కు రూ.10 వేలు చెల్లిస్తే చాలు ప్రోటోకాల్ బ్రేక్ దర్శనం పొందే సౌలభ్యం టీటీడీ కల్పించింది. భక్తులు మరో మాటకు తావివ్వకుండా శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు. ఒక దశలో రోజుకు 2,700 మంది భక్తులు కూడా విరాళాలు అందించడం విశేషం. అంత మందికి ప్రోటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శనాలంటే ఎక్కువ సమయం కేటాయించవలసిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచివుండే సమయం అంతకంతకు పెరుగుతూ వచ్చింది. దీంతో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు టీటీడీ వాటిని రోజుకు వెయ్యికి మాత్రమే పరిమితం చేసింది. ఆన్‌లైన్ విధానంలో రోజుకు 500 చొప్పున విడుదల చేస్తుండగా, ఆఫ్‌లైన్ విధానంలో 400 టికెట్లు కేటాయిస్తున్నారు. మరో 100 టికెట్లను ఆఫ్‌లైన్ విధానంలోనే తిరుపతి విమానాశ్రయంలో కేటాయిస్తున్నారు. దీంతో శ్రీవాణి ట్రస్ట్‌కు నెలకు అందే విరాళాలు రూ.30 కోట్లకు పరిమితమవుతుంది.

పేదల ఇళ్లు లూటీ!



వివిధ వ్యక్తుల నుంచి చంద్రబాబుకు చేరిన నగదు వివరాలు



మూడు డొల్ల కంపెనీలకు బదిలీ చేసిన నగదు వివరాలను వినయ్ నంగాలియా ల్యాప్ టాప్ నుంచి స్వాధీనం చేసుకున్న ఎక్సెల్ షీట్

▶ మొదటి పేజీ తరువాయి

బయటపడింది. తాత్కాలిక భవన నిర్మాణాల్లో డొల్ల కంపెనీల పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు 'ఈడబ్ల్యూఎస్' పథకం కింద పేదల ఇంటి నిర్మాణాల్లో ముడుపులు కొట్టేసేందుకు ప్రణాళిక వేశారు. ఇదే విషయాన్ని షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 నవంబర్ 5న ముంబైలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వెల్లడించాడు. తాత్కాలిక సచివాలయం భవనాలే కాకుండా రాష్ట్రంలో వివిధ నిర్మాణాలకు సంబంధించి 2018 డిసెంబర్ నాటికి సుమారు రూ.8,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజీకి చంద్రబాబు అప్పగించినట్లు మనోజ్ వాసుదేవ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇందులో ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ ప్రాజెక్టు కింద సుమారు రూ.7,000 కోట్ల విలువైనవి కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు తెలిపాడు. అమరావతిలో రూ.700 కోట్ల హౌసింగ్ ప్రాజెక్టును 2019 ఫిబ్రవరిలో కేటాయించారని, దీని తర్వాత అప్పటి సీఎం చంద్రబాబు తనను ఇంటికి పిలిచి ఆయన పీఏ శ్రీనివాస్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని, అంతేకాకుండా పార్టీ ఫండ్ రూపంలో కాకుండా డొల్ల కంపెనీల ద్వారా తనకు నగదు ఇవ్వాలని కోరినట్లు వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నాడు. 2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకోగా 2019 మార్చి నాటికి కేవలం 23 వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది.

నగదు బదిలీలో ఆ ముగ్గురు.. కోడ్ భాషలో

సబ్ కాంట్రాక్టుల ముసుగులో డొల్ల కంపెనీలు హయగ్రీవా, అన్నై, షలఖ కంపెనీల ద్వారా అక్రమంగా నగదును చంద్రబాబుకు తరలించడంలో వినయ్ నంగాలియా, విక్కీ జైన్, అంకిత్ బలదూత కీలకపాత్ర పోషించినట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో వెల్లడించినట్లు ఐటీశాఖ నోటీసుల్లో పేర్కొంది. వీరంతా బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు దుబాయ్‌లో దినార్‌ల రూపంలో చెల్లించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించాడు. ఈ చెల్లింపులకు సంబంధించిన ఎక్సెల్ షీట్‌ను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నగదు బదిలీకి కోడ్ భాషలో హెచ్‌వైడీ అని అందులో ఉంది. విజయవాడకు విజయ్ అని, విశాఖకు విష్ అని, బెంగళూరుకు బాంగ్ అని కోడ్ భాషల్లో నమోదు చేసుకున్న వివరాలను, ఎక్సెల్ షీటును ఐటీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అడ్డగోలు వాదన ఆపి జవాబు చెప్పు!

చంద్రబాబు అసంబద్ధ వాదనలను కట్టిపెట్టి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పి తీరాల్సిందేనని ఐటీ శాఖ తేల్చి చెప్పింది! సబ్ కాంట్రాక్టుల ముసుగులో దొంగ ఇన్‌వాయిస్‌లు సృష్టించి నగదును అక్రమంగా తరలించినట్లు తమ వద్ద తిరుగులేని సాక్ష్యాలున్నాయని, చట్ట ప్రకారం విచారించే అధికారం తమకు ఉన్నందున లెక్కల్లో చూపని రూ.118 కోట్లకు సమాధానం చెప్పాల్సిందేనని ఐటీ శాఖ స్పష్టం చేసింది. ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ తన రాజగురువు రామోజీ తరహాలో ఏదో ఒక అభ్యంతరాన్ని తెరపైకి తీసుకొస్తూ దర్యాప్తు ముందుకు కదలకుండా బాబు అడ్డుకుంటున్నారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌కు అసలు విచారణ పరిధి లేదని ఒకసారి, జ్యూరిస్‌డిక్షన్ అసెసింగ్ అధికారి ఈ కేసును సెంట్రల్ ఆఫీసుకు బదిలీ చేయకుండానే నోటీసులు ఇచ్చారని మరోసారి, అసలు ఐటీ దాడుల్లో సీజ్ చేసిన వివరాలను తనకు తెలియచేయలేదని, అందులో తన పేరు ఎక్కడా లేదంటూ.. ఇలా వరుసగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దర్యాప్తు అడుగు ముందుకు పడకుండా కేసును సాగదీసే ప్రయత్నం చేస్తున్నారు. 2022 అక్టోబర్ నుంచి లేఖల మీద లేఖలు రాస్తూ నాలుగుసార్లు దర్యాప్తును అడ్డుకున్నారు. బాబు ప్రతిసారి వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ఐటీ శాఖ తోసిపుచ్చుతూ సహనంగా సమాధానాలిస్తోంది. ముందుగా రూ.118 కోట్లకు లెక్కలు చెప్పాలంటూ పూర్తి సాక్ష్యాధారాలతో మరోసారి సెక్షన్ 153 సీ కింద నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులతో పాటు మనోజ్ వాసుదేవ్ పార్థసాని (ఎంవీపీ), చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్‌లపై ఐటీ దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఎక్సెల్ షీట్లు, వాట్సాప్ మెస్సేజీలు, ఈ మెయిల్స్, బ్యాంకు లావాదేవీల వివరాలతో పాటు వారు విచారణ సందర్భంగా ఆ నగదును చంద్రబాబుకు ఏ విధంగా చేర్చారో వెల్లడిస్తూ వివరాలను పొందుపరిచింది.

తప్పించుకుని తిరుగుతూ..

చంద్రబాబు స్క్రూటినీ కేసును హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్–4 ప్రిన్సిపల్ కమిషనర్ గతేడాది సెక్షన్ 127 కింద హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్–2(4)కు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి సెక్షన్ 153 సీ, 143(2)/142(1) కింద విచారణకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 2022 అక్టోబర్ 10, అక్టోబర్ 27, ఈ ఏడాది జనవరి 31, జూన్ 20న చంద్రబాబు నాలుగు లేఖలు రాశారు. అసలు సెంట్రల్ సర్కిల్ కార్యాలయానికి సెక్షన్ 153 సీ కింద తనకు నోటీసులిచ్చే అధికారం లేదని వాదించగా దీన్ని తోసిపుచ్చింది. జ్యూరిస్‌డిక్షన్ అసెసింగ్ ఆఫీసర్ సెక్షన్ 127 కింద ఈ కేసును తమకు బదిలీ చేయడంతో చట్ట ప్రకారం తక్షణం దర్యాప్తు మొదలు పెట్టినట్లు స్పష్టం చేసింది. దీంతో చంద్రబాబు వెంటనే సెక్షన్ 127 కింద కేసు బదిలీ కాకుండానే సెంట్రల్ సర్కిల్ ఆఫీసు తనకు నోటీసులు ఇచ్చిందంటూ వాదించగా దానికి కూడా స్పష్టమైన ఆధారాలతో వివరణ ఇచ్చింది. దర్యాప్తులో సీజ్ చేసిన వివరాలను తనకు పూర్తిగా తెలియచేయలేదని ఒకసారి పేర్కొనగా అందులో తన పేరు ఎక్కడా లేదు కాబట్టి తనకు నోటీసులు వర్తించవంటూ మరోసారి చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఐటీ శాఖ స్పందిస్తూ మనోజ్ వాసుదేవ్ పార్థసాని వద్ద సోదాల్లో సీజ్ చేసిన వస్తువుల వివరాలన్నీ మీకు (చంద్రబాబుకు) తెలియచేశామని, ముఖ్యమంత్రి హోదాలో కేటాయించిన కాంట్రాక్టుల నుంచి సబ్ కాంట్రాక్టుల రూపంలో ఎటువంటి పనులు చేయకుండానే నగదు చంద్రబాబుకు చేరినట్లు బలమైన ఆధారాలను సేకరించడంతో మీ అభ్యంతరాలను కొట్టి వేస్తున్నామని, పూర్తి వివరాలను మరోసారి అందచేస్తున్నామని, ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని దర్యాప్తునకు సహకరించాల్సిందేనంటూ తాజా నోటీసుల్లో స్పష్టం చేసింది. 46 పేజీల సుదీర్ఘ నోటీసులో మొత్తం ఈ కుంభకోణం ఏ విధంగా జరిగిందో పూసగుచ్చినట్లు బ్యాంకు లావాదేవీలు, కోడ్ భాషలను క్రోడీకరించి రుజువులతో మరీ వెల్లడించింది.

రెండు ప్రమాదాల్లో 9 మంది దుర్మరణం

- బాపట్ల జిల్లాలో ఆటోను ఢీకొన్న లారీ... ఐదుగురి మృతి
- సత్యసాయి జిల్లాలో కారు–ఆటో ఢీకొని నలుగురి మృత్యువాత





బాపట్ల జిల్లా సంతమాగులూరులో నుజ్జునుజ్జయిన ఆటో, ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహాలు

అద్దంకి/నరసరావుపేటటౌన్/కదిరి అర్బన్: రాష్ట్రంలో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో లారీ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు మృత్యువాతపడ్డారు. సత్యసాయి జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. ఈ దుర్ఘటనలకు సంబంధించిన వివరాలు... గుంటూరు నల్లచెరువుకు చెందిన బుర్రి మాధవి(35), చెలిమెళ్ల కవిత(19), పి.నారీనాయక్(22), అలివేలు మంగతాయారు(24), తమ్మిశెట్టి తులసి(16), ఎస్.విజేత(21) వంట పని చేస్తుంటారు. వీరు ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఓ ఫంక్షన్‌లో వంట చేసేందుకు పి.రాజునాయక్(22) ఆటోను కిరాయికి తీసుకుని శనివారం ఉదయం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఆదివారం రాత్రి గుంటూరుకు బయలుదేరారు. వీరి ఆటోను తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సంతమాగులూరు వద్ద తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నుంచి మార్కాపురం వైపు ఇడ్లీరవ్వ లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఆటోలో ఉన్న చెలిమెళ్ల కవిత, పి.నారీ నాయక్, బుర్రి మాధవి ఘటనాస్థలంలోనే మృతి చెందారు. మంగతాయారు, తమ్మిశెట్టి తులసి, ఎస్.విజేత, ఆటో డ్రైవర్ రాజునాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో హుటాహుటిన నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అలివేలు మంగతాయారు, తమ్మిశెట్టి తులసి మరణించారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ టి.వెంకటేశు, సీఐ ప్రభాకర్ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్ పారిపోయాడు. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలను చీరాల ఆర్డీవో సరోజిని పరిశీలించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున సత్వరమే సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

సత్యసాయి జిల్లాలో...



శ్రీ సత్యసాయి జిల్లా యర్రదొడ్డి వద్ద ఘటనాస్థలంలో మృతదేహాలు, నుజ్జునుజ్జయిన ఆటో

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలంలోని యర్రదొడ్డి క్వార్టర్స్ వద్ద ఆటోను కారు ఢీకొని నలుగురు మృతిచెందారు. బుక్కపట్నం మండలం రెడ్డివారిపల్లి తండాకు చెందిన భాస్కర్ నాయక్(48) రేషన్ డీలర్‌గా ఉంటూనే ఆటో నడుపుతుంటాడు. ఆయన ఆటోలో మదిరేబైలు తండా సర్పంచ్ విజయకుమారిబాయి భర్త చిన్నస్వామి నాయక్(35), ఎలక్ట్రీషియన్ చలపతి నాయక్(37), మదిరేబైలుకు చెందిన శ్రీలేఖ(35), ఆమె బంధువు కుమారుడు నిశాంత్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో కదిరి పట్టణానికి బయలుదేరారు. ఆటో యర్రదొడ్డి క్వార్టర్స్ వద్దకు రాగానే... ఎదురుగా కదిరి నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ భాస్కర్ నాయక్, చిన్నస్వామి నాయక్, చలపతి నాయక్ అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ఉన్న శ్రీలేఖతోపాటు కారులో ప్రయాణిస్తున్న నల్లమాడ మండలం యర్రవంకపల్లి సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి, నల్లసింగయ్యగారిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలో శ్రీలేఖ మృతిచెందింది. కదిరి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.







ఖతార్, దుబాయ్, కువైట్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గల్ఫ్ దేశాల్లో వైఎస్సార్‌కు ఘన నివాళి

సాక్షి,అమరావతి/కడప కార్పొరేషన్: గల్ఫ్ దేశాలైన కువైట్, దుబాయ్, ఖతార్‌లలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి ఆధ్వర్యంలో కువైట్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దుబాయ్ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, ఖతార్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రజలకు సువర్ణ పాలన అందించారని గుర్తుచేశారు. తండ్రి ఆశయ సాధన కోసం వైఎస్సార్‌సీపీని స్థాపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన కంటే మరో రెండు అడుగులు ముందుకేసి సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, యూఏఈ అడ్వైజరీ కమిటీ సభ్యులు సోమిరెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎస్.మహేష్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఖతార్ కో కన్వీనర్ జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో రక్తదానం, అన్నదానం

'నా అనుకున్న వాళ్ల కోసం ఎందాకైనా వెళ్లే గొప్ప వ్యక్తిత్వం, ఎంతైనా సాయం చేసే గుణం డాక్టర్ వైఎస్సార్‌ది అని ఏపీ ఎన్‌ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి కొనియాడారు. న్యూజిల్యాండ్ దేశం ఆక్లాండ్ నగరంలోని వెస్లీ కమ్యూనిటీ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం న్యూజిలాండ్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న వెంకట్ మేడపాటి ప్రసంగిస్తూ విదేశాల్లో ఉన్న ఎంతో మందికి ఎన్నో రకాలుగా వైఎస్సార్ సాయం చేశారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నిరుపేదలకు సరస్వతీ కటాక్షం కల్పించి.. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉద్యోగాలు చేసుకుని స్థిరపడేలా చేసిన మహా మనిషి వైఎస్సార్ అని కొనియాడారు. అనంతరం రక్తదానం, అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జి బాబు, ప్రాంతీయ కోఆర్డినేటర్ ఆనంద్ యెద్దుల, పార్టీ ప్రతినిధులు సుస్మిత చిన్నమల్రెడ్డి, సుమంత్ దేగపూడి, ప్రభాకర్ వాసివల్లి, ప్రణవ్ అన్నమరాజు, ఆరోన్ శామ్యూల్ పాల్గొన్నారు.



న్యూజిలాండ్‌లో రక్తదానం

ఐటీ నోటీసులపై వెంటనే స్పందించాలి

- బహుజన పరిరక్షణ సమితి నేతలు
- 1,071వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



తాడికొండ: రాష్ట్రంలో పేదలకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించాల్సిన హక్కులను చంద్రబాబుతో కలిసి అడ్డుకుంటున్న కులగజ్జి పార్టీలు రాజధాని పేరుతో కాంట్రాక్టర్ల వద్ద నుంచి బాబు అందుకున్న ముడుపుల బాగోతంపై అందిన ఐటీ నోటీసులపై వెంటనే స్పందించాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,071వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని పలువురు ముఖ్యులు సందర్శించి మాట్లాడారు. అధికారం అడ్డుపెట్టుకొని దోపిడీ చేసేందుకు అలవాటు పడిన చంద్రబాబు తన హయాంలో అమరావతి తాత్కాలిక భవనాల నిర్మాణం, రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బడా కాంట్రాక్టు సంస్థలకు రూ.8 వేల కోట్ల కాంట్రాక్టులు అధిక ధరలకు కట్టబెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. అలా పనులు అప్పగించినందుకుగాను ప్రతిగా బాబుకు ఆయా సంస్థల నుంచి దాదాపు రూ.118 కోట్ల ముడుపులు అందుకున్నారని, ఈ ముడుపులు కొన్ని డూప్లికేట్ సంస్థలకు బదలాయించి వాటిని చంద్రబాబు కాజేశారనేదానికి ఐటీ శాఖ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయన్నారు. పేదలకు రాజధాని ప్రాంతంలో సెంటు స్థలం ఇస్తుంటే గగ్గోలు పెడుతూ విష ప్రచారం చేసిన ఎల్లో మీడియా బాబు బినామీ గ్యాంగ్ తప్పుడు కేసులు వేసి మా హక్కులు హరించారని, ఇప్పుడు ఐటీ నోటీసుల సాక్షిగా వెల్లడైన అవినీతిపై ఏం చెబుతారని ప్రశ్నించారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని రామోజీ, అధికారం అడ్డుపెట్టుకొని రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిన బాబు అవినీతిపై సమగ్ర విచారణ జరిపి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ

గైనిక్ సర్జరీల్లోనూ రోబోల సాయం

సాక్షి, హైదరాబాద్: వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొబోటిక్ సర్జరీలు హైదరాబాద్‌లోనూ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పేరొందిన దాదాపు ప్రతి ఆసుపత్రీ ఈ శస్త్రచికిత్సా విధానాన్ని ఉపయోగిస్తోంది. చికిత్సా వ్యయం ఎక్కువైనప్పటికీ ఎక్కువ మంది రోగులకు నప్పే అనేక ప్రయోజనాల వల్ల రానురానూ రొబోటిక్ సర్జరీల ఎంపిక కూడా పెరుగుతోంది. విభిన్న రకాల శస్త్రచికిత్సల్లో దోహదపడుతున్న రొబోటిక్ సర్జరీ గైనకాలజీ విభాగంలోనూ ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో గైనకాలజీ శస్త్రచికిత్సల్లో రోబోల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అపోలో ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిషియన్ అండ్ గైనెకాలజిస్ట్ డాక్టర్ అనురాధా పాండా మరిన్ని వివరాలు తెలియజేశారు. అవి ఏమిటంటే...

మరింత కచ్చితత్వం...

"గైనకాలజీలో రోబో అసిస్టెడ్ కీహోల్ సర్జరీని కొత్త ఆవిష్కరణగా చెప్పొచ్చు. సాధారణ లేపరోస్కోపిక్ సర్జరీలతో పోలిస్తే రోబో సాయంతో చేసే సర్జరీల్లో త్రీడీ విజన్ (త్రిమితీయ ఆకారం) ఎక్కువ కచ్చితత్వాన్ని అందిస్తుంది. శస్త్ర చికిత్సలకు ఉపయోగించే పరికరాలను 360 డిగ్రీల కోణంలో తిప్పడానికి వీలుండటం వల్ల శరీరంలో సంక్లిష్టమైన ప్రదేశాలను సైతం చేరుకోవచ్చు. ఈ శస్త్రచికిత్సా విధానంలో తక్కువ రక్త నష్టంతోపాటు నొప్పి, ఇన్ఫెక్షన్ ముప్పు కూడా తక్కువగా ఉంటుంది. తద్వారా రోగులు ఆసుపత్రిలో ఉండాల్సిన వ్యవధి కూడా తగ్గుతుంది. ఈ శస్త్రచికిత్సల్లో సర్జన్ ఒక కంప్యూటర్ కన్సోల్ నుంచి పనిచేస్తారు. తన చేతి కదలికలతో రొబోటిక్ చేతులను కదిలిస్తూ ఆపరేషన్ నిర్వహిస్తారు.

➡ క్లిష్టమైన హిస్టెరెక్టమీ (గర్భాశయం తొలగింపు) ఆపరేషన్లకు రోబో సాయాన్ని ఉపయోగించవచ్చు. ప్రత్యేకించి ఊబకాయంతో ఉన్న రోగి పొత్తికడుపుపై పలు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. మరింత కచ్చితత్వం, తక్కువ నొప్పితోపాటు చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్స చేయడానికి ఈ విధానం వీలు కల్పిస్తుంది" అని డాక్టర్ అనురాధా పాండా వివరించారు.

గైనిక్ రొబోటిక్ సర్జరీలతో ప్రయోజనాలు...

➡ మయోమెక్టమీ అనేది గర్భాశయ కండరాల గోడ (ఫైబ్రాయిడ్) నుంచి నిరపాయకరమైన కణితులను తొలగించడానికి ఉపయోగించే ఒక ప్రక్రియ. రొబోటిక్ సర్జరీ ఫైబ్రాయిడ్ కుట్టు తొలగింపునకు కూడా వీలు కల్పిస్తుంది.

➡ ఎండోమెట్రియోసిస్ అనేది గర్భాశయం వెలుపల గర్భాశయ లైనింగ్ వంటి కణజాలాలు పెరిగే పరిస్థితి. ఈ కణజాలాలు హార్మోన్లకు ప్రతిస్పందిస్తాయి. పీరియడ్స్ సమయంలో రక్తస్రావం, నొప్పి ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ఒక సవాలు వంటిది. దీనికోసం పెల్విస్, పెల్విక్ సైడ్ వాల్స్‌లో లోతుగా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. రోబో అసిస్టెడ్ ఎండోమెట్రియోసిస్ శస్త్రచికిత్స ద్వారా మరింత కచ్చితమైన రీతిలో అండాశయ తిత్తిని తొలగించడం సాధ్యపడుతుంది.

క్లుప్తంగా...

ఆదిత్య-ఎల్1 మొదటి కక్ష్య పెంపు విజయవంతం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం మధ్యాహ్నం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ప్రయోగించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహానికి మొదటిసారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంపొందించింది. బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) లాంటి భూనియంత్రిత కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఉపగ్రహంలోని అపోజీ ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. శనివారం ప్రయోగం చేసినపుడు భూమికి దగ్గరగా 235 కిలోమీటర్లు, దూరంగా 19,500 కిలోమీటర్లు ఎత్తులో భూ మధ్యంతర కక్ష్యలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి విడత కక్ష్య దూరం పెంపుదలలో భూమికి దగ్గరగా 235 కిలోమీటర్ల నుంచి 245 కిలోమీటర్లకు పెంచారు. భూమికి దూరంగా ఉన్న 19,500 కిలోమీటర్ల దూరాన్ని 22,459 కిలోమీటర్లకు పెంచారు. అంటే ప్రస్తుతం 245''22459 కిలోమీటర్లు దీర్ఘ వృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూరా పరిభ్రమిస్తూ ఉంది. రాబోయే 15 రోజుల్లో మరో నాలుగుసార్లు కక్ష్య దూరాన్ని పెంచుతూ ఈనెల 18న భూ మధ్యంతర కక్ష్య నుంచి సూర్యుని వైపునకు మళ్లిస్తారు. అక్కడి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాంగ్రేజియన్ బిందువు 1 వద్దకు చేర్చడానికి 125 రోజులు సమయం తీసుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. జ్వరం బారిన పడిన సోనియాను శనివారం సాయంత్రం సర్ గంగారాం హాస్పిటల్‌లో చేర్చారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 'సోనియా స్వల్ప జ్వరంతో బాధపడుతున్నారు. అయితే, ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యుల బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది' అని సీనియర్ వైద్యుడొకరు పీటీఐకి చెప్పారు.

ఆదిమ ఖండంలో... నియంత పాలనలు



సైనిక తిరుగుబాట్లతో ఆఫ్రికా ఖండం అతలాకుతలం అవుతోంది. కొన్నేళ్లుగా ఇక దేశం తర్వాత ఒక దేశంలో ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి సైనిక నియంతలు అధికారం చేజిక్కించుకుంటున్నారు. బుర్కినా ఫాసో మొదలుకుని తాజాగా గబాన్ దాకా ఈ జాబితా నానాటికీ పెరుగుతూనే పోతోంది. ఆ సైనిక కుట్రల పట్ల ఆయా దేశాల్లో పెద్దగా వ్యతిరేకత కూడా వ్యక్తం కాకపోవడం విశేషం. పైగా యువ ఆఫ్రికన్లు ఈ పరిణామాన్ని రెండు చేతులా స్వాగతిస్తుండటం విస్మయకర వాస్తవం...

ఆఫ్రికా దేశాల్లో సైనిక తిరుగుబాట్లు.. సైనిక పాలనకే జై కొడుతున్న యువత

- పశ్చిమ ఆఫ్రికాలోని నైగర్‌లో సైనిక తిరుగుబాటు జరిగి నెలన్నర కూడా కాలేదు. అప్పుడే ఆదిమ ఖండంలో మరో కుట్ర. మధ్య ఆఫ్రికా దేశం గాబాన్‌లో గత ఆదివారమే ఎన్నికలు జరిగాయి. బుధవారం ఉదయమే ఫలితాలు వెలువడ్డాయి. 2009 నుంచీ దేశాన్ని పాలిస్తూ వస్తున్న అధ్యక్షుడు అలీ బొంగో ఒండింబా మరోసారి తన అధికారాన్ని నిలుపుకున్నారు. ఆయన పార్టీ ఘన విజయం సాధించినట్టు టీవీల్లో అధికారిక ప్రకటన వెలువడింది. దాంతో ఆయన అభిమానులు పండుగ చేసుకున్నారు. కానీ నిమిషాల్లోనే పరిస్థితి పూర్తిగా తిరగబడింది. ఈసారి సైనికాధికారులు టీవీ తెరపైకి వచ్చారు. బొంగోను అదుపులోకి తీసుకుని ఆయన అధికారిక నివాసంలోనే ఖైదు చేసినట్టు, పాలనా పగ్గాలు తమ చేతుల్లోకి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. అలా మరో ఆఫ్రికా ఖండంలో ప్రజాస్వామ్యం మరోసారి పరిహాసానికి గురైంది. మరో దేశం సైనిక కుట్రను చవి చూసింది.

వరుస సైనిక కుట్రలు

ఆఫ్రికాలో, ముఖ్యంగా పశ్చిమ, సెంట్రల్ ఆఫ్రికాలో కొన్నేళ్లుగా సైనిక కుట్రలు పరిపాటిగా మారాయి.

- గత జూలై 26న నైగర్ అధ్యక్షుడు మొహమ్మద్ బజౌమ్‌ను ఆయన సొంత ప్రెసిడెన్షియల్ బాడీ గార్డులే నిర్బంధంలోకి తీసుకున్నారు.
- 2022 జనవరిలో బుర్కినా ఫాసో అధ్యక్షుడు రోచ్ మార్క్ క్రిస్టియన్ కబోరేనుఆ దేశ సైన్యాధ్యక్షుడే బందీని చేసి అధికారం చేజిక్కించుకున్నాడు. అయితే 8 నెలల్లోనే కింది స్థాయి సైనికాధికారులు అతన్ని కూడా జైలుపాలు చేసి అధికారాన్ని పంచుకున్నారు!
- 2012 సెప్టెంబర్‌లో గినియాలో అధ్యక్షుడు ఆల్ఫా కొండేను ప్రత్యేక సైనిక బృందాలు ఖైదు చేసి పాలనా పగ్గాలను తమ చేతుల్లోకి తీసుకున్నాయి.
- 2021 మేలో మాలిలో కల్నల్ అసిమి గొయిటా కూడా సైనిక కుట్రకు పాల్పడ్డాడు. అంతకుముందు కూడా ఇలా ప్రభుత్వాన్ని పడదోసిన చరిత్ర అతనిది.
- 2021 ఏప్రిల్లో చాద్ రిపబ్లిక్‌లో కూడా అధ్యక్షుడు ఇద్రిస్ దెబీ ఇట్నో మృతి కారణంగా అనిశ్చితి ఏర్పడటంతో సైన్యం జోక్యం చేసుకుంది. అయితే, ఆయన కుమారుడే అధికార పగ్గాలు చేపట్టేలా చక్రం తిప్పి రంగం నుంచి తప్పుకుంది. పాలనపై తమ ఆధిపత్యాన్ని మాత్రం నిర్నిరోధంగా కొనసాగిస్తూనే ఉంది!

ఆఫ్రికాలోనే ఎందుకిలా?

కేవలం గత మూడేళ్లలో ఆఫ్రికాలో కనీసం 5 దేశాల్లో సైనిక కుట్రలు జరిగాయి. ఇందుకు పలు కారణాలు కనిపిస్తాయి కూడా...

- సంప్రదాయ పాలక వర్గపు మితిమీరిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం తదితర పోకడలతో ఆఫ్రికా యువత తీవ్రంగా విసి గిపోయింది.
- అదే సమయంలో ఇటు జనాదరణలోనూ, అటు ఆర్థికంగా కూడా ఆయా ప్రభుత్వాలు బలహీనపడుతూ వచ్చాయి. ఈ పరిస్థితిని సైనిక పెద్దలు అవకాశంగా మలచుకున్నారు
- ప్రజల్లో, ముఖ్యంగా పట్టణ ప్రాంత యువతలో అధికార పార్టీల పట్ల ఉన్న ఏహ్య భావాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్నారు.

...అందుకే ఆఫ్రికా యువతలో అసంతృప్తి!

ఆఫ్రికా యువతలో ప్రజాస్వామిక ప్రభుత్వాల పట్ల నెలకొన్న తీవ్ర అసంతృప్తికి కారణాలు లేకపోలేదు...

- ఉపాధి అవకాశాల లేమి
- పెచ్చరిల్లిన అవినీతి
- అధిక వర్గాల్లోనూ వారి మితిమీరిన ఆశ్రిత పక్షపాతం
- ఈ దేశాల్లో చాలావరకు మాజీ ఫ్రెంచి వలస రాజ్యాలే. దాంతో వాటిపై ఇప్పటికీ చాలా విషయాల్లో ఫ్రాన్స్ ప్రభావం కొనసాగుతోంది. ఇది కూడా యువతకు మింగుడు పడడం లేదు.
- ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవడానికి పాలక పార్టీలు చేస్తున్న అక్రమాలతో జనం మరింతగా విసిగిపోయారు.

దశాబ్దాలుగా బొంగోల రాజ్యమే!

గాబన్‌పై బొంగో కుటుంబం ఒకరకంగా అర్ధ శతాబ్దానికి పైగా గుత్తాధిపత్యం చెలాయించిందనే చెప్పాలి.

- అలీ బొంగో 14 ఏళ్లుగా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు! ఇది ఆయనకు మూడో టర్మ్. 2018లోనే స్ట్రోక్‌కు గురైనా అధికారాన్ని మాత్రం వీడలేదు.
- అయితే దేశాన్ని ఆధునీకరణ బాట పట్టించేందుకు ఆయన ప్రయత్నాలు చేయకపోలేదు. కానీ జనం ఆకాంక్షలను నెరవేర్చేందుకు అవి సరిపోలేదు.
- అలీ తండ్రి ఒమర్ బొంగో అయితే ఏకంగా 40 ఏళ్లకు పైగా నియంతలా దేశాన్ని పాలించారు! 2009లో ఆయన మరణానంతరం జరిగిన ఎన్నికల్లో అలీ తనను తాను విజేతగా ప్రకటించుకున్నారు. కానీ నిజానికి విపక్ష నేత ఆంద్రే ఎంబా ఒబామే నెగ్గారని చెబుతారు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

అతని ఆటోనే ఓ మినీ గార్డెన్

చెన్నైలో ఆటో డ్రైవర్ సృజన

అవడానికి అది ఓ చిన్న ఆటో మాత్రమే. కానీ అందులో ఏకంగా ఒక మినీ గార్డెన్‌నే సృష్టించాడతను. చెన్నైకి చెందిన కుబేంధిరన్ అనే ఆటో డ్రైవర్ మది నుంచి పుట్టుకొచ్చిన ఈ సృజనాత్మక ఆలోచన నెటిజన్ల మది దోచుకుంటోంది. ఇంటర్నెట్ నిండా అతనిపై ప్రశంసల వర్షం కురుస్తోంది...

కుబేంధిరన్. చెన్నైలోని దాదాపు లక్ష మంది ఆటో డ్రైవర్లలో ఒకడు. కానీ పర్యావరణం మీది ప్రేమ అతన్ని మిగతా వారికంటే ఎంతో ప్రత్యేకంగా నిలిపింది. దేశమంతటా అతని పేరు మారుమోగేలా చేసింది. రకరకాల మీనియేచర్ మొక్కలు తదితరాలతో ఆటోను కదిలే తోటగా తీర్చిదిద్దాడు. ముందు, వెనక సీట్ల మధ్య, వెనక వైపు, సీలింగ్ మీద మాత్రమే గాక సీలింగ్ లోపలి వైపు కూడా పచ్చని మొక్కలతో నింపి ఆకట్టుకుంటున్నాడు. ఆ ఆహ్లాదాన్ని అనుభవిస్తూ ప్రయాణికులు మైమరచిపోతున్నారు. అందుకే ఇప్పుడు కుబేంధిరన్ ఆటోను చెన్నైవాసులు ప్రయాణించే పార్కుగా అభివర్ణిస్తూ మురిసిపోతున్నారు. అందులో ప్రయాణించిన వాళ్లు 'గ్రీన్ ఆటో', 'మూవింగ్ పార్క్', ఇంకా రకరకాలుగా ప్రశంసిస్తున్నారు. ఇంత చక్కని ఆలోచన చేసినందుకు అతన్ని ఎంతగానో మెచ్చుకుంటున్నారు కూడా.

మరెన్నో విశేషాలు: ఇది మాత్రమే కాదు, ఆటో ఎక్కే వారు చదువుకోవడం కోసం ఎన్నెన్నో స్ఫూర్తిదాయక పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచాడు కుబేంధిరన్. అంతేగాక వారికి స్వచ్ఛమైన చల్లని మంచినీరు కూడా ఇస్తాడు. వీటికి తోడు చక్కని సూక్తులు, నినాదాలతో కూడిన బ్యానర్లు కూడా ఆటో నిండా కనువిందు చేస్తుంటాయి. వాటిని తరచూ మారుస్తూ మరింత ఆకట్టుకుంటాడతను. రోడ్డు భద్రత గురించి కూడా అందరికీ వీలైనంత వరకూ అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాడు. తనవంతు సామాజిక బాధ్యతను పరిపూర్ణంగా నెరవేరుస్తూ శెభాష్ అనిపించుకుంటున్నాడు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

ఆటోపై రూఫ్ గార్డెన్

కొన్నాళ్ల క్రితం ఢిల్లీకి చెందిన మహేంద్ర కుమార్ అనే ఆటో డ్రైవర్ కూడా ఇలాగే తన ఆటో రూఫ్ టాప్ మీద గార్డెన్ పెంచి వార్తల్లో నిలిచాడు. ఈ గార్డెన్ 2020 నుంచీ అందరినీ అలరిస్తోంది. కుమార్‌తో పాటు అతని ఆటో ఎక్కేవాళ్లు కూడా మండే ఢిల్లీ ఎండల్లో కూడా చక్కని చల్లదనం అనుభవిస్తూ ప్రయాణిస్తూ ఉంటారు. అతన్నీ, అతని ఆటో రూఫ్ టాప్‌నూ అంతా ఎప్పుడు చూసినా ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ఉంటారు!






రామ్‌నాథ్ కోవింద్‌తో న్యాయ శాఖ ఉన్నతాధికారుల భేటీ

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ చీఫ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం న్యాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ ఎజెండాపై చర్చించారు. న్యాయ శాఖ కార్యదర్శి నితిన్ చంద్ర, శాసన కార్యదర్శి రీటా వశిష్ఠ తదితరులు కోవింద్‌ను కలిశారు. జమిలి ఎన్నికల విషయంలో అధ్యయనం చేయాల్సిన అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. చట్టపరమైన విషయాలపై చర్చించుకున్నారు. ఉన్నత స్థాయి కమిటీకి నితిన్ చంద్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై అధ్యయనం కోసం 8 మంది సభ్యులతో హైలెవెల్ కమిటీని నియమిస్తూ కేంద్రం శనివారం ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను సైతం ఒకేసారి నిర్వహించాలనికేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

2047 నాటికి అభివృద్ధి భారత్

'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'.. ప్రపంచానికి మార్గదర్శి

- విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అద్భుత ఫలితాలు సాధిస్తాం
- దేశంలో అవినీతి, కులతత్వం, మతతత్వానికి స్థానంలేదు.
- 'పీటీఐ' ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన



న్యూఢిల్లీ: ప్రపంచ అభివృద్ధి 'జీడీపీ కేంద్రిత విధానం' నుంచి 'మానవ కేంద్రిత విధానం' వైపు మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. మన 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' మోడల్ ప్రపంచ సంక్షేమానికి ఒక మార్గదర్శిగా మారుతోందని స్పష్టం చేశారు. జీడీపీ పరిమాణంతో సంబంధం లేకుండా ప్రపంచంలో ప్రతి దేశానికీ ప్రాముఖ్యం ఉందని పేర్కొన్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధాని మోదీ తాజాగా వార్తా సంస్థ 'పీటీఐ'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక కొత్త ప్రపంచ క్రమం(వరల్డ్ ఆర్డర్) ఏర్పడిందని, కోవిడ్–19 తర్వాత మరో ప్రపంచ క్రమాన్ని చూస్తున్నామని చెప్పారు. మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందని, ఈ విషయంలో భారత్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. జీ20కి సారథ్యం వహిస్తున్న భారత్ ప్రపంచ దేశాల్లో విశ్వాసం అనే విత్తనాలు నాటిందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

పేదరికంపై విజయం తథ్యం

''చాలా ఏళ్ల క్రితం భారత్‌ను 100 కోట్లకుపైగా ఆకలితో అలమటించే ఖాళీ కడుపులున్న దేశంగా భావించేవారు. కానీ, ఇప్పుడు 100 కోట్లకుపైగా ఆకాంక్షలతో కూడిన హృదయాలు, రెండు కోట్లకుపైగా నైపుణ్యం కలిగిన చేతులు, కోట్లాది యువత ఉన్నదేశంగా భారత్‌ను చూస్తున్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. ఈ కాలమంతా ఒక మంచి అవకాశమే. గొప్ప అభివృద్ధికి పునాదులు వేసే అవకాశం ఈనాటి భారతీయులకు వచ్చింది. మనం సాధించే ప్రగతి రాబోయే వెయ్యేళ్లు గుర్తుండిపోతుంది. పేదరికంపై జరుగుతున్న యుద్ధంలో పేద ప్రజలు కచ్చితంగా విజయం సాధిస్తారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించబోతున్నాం. దేశంలో అవినీతి, కులతత్వం, మతతత్వానికి ఎంతమాత్రం స్థానంలేదు. జీ20 కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించడంలో వింతేమీ లేదే. అది సహజమే. భారత్ చాలా విశాలమైన, వైవిధ్యం కలిగిన దేశం. మన సొంత భూభాగంలో ఎక్కడైనా సదస్సులు నిర్వహించుకునే స్వేచ్ఛ మాకుంది. వాతావరణ మార్పులపై పోరాడే విషయంలో కేవలం ఒకే విధానం సరిపోదు. నిర్మాణాత్మక చర్యలుండాలి. వాతావరణ లక్ష్యాలను సాధించే విషయంలో ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోం. ఉగ్రవాద సంస్థలు టెక్నాలజీని విచ్చలవిడిగా వాడుకుంటున్నాయి. కార్యకలాపాల కోసం డార్క్ నెట్, మెటావెర్స్, క్రిప్టోకరెన్సీ వేదికలను ఉపయోగించుకుంటున్నాయి. సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలి.

ప్రపంచ సమస్యలకు భారత్ పరిష్కారం

భారత్‌లో అమలవుతున్న మానవ కేంద్రిత అభివృద్ధి మోడల్‌ను ప్రపంచ దేశాలు గుర్తించి, అనుసరిస్తున్నాయి. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగుతున్నాం. మన దేశాన్ని గతంలో కేవలం ఒక పెద్ద మార్కెట్‌గానే పరిగణించేవారు. ఇప్పుడు ప్రపంచ దేశాల ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కార మార్గాలు చూపిస్తోంది. అప్పుల భారం అనేది అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెద్ద ముప్పుగా మారుతోంది. ఉచిత పథకాలు అనేవి సరైన ఆలోచన కాదు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచ పరిణామాలు మారిపోతున్నాయి. దానికి అనుగుణంగా ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితిలో అన్ని దేశాల గొంతుకలకు ప్రాతినిధ్యం దక్కాలి. జీ20లో ఆఫ్రికన్ యూనియన్‌కు పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించాలి. అందుకు మేము మద్దతు ఇస్తాం. అన్ని గొంతుకలను గుర్తించకుండా, ప్రాతినిధ్యం కల్పించకుండా.. ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ ప్రణాళిక కూడా సఫలం కాదు'' అని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

5న ఇండియా ఎంపీలతో ఖర్గే భేటీ

న్యూఢిల్లీ: రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ నెల 5న ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఢిల్లీ రాజాజీమార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఈ భేటీ జరగనుంది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రతిపక్షాలు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశముందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఎజెండాను కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు వెల్లడి చేయలేదు. కాగా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆదివారం ఖర్గేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలతోపాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు చర్చించినట్లు సమాచారం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఇండియా పేరుతో కూటమిగా ఏర్పాటైన విషయం తెలిసిందే.

సమాఖ్య వ్యవస్థపై దాడి

'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై రాహుల్



న్యూఢిల్లీ: 'ఒక దేశం–ఒకే ఎన్నిక' ఆలోచనను దేశ సమాఖ్య వ్యవస్థ మీదా, దాని రాష్ట్రాలన్నింటి మీదా వికృత దాడిగా కాంగ్రెస్ సీనియర్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ అభివర్ణించారు. 'ఇండియా అంటే భారత్. రాష్ట్రాల సమాఖ్య' అంటూ ఆదివారం ఎక్స్‌లో ఆయన వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ సారథ్యంలో ఎనిమిది మంది సభ్యులతో కేంద్రం శనివారం కమిటీ వేయడం తెలిసిందే. కమిటీ సభ్యత్వాన్ని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి అప్పటికప్పుడే నిరాకరించారు కూడా.

'జమిలి'తో సామాన్యులకు లాభమేంటి?



చండీగఢ్: 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. జమిలి ఎన్నికల వల్ల సామాన్య ప్రజలకు ఉపయోగం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం హరియాణాలోని భివానీలో ఎన్నికల ప్రచార సభలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఏదో ఒక రోజు బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ దేశం నుంచి తుడిచిపెట్టేస్తుందని అన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక అవసరం లేదని, ఒకే దేశం–ఒకే విద్య కావాలని ఆకాంక్షించారు. ధనవంతులకు, పేదలకు ఒకేరకరమైన విద్య అందించాలన్నారు. ఒకే దేశం–100 ఎన్నికలు, ఒకే దేశం–1,000 ఎన్నికలు అయినా సామాన్య ప్రజలకు పెద్దగా తేడా ఏమీ ఉండదని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికలు అవసరం లేదని తేల్చిచెప్పారు. ఉచిత పథకాలు అంటూ కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పేదలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించడం నేరమా? పాపమా? అని ప్రశ్నించారు. హరియాణాలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కేజ్రీవాల్ మండిపడ్డారు.

వలార్మతి గళం మూగబోయింది..



చెన్నై: దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా..కొందరి గొంతు మాత్రమే ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాంటి గుర్తుండిపోయే గొంతుక మేడమ్ వలార్మతిది. మన ఇస్రో ప్రయోగించిన పదుల సంఖ్యలో రాకెట్లకు కౌంట్‌డౌన్ చెప్పింది ఈమెనే. 1959లో తమిళనాడులోని అరియలూర్‌లో జన్మించిన వలార్మతి 1984లో ఇస్రోలో సైంటిస్ట్‌గా చేరారు. ఇస్రో ప్రయోగించిన రాకెట్‌లకు లాంఛింగ్ కౌంట్‌డౌన్ ఆమే చెప్పేవారు. ఇలా ఈమె విలక్షణమైన కంఠం దేశప్రజలకు సుపరిచితం. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాన్ని మొదటిసారిగా 2015లో ఈమె అందుకున్నారు. చివరిసారిగా చంద్రయాన్–3 మిషన్ రాకెట్‌కు వలార్మతినే కౌంట్‌డౌన్ చెప్పడం విశేషం. ఇస్రో నుంచి రిటైరైన ఈమె శనివారం సాయంత్రం గుండెపోటుకు గురై చెన్నైలోని ఆస్పత్రిలో కన్నుమూశారు.

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి

- సమానత్వానికి, సామాజిక న్యాయానికి అది వ్యతిరేకం
- తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు
- తీవ్రంగా మండిపడ్డ బీజేపీ



చెన్నై: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ కొడుకు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా వివాదాస్పదమయ్యాయి. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. సనాతన ధర్మాన్ని ఆయన కరోనా వైరస్, మలేరియా, డెంగీ జ్వరం, దోమలతో పోల్చారు. ఇలాంటి వాటిని వ్యతిరేకించడం కాదు, నాశనం చేయాలన్నారు. శనివారం చెన్నైలో తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో ఉదయనిధి మాట్లాడారు. 'సనాతన్ అనేది సంస్కృత పదం. సనాతన్ అంటే ఏమిటి? ఇది శాశ్వతమైంది. అంటే మార్చేందుకు వీల్లేనిది. ఎవరూ ప్రశ్నించలేనిది. మతం, కులం ఆధారంగా ఇది ప్రజలను విడదీస్తుంది' అని ఉదయనిధి అన్నారు. 'సనాతన ధర్మం కారణంగా భర్త కోల్పోయిన మహిళలు నిప్పుల్లోకి నెట్టివేయబడ్డారు(గతంలో సతీసహగమనం). వితంతువులకు శిరోముండనం చేయించారు. తెల్ల చీరలు ధరింపజేశారు. బాల్య వివాహాలూ జరిగాయి. ద్రవిడ విధానంలో అటువంటి వాటిని లేకుండా చేశాం .వారికి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విశ్వకర్మ యోజన పథకం, 1953లో రాజగోపాలాచారి తీసుకువచ్చిన కులాధారిత విద్యా పథకం వంటిదే. డీఎంకే దీనిని గట్టిగా వ్యతిరేకిస్తుంది. వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు నోచుకోరాదనే నీట్ వంటి వాటిని కేంద్రం తీసుకువచ్చింది. దీనిని మేం వ్యతిరేకిస్తున్నాం 'అని ఉదయనిధి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సనాతనం ఓడాలి, ద్రావిడం గెలవాలి అని ఉదయనిధి అన్నారు. 'అన్ని కులాల వారు ఆలయాల్లో అర్చకత్వానికి అర్హులేనంటూ కరుణానిధి చట్టం తెచ్చారు. మన సీఎం స్టాలిన్ అర్చకత్వంలో శిక్షణ పొందిన వారిని ఆలయాల్లో పూజారులుగా నియమించారు. ఇదే ద్రవిడియన్ మోడల్' అని ఆయన చెప్పారు.

అది విద్వేష ప్రసంగం: బీజేపీ

సనాతన ధర్మాన్ని ఆచరించే 80% మందిని సామూహికంగా చంపేయాలంటూ ఉదయనిధి వ్యాఖ్యానించడం విద్వేష ప్రసంగమేనని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ అన్నారు. మిత్ర పక్షం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకవైపు ప్రేమ దుకాణం తెరుద్దామని పిలుపునిస్తుండగా డీఎంకే వారసుడు సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటున్నారన్నారు. సామూహికహననం వ్యాఖ్యలపై కాంగ్రెస్ మౌనం మద్దతు నివ్వడమే అవుతుంది. పేరుకుతగ్గట్లే ఇండియా కూటమికి అధికారమిస్తే వేలాది సంవత్సరాల భారత సంస్కృతిని ధ్వంసం చేస్తుంది' అని పేర్కొన్నారు.

నేనలా అనలేదు: ఉదయనిధి

తన వ్యాఖ్యలపై చెలరేగిన విమర్శలపై ఉదయనిధి 'ఎక్స్'లో స్పందించారు. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించడమంటే మానవత్వాన్ని, సమానత్వాన్ని సాధించడమే. సనాతన ధర్మం కారణంగా అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన వారి తరఫున మాట్లాడాను. నేను మాట్లాడిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నాను. సనాతన ధర్మాన్ని ఆచరించే వారిని సామూహికంగా హతమార్చాలని మాత్రం నేను అనలేదు. సమాజంపై సనాతన ధర్మం ఎటువంటి చెడు ప్రభావం చూపిందనే విషయంలో అంబేడ్కర్, పెరియార్ వంటి వారు అధ్యయనం చేసి రాసిన పుస్తకాల్లో ఏముందో చూపిస్తాను. ఎటువంటి సవాళ్లయినా ఎదుర్కోవడానికి నేను సిద్ధం'అని పేర్కొన్నారు.

ఓట్ల కోసమే సనాతన ధర్మాన్ని అవమానిస్తున్నారు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



దుంగార్‌పూర్(రాజస్తాన్): సామాజిక న్యాయానికి, సమానత్వానికి సనాతన ధర్మం వ్యతిరేకమంటూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ ఈ విధమైన ఆరోపణలకు దిగుతున్నాయని మండిపడ్డారు. లష్కరే తోయిబా కంటే హిందుత్వ సంస్థలే మరింత ప్రమాదకరమంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. ఇలాంటివి వీరికి కొత్తకాదు, ఓట్ల కోసం ఎంతకైనా తెగిస్తారని పేర్కొన్నారు.

జీ20 నేతలకు మెనూ సిద్ధం

స్ట్రీట్ ఫుడ్, తృణధాన్యాల వంటకాలకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా పలువురు ప్రపంచ దేశాల నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఎన్నో పోషకాలతో నోరూరించే భారతీయ తృణధాన్యాల వంటకాల రుచిని వీరికి చూపించనున్నారు. భారత్ మంటపంలో జరుగుతున్న శిఖరాగ్రం ఏర్పాట్లను జీ20 స్పెషల్ సెక్రటరీ ముక్తేశ్ పర్దేశి ఆదివారం పీటీఐకి వివరించారు. 'మన దేశ స్ట్రీట్ ఫుడ్, ప్రాంతీయ, స్థానిక వంటకాలను వారికి సరికొత్త రీతిలో పరిచయం చేయనున్నాం. ఢిల్లీలోని చాందినీ చౌక్ తదితర ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్‌కు ఎంతో పేరుంది. ఇక్కడ ఏర్పాటు చేయనున్న మీడియా సెంటర్‌లో భారతీయ స్ట్రీట్ ఫుడ్ రుచిని ఆస్వాదించొచ్చు'అని పర్దేశి వివరించారు. ప్రపంచదేశాల నేతల సతీమణుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. 'నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో షాపింగ్ అనుభవంతో కూడిన భారతీయ ప్రసిద్ధ హస్తకళల వారసత్వంపై లైవ్ షోలు ఏర్పాటుచేశాం. నేతలు, ప్రతినిధులకిచ్చే బహుమతుల ఎంపికలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం'అని చెప్పారు. 'ప్రపంచ నాయకులకిచ్చే బహుమతులు గౌరవభావాన్ని పెంచేలా, వారి మనస్సును ఆకట్టుకునేలా ఉండాలని ప్రధాని చెప్పారు. ఆ మేరకు తివాచీలు, హస్తకళల వస్తువులు, పెయింటింగ్‌ల వంటి వాటితో జాగ్రత్తగా తయారు చేసిన జాబితాను అందజేశాం'అని తెలిపారు. శిఖరాగ్రానికి వివిధ దేశాల నుంచి 10 వేల మందికి పైగా తరలిరానున్నారని పర్దేశి చెప్పారు. 'శిఖరాగ్రంలో చివరి సెషన్‌లో జీ20 తదుపరి అధ్యక్ష హోదాలో బ్రెజిల్ లాంఛనప్రాయంగా బాధ్యతలను చేపడుతుంది. నవంబర్ 30వ తేదీన ప్రధాని బ్రెజిల్‌కు వెళ్లి బాధ్యతలను అప్పగించే అవకాశం లేకపోవడంతో ఈ మేరకు నిర్ణయించారు'అని పర్దేశి చెప్పారు.

సాక్షి 24|7
కర్ణాటక
K A R N A T A K A
సోమవారం : 4 : సెప్టెంబర్ : 2023



త్వరలో చవితి నేపథ్యంలో గణపతి విగ్రహాలు అమ్మకాలకు సిద్ధమయ్యాయి. ధార్వాడలో ఓ షాపులో అనేక రూపాల్లోని వినాయకులు కొలువైన దృశ్యం

న్యూస్‌రీల్

బావమరిది చేతిలో మాజీ జవాన్ హత్య



హత్యకు గురైన ఈరనగౌడ (ఫైల్)

యశవంతపుర: బావ ఎన్ని తప్పులు చేసినా బావమరుదులు కాపాడుకుంటారని నానుడి, కానీ బెళగావి జిల్లా చిక్కోడి పట్టణంలోని విద్యానగర లేఔట్‌లో శనివారం సాయంత్రం విశ్రాంత జవాన్‌ను అతని బావ మరిది చాకుతో పొడిచి చంపాడు. శుక్రవారం సాయంత్రం జైనాపురకు చెందిన ఈరనగౌడ టోపగైడర (45) ఇంటికి బావమరిది సంజయ బాకరె వెళ్లాడు. ఆ సమయంలో ఈరనగౌడ భార్య కూడా ఉంది. బాకరె వారితో మాట్లాడుతూ చాకు తీసి బావ గొంతులో పొడిచి పరారయ్యాడు. తీవ్రగాయాలైన ఈరనగౌడను ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. ఈరనగౌడ సైన్యం నుంచి రిటైరయ్యాక ఊరి వద్ద క్రషర్ నిర్వహించేవాడు. మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తన సోదరిని వేధిస్తున్నాడనే కోపమే హత్యకు కారణమని భావిస్తున్నారు. ఘటనాస్థలిని పోలీసు అధికారులు పరిశీలించారు.

కీచక హెచ్‌ఎంకు సంకెళ్లు

యశవంతపుర: విద్యాబుద్ధులు బోధించాల్సిన హెడ్‌మాస్టర్ కీచకుని అవతారమెత్తాడు. విద్యార్థులకు, అతిథి ఉపాధ్యాయురాలిని మానసికంగా, లైంగికంగా వేధిస్తున్న ఘటన కలబురగి జిల్లా చిత్తాపుర తాలూకా వాడిలో జరిగింది. వాడి ప్రభుత్వ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం .. ఈ నీచానికి పాల్పడ్డాడు. నా కళ్లలో కళ్లు పెట్టి చూడండి అని బాలికలను, అతిథి ఉపాధ్యాయురాలిని ఒత్తిడి చేసేవాడు. దీనిపై విద్యార్థినులు బీఈఓకి ఫిర్యాదు చేయగా అటు నుంచి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో కీచక హెచ్‌ఎంను పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్పీ ఈశా పంత్ తెలిపారు.

భార్యపైనే లాఠీచార్జి


- అదనపు కట్నం కోసం పోలీస్ అకృత్యాలు



సహన- సునీల్ పెళ్లి నాటి చిత్రం

తుమకూరు: పుట్టింటి నుంచి మరింత కట్నం తేవాలని వేధిస్తూ లాఠీతో కొడుతున్న పోలీసు కానిస్టేబుల్ ఉదంతమిది. వివరాలు.. బాధితురాలు సహన భర్త సునీల్ కుమార్ తుమకూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అరసికెరెకు చెందిన సహనకు ఏడాదిన్నర క్రితం సునీల్‌కుమార్‌తో పెద్దలు పెళ్లి చేశారు. 67 గ్రాముల బంగారం ఇచ్చి, అలాగే రూ. 18 లక్షలు ఇచ్చి అరసికెరె వీరశైవ కళ్యాణ మండపంలో ఘనంగా వివాహం చేశారు. పెళ్లయిన రెండు నెలల తర్వాత సహనకు బ్రెయిన్ ట్యూమర్ అని తెలిసి బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుంది. మరోవైపు అదనపు కట్నం కోసం సునీల్ కుమార్ వేధిస్తున్నాడు. ఇల్లు కట్టాలని, కారు కొనాలని, రూ. 20 లక్షలు తీసుకుని రావాలంటూ ఒత్తిడి చేస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాక లాఠీతో తరచూ కొడుతున్నాడని విలపించింది. తుమకూరు ఎస్పీని కలిసి అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు తుమకూరు మహిళ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

బెంగళూరులో కరెంటు చార్జీల పెంపు



బనశంకరి: ఓ పక్క గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. మరోవైపు సిలికాన్ సిటీలో కస్టమర్లకు షాక్ ఇచ్చేలా కరెంటు చార్జీలను పెంచింది. ఎఫ్‌పీపీసీఏ ప్రతి యూనిట్ మీద రూ.50 పైసల నుంచి రూ.1.15 వరకు పెంచుతూ బెస్కాం నిర్ణయం తీసుకుంది. బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ పరిధిలో కరెంటు వాడకందారులకు ఈ నెల నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. గృహజ్యోతి పథకం అర్హులకు ఈ భారం పడదు, కానీ గృహజ్యోతి పరిధిలో లేని మధ్య తరగతివారు, ఇతరులు, షాపులు, సంస్థలు, పరిశ్రమలు తదితరాలు పెంపు బాదుడును భరించాలి.

సంక్షోభం అంచున కబిని



మైసూరు జిల్లాలోనున్న కబిని జలాశయం



బాగా తగ్గిపోయిన డ్యాం నీటిమట్టం

- ఖాళీ అవుతోన్న జలాశయం
- ఒకవైపు అనావృష్టి, మరోవైపు నీటి విడుదల
- సాగు, తాగునీటికి ప్రమాద ఘంటికలు
- వర్షాలపైనే అందరి ఆశలు

మైసూరు: జిల్లాలోనున్న కబిని జలాశయం ఈసారి కురిసిన వర్షాలకు ఆలస్యంగా అయినా నీటితో నిండిపోయింది. అయితే కబిని జలాశయానికి మాత్రం వాయనం సమర్పించేందుకు మంత్రులు కానీ, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కానీ ఇప్పటికీ రాలేదు. ఇందుకు కారణం కావేరి జలాల వివాదమే. గత నెల్లో కురిసిన వర్షాలకు జలాశయం దాదాపు నిండింది. సుమారు 20 వేల క్యూసెక్కుల నీరు గేట్లను ఎత్తి వదలడంతో తమిళనాడుకు వెళ్లిపోయింది. అయితే ఆగస్టు మొదటి వారం ప్రారంభం కాగానే వర్షాలు కొద్దిగా ముఖం చాటేశాయి. దీంతో పొరుగురాష్ట్రం తక్షణం తమకు వాటా ప్రకారం కావేరి నీటిని విడుదల చేయాలని కోరుతూ ఢిల్లీలో కావేరి జలాల ప్రాధికారని ఆశ్రయించింది. తమిళనాడు విజ్ఞప్తి మేరకు ప్రాధికార సంస్థ కూడా నీటి విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో కబిని జలాశయం నుంచి నిత్యం నీటి విడుదల మొదలైంది.

వేగంగా తగ్గుతున్న నీటిమట్టం

ప్రాధికార ఆదేశాల ప్రకారం ఇప్పటికి కబిని జలాశయంలో 10 అడుగుల మేర ఖాళీ అయ్యింది. దీంతో జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 2,273 అడుగులకు పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్‌లో 2,283 అడుగుల మేర నీరు ఉంది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్‌కు 6,643 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే, ఇప్పుడు ఆ మొత్తం 1,979 క్యూసెక్కులు మాత్రమే. రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో కంటే బయటకు వెళుతున్న ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండడం జిల్లావాసులకు, రైతులకు ఆందోళన కలిగిస్తోంది. ఇలాగే కొనసాగుతూ పోతే కబినిలో మరింత నీటి మట్టం తగ్గిపోయే ప్రమాదం ఉంది. గతేడాది 9.12 టీఎంసీల నీటిని వినియోగించుకుంటే ఈసారి కేవలం 3.80 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ కొద్ది మొత్తంలోని నీరు అడవి ప్రాణులకు, మానవులకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు సరిపోదని రైతుసంఘాలు పేర్కొన్నాయి. మామూలుగా అయితే పాలకులు ఇప్పటికే కబిని డ్యాంకి ఆర్భాటంగా వాయనం సమర్పించాల్సి ఉండగా, రైతుల ఆందోళనల వల్ల రావట్లేదని సమాచారం.

సాగు, తాగునీరెలా?

కబిని రిజర్వాయర్ పరిధిలోకి వచ్చే మైసూరు, చామరాజనగర జిల్లాల్లో ఒక్క లక్ష హెక్టార్లకు పైగా వైశాల్యంలో రాగి, జొన్న, అలసందలు, సూర్యకాంతి, గోధుమ తదితర ఆహార పంటలను రైతు సాగు చేశారు. వానలు లేకపోవడానికి తోడు డ్యాంలో నీరు రోజురోజుకి క్షీణిస్తుండడంతో ఈ పంటల సాగు ప్రస్తుతం ప్రమాదంలో పడేలా ఉంది. అలాగే బెంగళూరు, మైసూరు, చామరాజనగర జిల్లాలకు కూడా ఇక్కడి నుంచే తాగునీరు వెళ్తుంది. ఒక్క మైసూరు నగరానికే సుమారు 160 ఎంఎల్‌డీ నీరు తాగు నీటి అవసరాలకు కావాల్సి ఉంది. దీంతో సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం తమిళనాడుకు నీటి విడుదలవ్వకుండా ప్రభుత్వం అడ్డుకోవాలని ప్రజలు, రైతులు పోరాటాలను తీవ్రం చేయాలని నిర్ణయించారు. ఈలోపు దండిగా వర్షాలు కురిస్తే సమస్య తీరిపోతుంది.

ఐటీ ఉద్యోగికి రూ.17 లక్షలు టోపీ



హోసూరు: యూట్యూబ్ వీడియోలను లైక్ చేస్తూ అధిక డబ్బు సంపాదించవచ్చునని నమ్మించి ఐటి ఉద్యోగి వద్ద రూ. 17 లక్షలు కొట్టేశారు సైబర్ క్రిమినల్స్. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా బర్గూరుకు చెందిన త్యాగు (26) బెంగళూరులో ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం ఇతని వాట్సాప్‌కు వచ్చిన లింక్ ద్వారా యూట్యూబ్ వీడియోలను చూస్తూ, లైక్ చేసి డబ్బు సంపాదించవచ్చని చెప్పారు. నిజమేనని నమ్మిన త్యాగు కొద్ది కొద్దిగా నగదును డిపాజిట్ చేస్తూ కమీషన్ అందుకొంటూ వచ్చాడు. త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించాలంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలని మోసగాళ్లు ఒత్తిడి చేయడంతో త్యాగు రూ. 17 లక్షలను వారి ఖాతాల్లోకి జమ చేశాడు. ఆ తరువాత దుండగులు ఆన్‌లైన్ లింక్‌ను బంద్ చేయడంతో మోసపోయిన త్యాగు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగిన వేడుకల్లో కేరళ కళాకారిణుల నృత్యం

సంక్షేమ ప్రదాత డాక్టర్ వైఎస్సార్



చారిటబుల్ ట్రస్టు బాలల మధ్య వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం



బాలలకు భోజనం వడ్డిస్తున్న ఐటీ వింగ్ సభ్యులు

- బెంగళూరులో ఘనంగా వర్ధంతి
- అనాథ బాలలకు ఐటీ వింగ్‌చే అన్నదానం

బనశంకరి: అపర భగీరథునిగా, జలయజ్ఞ ప్రదాతగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలు అపారమని వైఎస్సార్ సీపీ బెంగళూరు ఐటీ విభాగం నేతలు ఘన నివాళులర్పించారు. అభివృద్ధి, సంక్షేమం అనేవి రెండు కళ్లుగా భావించిన మహోన్నత నేత అని గుర్తుచేసుకున్నారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని శనివారం మారతహళ్లి కార్తీక్ నగరలోని మధు మ్యాన్సన్ చారిటబుల్ ట్రస్ట్‌లో నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి ఐటీ వింగ్ సభ్యులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర వస్తువులు పంపిణీ, పిల్లలకు అన్నదానం చేశారు. దివంగత ఐటీ వింగ్ నేతలు శ్యామ్ కలకడ, హరికృష్ణ యాదవ్‌ల చిత్రపటాలకు కూడా శ్రద్ధాంజలి ఘటించి వారి సేవలను కొనియాడారు. వైఎస్సార్ స్ఫూర్తితో ఎప్పటిలాగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులు!

శివాజీనగర: కేఎస్ ఆర్‌టీసీ బస్సుల్లో కండక్టర్, ప్రయాణికుల మధ్య 'చిల్లర' గొడవలను తప్పించేందుకు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా టికెట్ల అమ్మకాలకు సన్నాహాలు చేస్తోంది. ప్రయాణికులు టికెట్ తీసుకుని డబ్బులు ఇస్తే చిల్లర లేదని కండక్టర్ చెప్పడం, వాగ్వాదాలు జరగడం తరచూ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా కొన్ని బస్సుల్లో యూపీఐ పేమెంట్‌ను జారీలోకి తీసుకువచ్చింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే టికెట్ మొత్తం ఆర్టీసీ ఖాతాలోకి జమవుతుంది. రాబోయే రోజుల్లో కేఎస్‌ఆర్‌టీసీలో అన్ని బస్సుల్లో డిజిటల్ చెల్లింపులను అమలులోకి తెస్తామని అధికారులు తెలిపారు.



ఆదివారం మంగళూరులో వెండి రథంలో నటుడు అనంత్‌నాగ్- గాయత్రీ దంపతుల ఊరేగింపు. అనంత్‌నాగ్ 50 ఏళ్ల నట జీవితానికి గుర్తుగా అభిమానులు ఈ వేడుక నిర్వహించారు

బలిగొన్న అత్తింటి వేధింపులు

- పెళ్లయిన ఏడాదిన్నరకు ఆత్మహత్య



భర్త కిరణ్‌తో భవ్య (ఫైల్)

దొడ్డబళ్లాపురం: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలమంగల తాలూకా తిరుమలెగౌడనపాళ్య గ్రామంలో చోటుచేసుకుంది. భవ్య (27) మృతురాలు. తిరుమలెగౌడనపాళ్య గ్రామానికి చెందిన కిరణ్‌తో ఏడాదిన్నర క్రితం రూ.30 లక్షల కట్నం ఇచ్చి ఎంతో వైభవంగా వివాహం జరిపించారు భవ్య తల్లిదండ్రులు. సంతానం కలగలేదని, అదనపు కట్నం తీసుకురావాలని అత్తింట్లో వేధింపులు మొదలయ్యాయి. భవ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలనూ పిలిచి రాజీ చేశారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో భవ్య లక్కప్పనహళ్లి గ్రామంలోని పుట్టింటికి వచ్చేసింది. జీవితం ఇలా అయిపోయిందని విరక్తి చెంది శనివారం సాయంత్రం వాదకుంట గ్రామం వద్ద రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకుంది. భవ్య తల్లితండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెలమంగల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

బళ్లారి అర్బన్: గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు... బళ్లారి తాలూకా మోకా సమీపంలో గల బైరదేవనహళ్లి గ్రామానికి చెందిన రుక్మణ్‌రెడ్డి రెండో కుమారుడు ప్రతాప్ రెడ్డి (20) మైసూరులోని ఎన్‌ఐఈ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ప్రతాప్ రెడ్డి ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

ఇన్‌స్టా బ్లాక్‌మెయిలర్ అరెస్టు

- మహిళలకు వల



ఫైసల్

బనశంకరి: సోషల్ మీడియాలో యువతులను పరిచయం చేసుకుని కామవాంఛ తీర్చుకుని వీడియో తీసి బ్లాక్‌మెయిల్ కు పాల్పడుతున్న ఐటీ ఇంజినీర్‌ను ఆదివారం బెంగళూరు హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితుడు ఫైజల్ అసోంవాసి, ఇన్‌స్టా గ్రాంలో చురుకుగా ఉండే యువతులను, మహిళలను టార్గెట్‌గా చేసుకుని పరిచయం చేసుకునేవాడు. మీ చిన్ననాటి స్నేహితున్ని అని మెసేజ్‌లు పంపి చాటింగ్ చేస్తూ తీయని మాటలతో వలలో వేసుకునేవాడు. వారిని గదికి పిలిపించుకుని వాంఛ తీర్చుకుని గుట్టుగా వీడియో తీసేవాడు. తరువాత ఆ వీడియో చూపి మహిళలను బ్లాక్‌మెయిల్ చేస్తూ పబ్బం గడుపుకొనేవాడు. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లోని మహిళను ఇలాగే వలలోకి వేసుకున్నాడు, ఆ వీడియో చూపి ఆమెను చెన్నై కి రావాలని బ్లాక్‌మెయిల్ చేశాడు. భయభ్రాంతులకు గురైన మహిళ హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వంచకుడు ఫైసల్‌ను ఆదివారం అరెస్ట్‌చేసి విచారణ చేపట్టారు.

రండి ప్లీజ్, చేరండి

- బీజేపీ నేతలకు డీకేశి రాయబారాలు
- కిచ్చ సుదీప్ బర్త్ డే విందులోనూ రాజకీయాలు





శివాజీనగర: రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి ఆపరేషన్ హస్తం చేపట్టి బీజేపీ, జేడీఎస్‌లలోని బలమైన నేతలను చేర్చుకుని ఎక్కువ సీట్లను గెలుచుకోవాలని అధికార కాంగ్రెస్ ప్రయత్నాలు సాగిస్తోంది. కానీ చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ హస్తం తలుపు తట్టకపోవడంతో కేపీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందుకు అన్ని అవకాశాల్ని వాడుకుంటున్నారు. శనివారం రాత్రి బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు బీసీ పాటిల్, రాజుగౌడ, మరికొందరితో చర్చలు జరిపారు. ప్రముఖ నటుడు నటుడు కిచ్చ సుదీప్ ఒక హోటల్లో జరిపిన పుట్టిన రోజు విందు ఇందుకు వేదికైంది. ఈ వేడుకకు హాజరైన బీజేపీ నాయకులతో డీకే మాటలు కలిపినట్లు సమాచారం.

నేను బీజేపీని వీడను: రాజుగౌడ

ఆపరేషన్ హస్తం చేసేందుకు నాకు క్యాన్సర్ గడ్డ ఏమీ లేదు, నాకు బీజేపీలో సరైన స్థానం ఇవ్వలేదని అసంతృప్తి ఉంది, అయినా పార్టీనీ వీడను అని రాజుగౌడ చెప్పారు. నియోజకవర్గంలో మంచి పనులు చేపట్టినా కూడా ఎందుకు ఓటమి పాలయ్యారని డీకే అడిగారు. సుదీప్ పుట్టినరోజు కంటే శివకుమార్‌తో మేము మాట్లాడిందే పెద్ద వార్త అయ్యింది అని చమత్కరించారు.



ఆదివారం మైసూరులో దసరా ఫ్లవర్ షో కోసం రెడీ అవుతున్న పుష్పాలు, మొక్కలు

ఉసురు తీసిన లారీ

- వేగంగా బైక్‌ను ఢీ...
- వివాహిత, బంధువు దుర్మరణం
- తుమకూరు జిల్లాలో ఘోరం



ప్రమాదానికి గురైన బైక్



శశికుమార్, మీనాక్షి మృతదేహాలు

తుమకూరు: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు సామాన్యులను బలిగొంటున్నాయి. సగటున నిత్యం 25 నుంచి 30 మంది వరకూ మృత్యువాత పడుతున్నారు. రక్తసంబంధీకులు, దంపతులు విగతజీవులై కుటుంబానికి తీరని శోకం మిగల్చడం వెనుక భారీ వాహనదారుల నిర్లక్ష్యం ఎంతో ఉంది. అదే కోవలో గుర్తు తెలియని టిప్పర్ లారీ ఒకటి బైక్‌ను ఢీ కొనడంతో ఆదివారం ఉదయం ఇద్దరు మరణించగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన తుమకూరు జిల్లా శిరా తాలూకా తరూరు గ్రామానికి సమీపంలో జరిగింది. తుమకూరు అంతరసనహళ్లికి చెందిన వివాహిత మీనాక్షి (28), ఆమె బంధువు గౌరిబిదనూరు తాలూకా తందళ గ్రామానికి చెందిన యువకుడు శశికుమార్ (23) చనిపోయారు. మీనాక్షి భర్త మదన్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పెళ్లికని వెళ్తుండగా..

మడకశిర నియోజకవర్గంలోని అగళికి బంధువుల ఇంటికి పెళ్లికని ముగ్గురూ ఒకే బైక్‌పై వెళుతుండగా బడవనహళ్లి రోడ్డులో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మీనాక్షి, శశి కుమార్ అక్కడికక్కడే మరణించారు. కాగా, లారీ వాహనం అతి వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. కళ్లంబెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి లారీ కోసం గాలింపు చేపట్టారు.

క్లుప్తంగా

సేవా కార్యక్రమాలతో వార్షికోత్సవం


నగలను ప్రదర్శిస్తున్న రచితారామ్

బనశంకరి: రాజరాజేశ్వరినగరలో ఆర్ఆర్.నగర ప్రవీణ్ జ్యువెల్స్ 6వ వార్షికోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించింది. బంగారు ఆభరణాలు కొనుగోలుపై రాయితీతో పాటు అన్నదానం వంటి సమాజసేవా కార్యక్రమాలను నిర్వహించారు. కన్నడనటి రచితారామ్ హాజరై సందడి చేశారు. డైరెక్టర్ ప్రవీణ్‌గన్నా పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన


నాటకంలోని దృశ్యం

గౌరిబిదనూరు: పట్టణంలోని డాక్టర్ హెచ్ఎన్ కళా భవనంలో గౌతమబుద్ధ సామాజిక సాంఘిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రదర్శించిన వినుర వేమ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకొంది. వేమన శ్రీశైలం వెళ్లి అక్కడ అక్క మహాదేవి వచనాలతో ప్రభావితులై సంఘ సంస్కర్తగా తన రచనలు సాగించారని, ఆయన ఆదర్శ నిరాడంబర జీవితం ప్రజలకు ఆదర్శమని కేఏఎస్ అధికారి వరప్రసాదరెడ్డి తెలిపారు. కాగా నాటకానికి రామకృష్ణ దర్శకత్వం వహించగా, కోలారు రాజప్ప సంగీతాన్నందించారు. గౌతమ బుద్ధ సంస్థ నిర్వాహకులు ఇడగూరు ప్రసన్న, మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి పాల్గొన్నారు.

పాల డెయిరీ ఎన్నికల్లో జేడీఎస్ విజయం


గెలుపొందిన డైరెక్టర్లకు సన్మానం

చింతామణి: తాలుకాలోని మైలాపు పాల డెయిరీ సంఘం ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందారు. 12 మంది డైరెక్టర్లు ఉండగా ఇందులో ఒక స్థానం ఎస్టీ స్థానం ఉంది. అయితే ఎస్టీలకు సంబంధించి కాంగ్రెస్ మద్దతుదారుడు ఆంజప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 11 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా జేడీఎస్ మద్దతుదారులు ఆమరేష్, వెంకటేశప్ప కృష్ణప్ప, ఈశ్వరప్ప, శ్రీనివాసప్ప, ద్యావప్ప, అమరనాథ్, దేవప్ప,స్నేహ ఆర్ వెంకటేశ్ విజయం సాధించారు.


నైజీరియా మహిళ అరెస్ట్, డ్రగ్స్ స్వాధీనం

బనశంకరి: డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న నైజీరియాకు చెందిన అడవూలేఅడెట్టుఅలియాస్ రెజీనా ఝురా అలియాస్ అయేషా(33) అనే మహిళను సీసీబీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే 400 గ్రాములు ఎండీఎంఏ, మొబైల్‌ఫోన్, రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏదో ఒక అంశంపై అధ్యయనం పేరుతో భారత్‌కు విచ్చేసిన ఆమె యలహంకలో నివాసం ఉంటూ నర్స్‌గా పనిచేసేది. ఉద్యోగానికి రాజీనామా చేసి డ్రగ్స్ విక్రయిస్తోందని పోలీసులు తెలిపారు. ఆమెపై మంగళూరులో ఏడు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కెజీఎఫ్ : నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 1.5 లక్షల విలువ చేసే 2.45 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఉత్తరప్రదేశ్ బదాయి జిల్లాకు చెందిన ఫైజాద్, మహమ్మద్ ఖాసీం అని పోలీసుల విచారణలో తేలింది.

నీటికుంటలో శవమై తేలిన మహిళ


రాధమ్మ మృతదేహం

చింతామణి: అదృశ్యమైన ఓ మహిళ నీటికుంటలో శవమై తేలింది. వివరాలు... తాలుకాలోని చిక్కబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ, రాధమ్మ దంపతులు కూలి పనులు చేస్తూ జీవించేవారు. ఇటీవల అనారోగ్యానికి గురైన రాధమ్మ మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. ఆదివారం గ్రామ సమీపంలోని నీటి కుంటలో శవమై కనిపించింది. భర్త ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కంప్లి: తాలూకాలోని సుగ్గేనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో 31 మంది విద్యార్థులకు మంగళముఖి రాజమ్మ రూ.20 వేలతో టీ షర్టులు, ప్యాంట్లు, అందించారు. రాజమ్మ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి దుస్తులు ధరించి రావాలని తన వంతు సాయం చేసినట్లు చెప్పారు.

హెచ్చెల్సీకి మళ్లీ గండి

- రైతుల్లో ఆందోళన
- ఆధునికీకరణ పనులు జరిగిన చోటే..
- వందల కోట్లు వ్యయం చేసినా తరచూ గండ్లు
- కాలువకు నీటి సరఫరా నిలుపుదల

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక పరిధిలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని అనంతపురం జిల్లాకు తాగు, సాగు నీరు అందించే హెచ్ఎల్‌సీ కాలువకు మళ్లీ గండి పడింది. వారం రోజులు క్రితం గండి పడిన కాలువకు ఎదురుగానే కోళగల్లు వద్ద 78 కిలోమీటర్ వద్ద ఆదివారం గండిపడటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గండి సమాచారం అందుకున్న బోర్డు అధికారులు హుటాహుటిన చేరుకుని మరమ్మతు పనులు చేయడంపై దృష్టి సారించారు. ఎమ్మెల్యే గణేష్ కూడా గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.



గండి పడిన ప్రాంతంలో నీరు బయటకు పోతున్న దృశ్యం

రూ. కోట్లు వ్యయం చేసినా నాసిరకం పనులు ?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి వర్షాలు కురవకపోవడంతో డ్యాంలోకి నీరు అదునులో చేరకపోవడంతో కాలువకు కూడా నీరు ఆలస్యంగా విడుదల చేశారు. దీంతో తుంగభద్ర ఆయకట్టు కింద వరి, పత్తి, మిర్చి తదితర పంటలను అష్టకష్టాలతో సాగు చేశారు. వరుణుడు కూడా ముఖం చాటేశారు. డ్యాం నుంచి సరఫరా చేసే నీటిపైనే రైతులు పంటలు ఆధారపడ్డాయి. ఇలాంటి క్లిష్ట,కరువు పరిస్థితుల్లో హెచ్ఎల్‌సీ కాలువ పదే పదే గండ్లు పడటం ప్రారంభం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. హెచ్ఎల్‌సీ కాలువ ఆధునీకరణకు వందల కోట్లు నిధులు వెచ్చించారు. నాలుగు సంవత్సరాలు క్రితం ఆధునీకరణ పనులు జరిగిన చోటే గండ్లు పడుతుండటంపై పనులు నాణ్యతపై రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఆధునీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్లు, అధికారులు సక్రమంగా పనులు చేయకపోవడంతోనే గండ్లు పడుతున్నాయని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ ఆరోపించారు. నాసిరకంగా, తూతుమంత్రంగా పనులు చేసి రైతులకు నీరు సరఫరా కాకుండా ఆటంకాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందల కోట్లు వెచ్చించి మరమ్మతు పనులు చేసిన కాలువ గుండా రైతులకు నీరు సక్రమంగా అందించేందుకు వీలు కాకపోవడంతో బోర్డు అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. అనంతపురం సరిహద్దుకు నీరు చేరిన మూడు రోజుల వ్యవధిలోపే మళ్లీ గండి పడటంతో రెండు జిల్లాలకు నీరు చేరుతాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


సయ్యదా సాజిద్ ఫాతిమా

రాయచూరు రూరల్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాయచూరు జిల్లా నుంచి సయ్యదా సాజిద్ ఫాతిమా ఎంపికయ్యారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మండలి విడుదల చేసిన జాబితాలో ఫాతిమా పేరు ప్రకటించారు. రాయచూరు తాలూకా యరమ రాప్ క్యాంప్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలో 25 ఏళ్లుగా ఆంగ్లం బోధిస్తున్నారు. ఫాతిమా సావిత్రి బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును అందుకోనున్నారు. మంగళవారం బెంగళూరులో అవార్డును అందుకోనున్నారు.

శివమొగ్గ ఎయిర్‌పోర్టులో కన్నడ భాష అమలు

శివమొగ్గ: శివమొగ్గ విమానాశ్రయం డిజిటల్ బోర్డుపై కన్నడ భాషలో వివరాలు వస్తుండడాన్ని మంత్రి ఎంబీ పాటిల్ తన ట్వీటర్ ఖాతా ద్వారా శనివారం పంచుకున్నారు. 'కన్నడవే సత్య.. కన్నడవే నిత్య' అనే నినాదంతో ట్వీట్ చేశారు. డిజిటల్ సమాచార బోర్డుపై ఇంగ్లిష్, హిందీ భాషల్లో వివరాలు వస్తుండడాన్ని కన్నడిగులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత అధికారులు డిజిటల్ బోర్డుపై సమాచారం కన్నడలో కూడా వస్తుండడాన్ని మంత్రి తన ట్వీటర్ ద్వారా తెలిపాడు.

అంత్యక్రియల్లో కుల పెద్దల దాష్టీకం

మైసూరు: ఆడపిల్లలు ప్రేమించి కులాంతర పెళ్లిళ్లు చేసుకున్నారని వారి తల్లి అంత్యక్రియలను నిర్వహించకుండా బంధువులు వెళ్లిపోయారు. ఈ అమానవీయ ఘటన హెచ్‌డీ కోటి తాలూకా నాగనహళ్లిలో జరిగింది. మృతురాలు కళసమ్మకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వీరు ప్రేమించి వేరే కులస్తులను వివాహం చేసుకున్నారు. ఈ కారణంతో మరణించిన కళసమ్మ అంత్యక్రియలను చేయకూడదని బంధువులు, ఇతర కుల పెద్దలు హెచ్చరికలు చేశారు. అయితే తల్లి మీద ప్రేమతో ఆ ఇద్దరు ఆడపిల్లలు తల్లి అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో బంధువులు, కుల పెద్దలు కళసమ్మ అంత్యక్రియలను నిర్వహించకుండా మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం గ్రామస్తుల సహాయంతో పిల్లలు అంత్యక్రియలు చేపట్టారు.

గృహలక్ష్మి నగదు వాపస్

రాయచూరు రూరల్: గృహలక్ష్మీ పథకం కింద జమ చేసిన నగదును ఓ వృద్ధురాలు వెనక్కి ఇచ్చిన ఘటన కొప్పళ జిల్లాలో చోటుచేసుకుంది. కుష్టిగి తాలూకాకు చెందిన నీడశేషి శివమ్మకు ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద రూ. 2 వేల నగదును ఆమె ఖాతాలో జమ చేసింది. విషయం తెలుసుకున్న శివమ్మ నగదు తనకు అవసరం లేదని, వెనక్కు ఇచ్చేసింది. గ్రామ చెరువు అభివృద్ధికి తన సొంత నగదును వినియోగించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

వేడుకగా ఉచిత వివాహాలు

బళ్లారి అర్బన్: కన్నడ రక్షణ యువ వేదిక జిల్లా అధ్యక్షుడు కప్పగల్ మునిస్వామి నేతృత్వంలో 17వ వార్షిక ఉచిత సామూహిక వివాహాలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. స్థానిక కప్పగల్ రోడ్డు శిరివార గ్రామ సమీపంలోని శ్రీ అమరేశ్వర దేవస్థానం ఆవరణంలో 9 జంటలకు వివాహం జరిపించారు. తాళి, పెళ్లి దుస్తులు అందజేశారు.

రైతు సమస్యలపై ఆందోళన విరమించం

రాయచూరు రూరల్: రైతులు సమస్యలపై సర్కార్ స్పందించే వరకు ఆందోళన విరమించమని రైతు పోరాట సమితి నేతలు హెచ్చరించారు. ఆదివారం జేసీఐ భవనంలో ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో గౌరవాధ్యక్షుడు చామరస మాలి పాటిల్ మాట్లాడారు. బీమా పథకంలో రైతులకు అన్యాయం జరిగిందని, పత్తి పంటకు నష్టపరిహారం, విక్రయించిన జొన్నకు నేటికి డబ్బులివ్వలేదని, కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. పత్తి, మిరప, వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయన్నారు.


మాట్లాడుతున్న పాటిల్

వేడుకగా పత్రికా దినోత్సవం

నేటి ఆధునిక సమాజంలో మానవుడు అన్ని రంగాలలో సత్తాను చాటుతున్నారని బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విద్యాలయంలో జరిగిన పత్రికా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమావేశంలో బసప్ప గోరెబాల్, హాజీ, ఇమ్తియాజ్, చంద్రు, దత్తు, వీరేష్, వినయ్‌కుమార్, మునిరెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి భూములకు నీరందాలి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు నీరు విడుదల చేస్తున్న తరుణంలో నీటి నిర్వహణ చేపట్టాలని చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సిరవార 92,103వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలని ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. మంత్రి వెంట ఎస్ఈ సత్యనారాయణ, ఇంజనీర్లు బసవనగౌడ పాటిల్, గోడేకర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజ్

ఆస్పత్రి నిర్మాణానికి పూజ

సిరవార తాలూకా కవితాళ, బాగలవాడలలో రూ.50 లక్షలతో నిర్మించే ఆయుష్ ఆస్పత్రి నిర్మాణాలకు చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హంపయ్య నాయక్, శరణయ్య, సూగుప్ప, బ్రిజేష్ పాటిల్, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించండి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర

సాక్షి,బళ్లారి: నగరంలో కలుషిత నీరు సరఫరా కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగర శివార్లలోని సంగనకల్లు సమీపంలోని శుద్ధమంచినీటి ప్లాంటును పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నీటి సమస్య తలెత్తకుండా గట్టిచర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంతో మంచిదని, ఆ నీటిని శుద్ధీకరణ చేసి సరఫరా చేయడంతో మంచినీరుగా మారుతుందన్నారు. నీటి సమస్య రాకుండా ఉండేందుకు నిధులు కొరత లేదని, ఎక్కడైన సమస్య వస్తే వెంటనే మరమ్మతులు చేసి నీటి సరఫరా చేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఆయన వెంట జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, పాలికె కమిషనర్ ఖలీల్‌సాబ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.


మంచినీటి ప్లాంటును పరిశీలిస్తున్న మంత్రి నాగేంద్ర

కావేరి మాతా మమ్ములను వదలి వెళ్లొద్దు


కావేరి మాత విగ్రహానికి పూజలు


బెంగళూరు-మైసూరు రహదారిపై ధర్నా

మండ్య: కావేరి జలాలను తమిళనాడుకు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఒక్కోచోట ఒక్కో విధంగా వినూత్నంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని సర్ ఎంవీ విగ్రహం ఎదుట జిల్లా రైతు హితరక్షణ సమితి చేపట్టిన ఆందోళన ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. బీజేపీ, కన్నడసేన, కర్ణాటక రక్షణ వేదిక, కర్ణాటక జనసైన్య, కరవే గజసేన, కన్నడ రక్షణ సేన తదితర సంఘాలు మద్దతు తెలిపాయి. అంతకుముందు ఫ్యాక్టరీ సర్కిల్ నుంచి జేసీ సర్కిల్ వరకు బెంగళూరు-మైసూరు జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. తమిళనాడుకు నీటి విడుదల చేయొద్దని డిమాండ్ చేశారు. ఆదేవిధంగా బీజేపీ కార్యకర్తలు నగరంలోని కావేరి జలవనరుల నిగమ కార్యాలయం ఎదుటకు చేరుకుని కావేరి మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. 'కావేరి తల్లి మమ్మల్ని వదిలి వెళ్లొద్దు' అంటూ వినూత్నంగా ఆందోళన సాగించారు.

శోభాయమానంగా ఆరాధనోత్సవాలు


బృందావనానికి అలంకరణ


మహిళల కోలాట ప్రదర్శన

హొసపేట: నగరంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం ఉత్తరారాధన సందర్భంగా బృందావనానికి అష్టోత్తర, వాయుస్తుతి పారాయణం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కనకాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

8న రైతు మోర్చా ధర్నాలు

యశవంతపుర: రైతులకు బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలను కొనసాగించటంతో పాటు వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్‌ను సక్రమంగా అందించాలని డిమాండ్ చేస్తూ రైతు మోర్చా ఉద్యమబాట పట్టనుంది. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో టీపీ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించిన్నట్లు రాజ్యసభ సభ్యుడు, రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఈరణ్ణ కడాడి తెలిపారు. ఆదివారం అయన బెళగావిలో విలేకర్లుతో మాట్లాడారు.

తొలగింపులు ఆపండి

కోలారు: జిల్లాలోని శ్రీనివాసపురం తాలూకాలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్న రైతుల భూములను ఆక్రమణల నెపంతో స్వాధీన ప్రక్రియను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాంధీనగర నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటవీశాఖ స్వాధీనం చేసుకున్న భూములకు రైతులు తాలూకా భూ మంజూరాతి సమితి నుంచి చట్టబద్ధంగా సాగుపట్టా లభించింది. ఈ భూములను పలు సంవత్సరాలుగా వీరు సాగు చేసుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు రైతులను వీధి పాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అటవీశాఖ అధికారులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు టిఎం వెంకటేష్, పిఆర్ సూర్యనారాయణ, ఎం విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లతో పోలీసులు

కెజీఎఫ్: ట్రాక్టర్లను దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరిని కామసముద్రం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులనుంచి 2 ట్రాక్టర్లు, 5 ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కెజీఎఫ్‌కు చెందిన మునిరాం, ఆనంద రెడ్డిగా గుర్తించారు. కామసముద్రం సీఐ నారాయణస్వామి నేతృత్వంలో కార్యాచరణ చేసిన నిందితులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, ట్రాలీల విలువ రూ. 9.7 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

దొడ్డబళ్లాపురం: మేకపై లైంగిక దాడికి పాల్పడ్డ ఆటో డ్రైవర్‌పై చెన్నపట్టణ పోలీసులు కేసు నమోదు చేసారు. చెన్నపట్టణ పరిధిలోని ఇందిరా నగర్ నివాసి జమీర్ ఖాన్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ఒక మేకను తోలుకుని వెళ్తుండగా అనుమానం వచ్చిన స్థానికుడు అనుసరించాడు. జమీర్ ఖాన్ కొత్తగా నిర్మిస్తున్న కట్టడంలోకి మేకను తీసికెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దృశ్యాలను మొబైల్‌తో వీడియో తీసి పోలీసులకు అందజేశాడు.

వైభవంగా ధర్మరాయ స్వామి జయంతి

మాలూరు: పట్టణంలోని ధర్మరాయస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీద్రౌపది దేవి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో వహ్నికుల క్షత్రియ సంఘం, శ్రీధర్మరాయస్వామి దేవాలయ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ గాజులు పూలను అమ్మవారికి సమర్పించారు. పూజల్లో ఎంపీ మునిస్వామి, హూడి విజయకుమార్, ధర్మరాయస్వామి దేవాలయ సమితి అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి ప్రత్యేక అలంకరణ

కోలారు వార్తలు...

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

శ్రీనివాసపురం: ఒక్కలిగ సముదాయం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదిచుంచనగిరి మహాసంస్థాన పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మాలానంద స్వామిజీ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో తాలూకా వక్కలిగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నాడప్రభు కెంపేగౌడ జయంతి ఉత్సవంలో పాల్గొని మాట్లాడారు. నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టి కన్నడ నాడు అభ్యుదయానికి కారణమైందన్నారు. ప్రముఖంగా బెంగళూరు నగర పెరుగుదలకు కెంపేగౌడ తనదైన సేవలు అందించారన్నారు. కోలారు తాలూకాలోని సీతి కొండపై 5 వేల మంది విద్యార్థులకు ఉచిత విద్యాభ్యాసం అందించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాలూకాలో ఏటా మామిడి రైతులు ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. మామిడి సంరక్షణా యూనిట్ ఏర్పాటు చేసేలా ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తేవాలన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి మాట్లాడుతూ... కెంపేగౌడ ఆదర్శ పాలన నేడు రాష్ట్రానికి ఎంతో అవసరముందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సాధకులను సన్మానించారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి, ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి జీఎన్ రమేష్, డి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

నిరక్షరాస్యతను నిర్మూలించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలనకు పాటుపడాలని వైద్యకీయ శాఖ మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ అన్నారు. శనివారం రాత్రి దేవసూగురులో విద్యాశాఖ, సాక్షరత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని అన్నారు. కార్యక్రమంలో మంత్రి శరణు బసప్ప, ఎమ్మెల్యేలు బసనగౌడ, హంపనగౌడ, శరణేగౌడ, జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

సేవా భావంతో పనిచేయాలి


నౌకర్లకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: అక్షర దాసోహ పథకం నౌకర్లు సేవా మనోభావంతో విధులు నిర్వహించాలని అక్షర దాసోహ పథకం అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణి అన్నారు. ఆదివారం తాలూకాలోని సుగటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అక్షర దాసోహ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. వంటలు తయారు చేసే సమయంలో శుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. సీగేహళ్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేష్ సుగటూరు క్లస్టర్‌లో పని చేస్తున్న 40 మంది అక్షర దాసోహ నౌకర్లకు దుస్తులు అందించారు. ధర్మేష్ తన వేతనంలో ప్రతినెలా రూ. 10 వేలు పొదుపు చేసి దానిని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తుండడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు భైరేగౌడ మాట్లాడుతూ... విద్యార్థులు దాతలు అందిస్తున్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకటరాం, దాని ఎస్ఆర్ ధర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా కారంజిలో విద్యార్థుల ప్రతిభ


అందుకున్న సర్టిఫికెట్‌లతో విద్యార్థులు

కోలారు: తాలూకాలోని అరాభికొత్తనూరు క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజి పోటీలలో మడేరహళ్లిలో ఉన్న అర్క ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ సాధన చేశారు. పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాలలో నిర్వహించిన అంశాలలో 9 ప్రథమ, 9 ద్వితీయ, 6 తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, పాలనాధికారి జెన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎల్ కీర్తిలు అభినందించారు.

విద్యావంతులుగా ఎదగండి

కోలారు: ప్రభుత్వం అందిస్తున్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని డీవైఎస్‌పీ చంద్రకళా పిలుపునిచ్చారు. ఆదివారం తాలూకాలోని బెళమారనహళ్లి క్లస్టర్‌లో నిర్వహించిన ప్రతిభా కారంజి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు మధ్యాహ్న భోజనం, గుడ్డు, క్షీరభాగ్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యార్థి వేతనం అన్ని అందిస్తోంది..అయినా పాఠశాలల్లో విద్యార్థులు నమోదు తగ్గుతుండడం సరికాదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలో విద్యార్థుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రతిభావంత విద్యార్థులు ఉండి వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిభాకారంజీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోషకులు, ఉపాధ్యాయులు ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు అశ్వత్థ నారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి ఎస్ నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు టి అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో ఉత్తమ సేవలు అందించిన పలువురిని సన్మానించారు.


అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు



అనుమానాస్పదంగా తిరుగుతున్నవారిని విచారిస్తున్న పోలీసులు

శివమొగ్గ: శివమొగ్గ, భద్రావతి, సాగర నగరాల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసులు శనివారం రాత్రి తనిఖీలు, సోదాలు జరిపి అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. సుమారు 100కు పైగా కేసులను దాఖలు చేశారు. పబ్లిక్ స్థలాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆరోపణలపై 92 కేసులు, ట్రాఫిక్ నిబంధనలు, అక్రమాలకు సంబంధించి మరో 25 కేసులను పోలీసులు నమోదు చేశారు. కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఏరియా డామినేషన్ సోదాలను నిర్వహిస్తున్నారు. అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

యశవంతపుర: ఏనుగు దాడిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా అరెనూరు గ్రామంలో జరిగింది. దుర్గకిన్ని(60) అనే వృద్ధుడు అటవీ ప్రాంతంలో కాలిబాటలో వెళ్తుండగా ఏనుగు దాడి చేసి కాళ్లతో తొక్కి హతమార్చింది. అల్దూరు అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పనసతో అధిక లాభాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బి.సురేశ్ గౌడ

తుమకూరు: పనస పండ్లను వివిధ రకాలుగా వంటల్లో కూడా ఉపయోగించుకోవచ్చని ఎమ్మెల్యే బి.సురేశ్ గౌడ తెలిపారు. బెళ్లావి గ్రామంలో జరిగిన రైతు ఉత్పాదక కంపెనీ సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పనస పండుతో చిప్స్, జామ్, ఫ్రూట్‌పల్ప్, ఊరగాయ, ఐస్ క్రీమ్ తదితర వంటలకాలను చేసుకోవచ్చన్నారు. వైవిధ్యమైన వంటకాలను పనస పంటతో చేయడం ద్వారా ఉద్యోగ సృష్టితో పాటు రైతులకు అధిక లాభాలను తీసుకొచ్చిన వారమవుతామని తెలిపారు.

నవజాత శిశువు రోడ్డుపాలు

యశవంతపుర: తల్లి గర్భం నుంచి బయట పడిన గంటల్లోనే నవజాత శిశువు రోడ్డుపాలైంది. తల్లి పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన శిశువు అనాథగా మారింది. ఈ హృదయ విదారక ఘటన బెళగావి రామతీర్థనగరలో జరిగింది. ఇక్కడ నిర్మాణంలో ఉన్న భవనం పరిసరాల్లో శనివారం రాత్రి శిశువు ఏడుపు వినిపించడంతో స్థానికులు వెళ్లి పరిశీలించారు. నేలపై పడి ఉన్న మగశిశువును అక్కున చేర్చుకున్నారు. మాళమారుతీ పోలీసులు ఘటన స్థలానికి రాగా అప్పటికే శిశువు మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

48 గంటల్లో హత్యకేసు ఛేదన

- ఇద్దరు నిందితుల అరెస్ట్



పట్టుబడిన నిందితులు

యశవంతపుర: బెళగావి శివబసవనగరలో జరిగిన నాగరాజ్ గాడివడ్కర్(26) అనే యువకుడి హత్యోదంతాన్ని పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులు మహారాష్ట్రకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. కొల్హాపుర ఎల్‌సీబీ పోలీసుల సహకారంతో ప్రథమేశ్ కసబేకర్(20), ఆకాశ్ పవార్(21) అనే నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకేసును ఛేదించిన పోలీసులకు బెళగావి నగర పోలీసు కమిషనర్ ఎస్ఎన్ సిద్ధరామయ్య బహుమతులను ప్రకటించారు.

మట్టి గణపతులే వినియోగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కేవీ రాజేంద్ర

మైసూరు: గణేష్ ఉత్సవాలకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణేశ్ విగ్రహాల వినియోగం నిషేధించామని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించాలని జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర సూచించారు. గౌరీగణేశ్ పండుగ ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. పీవోపీ గణేశ్ విగ్రహాల తయారీ, విక్రయాలు కనిపిస్తే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చట్టం ప్రకారం నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

బస్ డ్రైవర్.. పురాతత్వ పరిశోధకుడు



విద్యార్థులకు శాసనాలపట్ల అవగాహన కల్పిస్తున్న ధనపాల్



వీరగల్లు, మాస్తీకల్లుల అధ్యయనంలో గురువు నరసింహన్‌తో ధనపాల్

- ధనపాల్ ద్విపాత్రాభియనం
- నాటి చరిత్రను కాపాడేందుకు కృషి

గౌరిబిదనూరు: తాలూకా మంచేనహళ్లికి చెందిన ధనపాల్ కేఎస్ ఆర్టీసీ బస్ డ్రైవర్. అయితే వింతేముంది? అనుకోవచ్చు. ఆయన పురాతత్వ నిపుణుడు కూడా. ఎంతో శ్రమ, నైపుణ్యం ఉంటే తప్ప ప్రాచీన శాసనాల లిపిని గుర్తించి ప్రపంచానికి తెలియజేయడం సాధ్యం కాదు. వేలాది ఏళ్ల కిందటి పాలకులు రాసిన శాసనాల ద్వారా నాటి సామాజిక, ఆర్థిక సహా ఎన్నో అంశాలు ఇప్పుడు ప్రజలకు అర్థమయ్యాయి. అందులో పురాతత్వ శాస్త్రవేత్తలు, నిపుణుల పాత్ర గణనీయమైనదంటారు ధనపాల్. ఇటీవల గత శనివారం ప్రధాని నరేంద్రమోదీ సైతం మన్‌కి బాత్ ప్రసంగంలో వీరి సాధనను అభినందించారు.

అధ్యయనమే పని

ధనపాల్‌కు చదువుకునే రోజుల్లోనే పాడుబడ్డ దేవాలయాలు, వీరగల్లులు, పొలాల్లో కనిపించే శిలా శాసనాల పట్ల ఆసక్తి కలిగింది. డిగ్రీ పూర్తి చేసి 1982లో బెంగుళూరు సిటీ బస్‌లో డ్రైవరుగా ఉద్యోగంలో చేరారు. సెలవులు రాగానే బెంగళూరు



బస్‌లో బెంగుళూరు చరిత్ర తెలుపుతున్న ధనపాల్

రూరల్, చిక్కబళ్లాపుర, కోలారు సహా అనేక జిల్లాల్లో పాడుబడిన దేవాలయాలు, బావులు, పొలాల్లో కనిపించే శిల్పాలు, శిలాశాసనాలు, వీరగల్లులను అధ్యయనం చేసేవారు. అవి ఏ కాలం నాటివి, ఎవరు చెక్కారు, అందులో ఏం రాసి ఉంది వంటి వివరాలను సేకరించేవారు. ఆ సమాచారాన్ని కర్ణాటక చరిత్ర అకాడమీకు తెలిపేవారు. ప్రాచీన రాజులకాలం నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితులను తెలుసుకోవడానికి శిలా శాసనాలు చాలా ఉపయోగపడుతాయని ధనపాల్ అంటారు. వీరి గురువుగారైన నరసింహన్‌తో కలిసి సెలవు రోజుల్లో విస్తృతంగా తిరుగుతూ ప్రాచీన శాసనాలను అధ్యయనం చేసేవాడినని చెప్పారు. చరిత్ర పట్ల ఆయన ఆసక్తిని పసిగట్టిన బీఎంటీసీ అధికారులు 2006 నుంచి ధనపాల్‌ను బెంగుళూరు దర్శిని అనే టూరిస్టు బస్‌కు గైడ్‌గా నియమించారు. ఆయన విద్యార్థులకు కూడా ఇందులో మెళకువలను బోధిస్తుంటారు.

తెలుగు-కన్నడ-తమిళ మిశ్రమ భాషలు

తెలుగు, కన్నడ, తమిళభాషల శాసనాలతో పాటు కన్నడ- తెలుగు మిశ్రమ భాష, ఈ మూడు భాషలు కలిసి ఉండే శాసనాలు సైతం కనిపెట్టినట్లు తెలిపారు. శాసనాలపై ఉన్న లిపిని చదవడం అంత సులభం కాదు. మొదట దానిపై గోధుమ పిండిని పూసి అక్షరాలు బాగా కనిపించేలా చేస్తారు. లేక ఎస్టాంపేజ్ అనబడే ప్రక్రియలో శాసనంపై ఎస్టాం పేపరును వేసి దానిపై నల్లటి సిరాను పోసి అక్షరాలను స్పష్టంగా చేస్తారు. ధనపాల్ సాధనకు అనేక సంస్థలు అవార్డులతో సన్మానించాయి. ప్రాచీన శిలా శాసనాలు సంపద వంటివని, వాటిని పనికిరాని వాటిగా భావించి ధ్వంసం చేయవద్దని చెబుతారు. సంరక్షించి భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

ఉక్కు కర్మాగారం పునః ప్రారంభంపై 6న సమీక్ష

శివమొగ్గ: భద్రావతి రెండు కళ్లుగా పిలిచే కేంద్ర ప్రభుత్వ వీఐఎస్ఎల్ (విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ఫ్యాక్టరీ), రాష్ట్రప్రభుత్వ ఎంపీఎం (మైసూరు పేపర్‌మిల్స్ లిమిటెడ్)కు మళ్లీ పునరుజ్జీవం వచ్చేలా కనిపిస్తున్నాయి. ఆగిపోయిన వీఐఎస్ఎల్ కర్మాగారానికి ఇటీవల తిరిగి ప్రారంభించి ఉక్కు ఉత్పత్తిని ఆరంభించారు. ఇదే సమయంలో 8 ఏళ్లుగా నిలిచిపోయిన ఏపీఎం కర్మాగారాం కూడా తిరిగి ప్రారంభం కానుంది. ఈ నెల 6న ఉదయం 11.30 గంటలకు బెంగళూరులో పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ అధ్యక్షతన ఈ కర్మాగారం ప్రారంభంపై చర్చించనున్నారు. కాగా, గతంలో నష్టాల కారణంగా ఈ ఫ్యాక్టరీని మూసేశారు. అయితే గత ఎన్నికల హామీల్లో భాగంగా ఈ వీఐఎస్ఎల్, ఎంపీఎం కర్మాగారాలను పునఃప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు భరోసా కల్పించారు.

అంబులెన్స్‌లో వెళ్లి డ్యూటీ రిపోర్టు



దేవరాజ్‌ను తీసుకొచ్చిన అంబులెన్స్

మైసూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఒక ఉద్యోగికి బదిలీ ఉత్తర్వులు రావడంతో డ్యూటీ రిపోర్టు అందజేసేందుకు అంబులెన్స్‌లో వెళ్లాడు. ఈ ఘటన మైసూరు మిని విధానసౌధలో జరిగింది. దేవరాజ్ అనే వ్యక్తి మండ్య తాలూకా కార్యాలయంలో సర్వేయరగా పని చేస్తున్నాడు. ఈయనకు మైసూరు తాలూకా కార్యాలయానికి బదిలీ అయ్యింది. అయితే ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. డ్యూటీ రిపోర్టు చేసేందుకు సమయం దగ్గర పడడంతో అంబులెన్స్‌లోనే మైసూరు వెళ్లి రిపోర్టు చేయించుకునేందుకు ఏడీఎల్ చిక్కణ్ణ, సర్వేయర్ సూపరింటెండెంట్ సిద్ధయ్యను కలిశారు. అయితే అనారోగ్య పరిస్థితుల్లో డ్యూటీలో చేరేందుకు వారు అంగీకరించలేదు. దీంతో వచ్చిన అంబులెన్స్‌లోనే తిరిగి ఆస్పత్రికి వెళ్లిపోయాడు.

బైకిస్టు దుర్మరణం

హోసూరు: బైక్ ప్రమాదంలో ఒకరు మృతిచెందిన చెందిన ఘటన కురుబరపల్లి వద్ద జరిగింది. క్రిష్ణగిరి జిల్లా కురుబరపల్లి సమీపంలోని భీమాండపల్లికి చెందిన చంద్రశేఖర్ (25) శనివారం రాత్రి బైక్ మీద వెళ్తూ పులియంజేరి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

ఆన్‌లైన్‌లో బనశంకరీ మాత సేవలు



ప్రత్యేక అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్



బనశంకరీ దేవి ఆలయం వద్ద భక్తజన సందడి (ఫైల్)

బనశంకరి: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో బెంగళూరు నగరంలోని బనశంకరీ ఆలయం నిర్వహించే అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఈమేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలంకరణ, అర్చనలు, దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు ప్రత్యేక రోజుల్లో నిర్వహించే అన్ని సేవలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని రాష్ట్ర దేవదాయశాఖ సూచించింది. రాష్ట్రంలో ఆన్‌లైన్ ద్వారా పూర్తి స్థాయిలో ధార్మిక సేవలు అందించే తొలి ఆలయంగా శ్రీ బనశంకరీ మాత దేవస్థానం గుర్తింపు పొందనుంది. దేవదాయశాఖ పరిధిలో 33వేలకుపైగా ఆలయాలు ఉన్నాయి. ఏ, బీ కేటగిరిలోని ఆలయాల్లో కొన్నింటికి అభిషేకంతోపాటు కొన్ని సేవలను ఆన్‌లైన్‌చేశారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో బనశంకరీదేవి ఆలయంలో సేవలను ఆన్‌లైన్ చేస్తున్నారు.

సమయం ఆదా అవుతుంది

బనశంకరీ దేవి ఆలయ అధ్యక్షుడు బసవరాజు మాట్లాడుతూ అన్నిసేవలు ఆన్‌లైన్‌లోకి రానుండటంతో భక్తులకు సమయం ఆదా అవుతుందన్నారు. దర్శనం, ఇతర సేవల కోసం టికెట్లు పొందేందుకు క్యూలో గంటల కొద్దీ నిల్చోవాల్సిన అవసరం ఉండదన్నారు.

యువతి తండ్రిని హత్య చేసిన పోకిరీ

బనశంకరి: యువతి తండ్రిని ఓ పోకిరీ చాకుతో పొడిచి హత్య చేశాడు. ఈఘటన అశోకనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. అన్వర్‌పాషా (42) అనే వ్యక్తి నంజప్ప సర్కిల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. గూడ్స్ ఆటో డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 15 ఏళ్ల వయసున్న కుమార్తె ఉంది. ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తున్న జహీద్(22) అనే యువకుడు నిత్యం ఆ బాలిక వెంటపడి ప్రేమించాలని వేధించేవాడు. ఈ విషయాన్ని బాలిక తన ఇంట్లో తెలిపింది. దీంతో అన్వర్‌పాషా శనివారం రాత్రి శాంతినగర లక్ష్మీరోడ్డులో నివాసం ఉంటున్నర జహీద్ ఇంటికి వెళ్లి తన కుమార్తెను ఇబ్బంది పెట్టవద్దని మందలించాడు. పద్ధతి మార్చుకోవాలని బుద్ధి చెప్పాడు. దీంతో కోపగించుకున్న జహీద్ ఇంట్లో నుంచి చాకు తీసుకువచ్చి అన్వర్‌పాషా గొంతుపై దాడిచేశాడు. అన్వర్‌పాషాను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అశోకనగర పోలీసులు కేసు నమోదు చేపట్టి జహీద్ కోసం గాలింపు చేపట్టారు.

సంతాన 'వైఫల్య చికిత్స'?

- ఆపరేషన్ చేస్తుండగా మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని పోలీసులకు ఫిర్యాదు



మృతురాలు మానస

తుమకూరు: ఆపరేషన్ చేయించుకునేందుకు వచ్చిన ఒక మహిళ హఠాత్తుగా మరణించగా వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదేళ్ల క్రితం అరుణ్ అనే వ్యక్తితో మానస (30)కు వివాహం జరిగింది. ఆమె తుమకూరులోని విశ్వవిద్యాలయంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సంతానం కలగకపోవడంతో మానస తుమకూరు మహాలక్ష్మినగరలో చిన్మయ నర్సింగ్ హోంలోని ఫెర్టిలిటీ సెంటర్‌లో నెలన్నర రోజులుగా చికిత్స పొందుతోంది. గర్భాశయంలో 3 గ్రాముల గడ్డ ఉందని, దాన్ని ఆపరేషన్ చేసి తీయాలని డాక్టర్లు చెప్పినట్లు సమాచారం. అందులో భాగంగానే ఈనెల 1న ఆపరేషన్ చేయించేందుకు ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2వ తేదీన బెంగళూరుకు చెందిన డాక్టర్ శశికళ ఆపరేషన్ చేస్తుండగా మానస మృతి చెందింది. మానస చావుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తుమకూరు కొత్తలేఔట్ పోలీసు స్టేషన్‌లో మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

శనేశ్వరస్వామికి లక్ష దీపోత్సవం

గౌరిబిదనూరు: శ్రావణమాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బీహెచ్ రస్తాలో ఉన్న శనేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త సూరణ్ణ, నవీన్ తదితరులు దీపాలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 108 లీటర్ల పాలతో స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాత్రి ప్రాకారోత్సవం,సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ధర్మకర్తలు సూర్యనారాయణగుప్త, అశ్వత్థనారాయణశెట్టి కుటుంబ సభ్యులు, అర్చకులు రాఘవేంద్రరావ్, శ్రీనివాస్, శ్రీహరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న నవీన్, సూరణ్ణ

విష్ణు సహస్రనామం పారాయణం చేయాలి





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, హాజరైన భక్తులు

మైసూరు: కలియుగ కష్టాల కడలి నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ విష్ణు సహస్రనామం పారాయణం చేయాలని అవధూత దత్త పీఠాధ్యక్షుడు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి తెలిపారు. ఆదివారం మైసూరులోని దత్తపీఠంలో ఉన్న నాద మంటపంలో మైసూరు నగర, జిల్లా బ్రాహ్మణ సంఘం, కోటి విష్ణు సహస్రనామ పారాయణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 కోట్ల విష్ణు సహస్రనామ సమర్పణ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

ఫ్యాక్టరీలో నగదు చోరీ

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో రూ. 11 లక్షల నగదు మాయమైంది. వివరాలు.. సూళగిరి దగ్గర పిల్‌లెక్కొత్తూరు గ్రామ సమీపంలో గ్రానైట్ పరిశ్రమలో వినియోగించే బ్లేడ్ల తయారీ కర్మాగారాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి కార్మికులు విధులు ముగించుకొని ఇంటికెళ్లారు. ఆదివారం ఉదయం పరిశ్రమకెళ్లిన కార్మికులకు కార్యాలయ కిటికీ అద్దాలు పగులగొట్టిన దృశ్యం కంటబడింది. వెంటనే విషయాన్ని పరిశ్రమ యజమానికి, సూళగిరి పోలీసులకు తెలిపారు. వారు చేరుకుని పరిశీలించగా ఆఫీసులో ఉంచిన రూ. 11 లక్షల నగదును దోచుకెళ్లినట్లు తెలిసింది. కేసు నమోదు చేశారు.

కలప డిపో ఆహుతి



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

హోసూరు: హోసూరు సమీపంలో నిర్వహిస్తున్న ఓ సామిల్‌లో ఆకస్మాత్తుగా మంటలు రేగి కలప, యంత్రాలు కాలిపోయాయి. శానసంద్రం ప్రాంతానికి చెందిన సుబ్రమణి హోసూరు సమీపంలోని ఉళియాళం వద్ద కలప డిపో నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి అందులో పొగ, మంటలు చెలరేగాయి, గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలార్పారు. ఈ ఘటనలో సామిల్లోని యంత్రాలు, విలువైన కలప పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. వీటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని యజమాని హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వలస కూలీ మృతి

హోసూరు: వలస కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్ లఖన్ కొడుకు అంకిత్ (22) హోసూరు పారిశ్రామిక వాడ దర్గా సమీపంలోని క్రిష్ణానగర్‌లో సోదరి కిరణ్ ఇంట్లో ఉంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఆకస్మికంగా చనిపోయాడు, సోదరి ఫిర్యాదు మేరకు సిప్‌కాట్ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

తస్తీక్ భత్యం నిధులు విడుదల

శివాజీనగర: దేవదాయ శాఖ అర్చకులకు ఇచ్చే తస్తీక్ భత్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.77 కోట్ల నిధులు విడుదల చేసింది. తస్తీక్ భత్యం అందక అర్చకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అర్చకులు రాష్ట్ర రవాణా, దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన సీఎం సిద్దరామయ్యతో చర్చించి తొలి విడత గ్రాంట్‌గా రూ.77.85 కోట్లు విడుదల చేయించినట్లు ధార్మిక దత్తి శాఖ కమిషనర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

గజ దాడుల్లో పంటపొలాలు ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమాటా తోట



దిగాలుగా బాధిత రైతులు

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో శనివారం రాత్రి ఏనుగుల మంద పంటపొలాలపై దాడి చేసి బీభత్సం చేసింది. వివరాల్లోకెళితే డెంకణీకోటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగులు రాత్రి వేళల్లో అటవీ ప్రాంత గ్రామాల్లోకి, పొలాల్లోకి చొరబడుతున్నాయి. లింగధీరనపపల్లి వద్ద ఏనుగులు చొరబడి రైతులు చంద్రప్పకు చెందిన 2.5 ఎకరాల టమాటా పంట, పొలంలో ఏర్పాటు చేసిన షెడ్, రైతు పశుపతికి చెందిన ఎకరా టమాటా, శరత్‌కు చెందిన ఎకరా టమాటా, కొబ్బరి, రవికి చెందిన దోసపంటలను తిని, తొక్కి పాడు చేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకెళ్లిన రైతులు పొలాలను చూసి గొల్లుమన్నారు. చంద్రప్ప పొలంలో 50 క్రేట్లలో నింపిన టమాటాలు నేలపాలయ్యాయి. అందరికీ కలిపి లక్షలాది రూపాయల నష్టం సంభవించిందని వాపోయారు. అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పరిహారం అందజేయాలని బాధిత రైతులు అటవీశాఖాధికార్లను కోరారు.

చెరువు రక్షణకు సీఎం ఆదేశాలు

మైసూరు: వేలాది చేపలు మరణిస్తున్న మైసూరు లింగాబుది పాళ్య చెరువు సంరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లాధికారిని సీఎం సిద్ధరామయ్య ఆదేశించారు. చెరువులోకి ఘణ వ్యర్థాలు, మురుగు నీరు వచ్చి చేరుతుండడంతో నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. దీంతో చేపలు, పక్షులు తదితర జలచరాలు చనిపోతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వీరి మనవిపై స్పందించిన సీఎం చర్యలు తీసుకోవాలని జిల్లాధికారిని ఆదేశించారు.



చెరువులో మృత్యువాత పడిన చేపలు

పచ్చని చెట్లు కనుమరుగు





రోడ్ల పక్కన చెట్లను నరికి లారీలో తరలిస్తున్న దృశ్యం

- హోసూరులో విచ్చలవిడిగా నరికివేత

హోసూరు: రోడ్ల పక్కన వందల నాటి చెట్ల అదృశ్యంపై సామాజిక సేవాకర్తలు హోసూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపుకు రహదార్ల శాఖ, అటవీశాఖ వద్ద కాంట్రాక్టర్లు అనుమతి పొందారు. హోసూరు నుంచి బైరమంగలం వరకు రోడ్డు పక్కన ఉన్న 214 చెట్లను తొలగించేందుకు అనుమతి ఇచ్చారు. ఇదే అదనుగా కొందరు ఇష్టానుసారం చెట్లను కొట్టి తరలిస్తున్నారు. వంద ఏళ్లు దాటిన వందకు పైగా చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నరికి వేశారని, దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామాజిక సేవాకర్తలు మునీశ్వరన్, వెంకటేష్, మునిరాజ్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి.. కత్తితో పొడిచి

- ప్రేమించిన యువతి దూరం పెట్టిందని ప్రేమోన్మాది ఘాతుకం

నాగోలు: ప్రేమించిన యువతి మాట్లాడటం మానేసిందని... ఓ యువకుడు ప్రేమోన్మాదిగా మారాడు. ఆమెపై దాడి చేసేందుకు కత్తితో ఇంట్లోకి చొరపడ్డాడు. అడ్డువచ్చిన ఆమె తమ్ముడిని తొలుత పొడవడంతో అతను తీవ్ర గాయాలపాలై మృతి చెందగా అతని సోదరి స్వల్ప గాయాలపాలైంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలానికి చెందిన సురేందర్‌గౌడ్, ఇందిరకు కూతరు సంఘవి, పృథ్వీ(చింటూ) (23), రోహిత్ సంతానం. వారిలో సంఘవి, పృథ్వీ రెండేళ్ల క్రితం హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. పృథ్వీ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా సంఘవి రామంతపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతోంది. షాద్‌నగర్ ప్రాంతంలోని షారుక్‌నగర్ మండలం నేరళ్ల చెరువుకు చెందిన శివకుమార్ (26) సంఘవికి పదవ తరగతి నుంచి క్లాస్‌మెంట్. ఇద్దరూ అప్పటి నుంచి ప్రేమలో ఉన్నారు. హోమియోపతి కోర్సు చదువుతున్న సంఘవిని తరుచూ కలిసేందుకు వీలుగా శివకుమార్ రామంతాపూర్‌లోనే నివాసం ఉంటూ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. సంఘవి, శివకుమార్ మధ్య ఇటీవల చిన్నపాటి గొడవలు చోటుచేసుకోవడంతో ఆమె అతన్ని దూరంపెట్టింది. అతని ఫోన్ నంబర్‌ను సైతం బ్లాక్ లిస్టులో పెట్టింది. దీంతో కోపోద్రిక్తుడైన శివకుమార్ ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై సంఘవి రూమ్ వద్దకు కత్తితో వచ్చాడు. తనను మోసం చేశావంటూ కేకలు వేస్తూ లోపలకు చొరబడి సంఘవిపై కత్తితో దాడి చేసే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న పృథ్వీ శివకుమార్‌ను అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతనిపై కత్తితో దాడి చేశాడు. కత్తిపోటు బలంగా దిగడంతో పృథ్వీకి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అతను ఇంటి నుంచి బయటకు కొంత దూరం నడుచుకుంటూ వచ్చి రోడ్డుపై పడిపోయాడు. మరోవైపు శివకుమార్ సంఘవిని గదిలో బంధించి లోపల నుంచి గడియ పెట్టాడు. గదిలోంచి పెద్దగా కేకలు వినపడటం, పృథ్వీ నెత్తురోడుతూ బయటకు వచ్చి పడిపోవడంతో ఇరుగుపొరుగు మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని కర్రలతో గది తలుపు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. శివకుమార్‌ను చితకబాది పోలీసులకు అప్పచెప్పారు. రోడ్డుపై పడిపోయిన పృథ్వీతోపాటు స్వల్పంగా గాయపడిన సంఘవిని స్థానికులు చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్‌కు... అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పృథ్వీ మృతిచెందాడు.

రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌లో 99.6 శాతం సరఫరా

- లోటు 0.4 శాతం మాత్రమే
- స్థానికంగా ఏర్పడే అవాంతరాలతోనే ఈ లోటు
- పొరుగునున్న దక్షిణాది రాష్ట్రాల్లోనూ కొరత
- 2022–23 ఆర్థిక సంవత్సరం విద్యుత్ సరఫరాపై డిస్కంలు



సాక్షి, అమరావతి: దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ కొరత ఏపీలోనే అధికంగా ఉందనడంలో వాస్తవం లేదని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్‌ఎల్‌డీసీ), డిస్కంలు స్పష్టం చేశాయి. 'దక్షిణాదిలో ఏపీలోనే విద్యుత్ కొరత అధికం' శీర్షికతో ఆదివారం ఈనాడు ప్రచురించిన కథనాన్ని ఎస్‌ఎల్‌డీసీ, డిస్కంలు ఖండించాయి. 20 సూత్రాల అమలు కార్యక్రమంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన 2022–23 ఆర్థిక సంవత్సరం విద్యుత్ సరఫరా గణాంకాలను ఉటంకిస్తూ ఈనాడు వార్తా కథనం ప్రచురించింది. అయితే గత ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని, 0.04 శాతం మాత్రమే సరఫరాలో లోటు ఉందని, ఇది కూడా స్థానికంగా ఏర్పడిన సాంకేతిక ఇబ్బందుల వల్లేనని డిస్కంలు పేర్కొన్నాయి. ఎస్‌ఎల్‌డీసీ, డిస్కంలు ఏం చెప్పాయంటే..

ఏపీలో వాస్తవ కొరత 0.4 శాతమే

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం విద్యుత్ సరఫరాలో ఝార్ఖండ్ రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది. 2022–23 సంవత్సరంలో 20 సూత్రాల అమలు పథకంపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విద్యుత్ డిమాండ్–సరఫరా గణాంకాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఝార్ఖండ్ రాష్ట్రం మొత్తం విద్యుత్ డిమాండ్‌లో 93 శాతం మాత్రమే విద్యుత్ సరఫరా చేయగలిగింది. నాగాలాండ్ డిమాండ్‌లో 94 శాతం సరఫరా చేసింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో మొత్తం ఏడాదిలో 915 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా.. 892 మిలియన్ యూనిట్లు సరఫరా చేసింది. 24 మిలియన్ యూనిట్ల లోటు ఏర్పడింది. దీంతో ఆ రాష్ట్రం 98 శాతం విద్యుత్ సరఫరా చేసినట్టు కేంద్ర ప్రభుత్వం వార్షిక నివేదికలో పేర్కొంది. రాజస్థాన్‌లో గత ఆర్థిక సంవత్సరం 1,01,801 మిలియన్ యూనిట్ల డిమాండ్‌కు గాను.. 1,00,057 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసింది. అంటే 1,745 మిలియన్ యూనిట్ల సరఫరా లోటు ఏర్పడింది. మొత్తమ్మీద చూస్తే రాజస్థాన్ డిమాండ్‌లో 98 శాతం విద్యుత్ సరఫరా చేసింది. బీహార్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు కూడా మొత్తం వార్షిక విద్యుత్ డిమాండ్‌లో 98 శాతం మేరకు సరఫరా చేశాయి. కేంద్ర గణాంకాల ప్రకారం తెలంగాణలో 0.04 శాతం, కర్ణాటకలో 0.03 శాతం విద్యుత్ కొరత ఉంది. ఏపీలో కూడా వాస్తవ కొరత 0.4 శాతం మాత్రమే. విద్యుత్ డిమాండ్‌లో తెలంగాణ 99.96 శాతం, కర్ణాటక 99.97 శాతం, తమిళనాడు 99.93 శాతం, ఆంధ్రప్రదేశ్ 99.56 శాతం విద్యుత్ సరఫరా చేశాయి.

కేంద్ర ప్రభుత్వం నివేదిక ప్రకారం విద్యుత్ సరఫరా, డిమాండ్, లోటు (మిలియన్ యూనిట్లలో..

రాష్ట్రం	డిమాండ్	సరఫరా	లోటు	లోటు శాతం					
ఝార్ఖండ్	13,278	12,288	990	93	కర్ణాటక	75,688	75,663	26	100
నాగాలాండ్	926	873	54	94	కేరళ	27,747	27,726	21	100
అరుణాచల్‌ప్రదేశ్	915	892	24	97	మధ్యప్రదేశ్	92,326	91,969	358	100
రాజస్థాన్	1,01,801	1,00,057	1,745	98	మహారాష్ట్ర	1,86,573	1,86,461	111	100
బిహార్	39,545	38,762	783	98	మణిపూర్	1,014	1,014	0	100
ఉత్తరాఖండ్	15,647	15,386	261	98	మేఘాలయ	2,237	2,237	0	100
ఉత్తరప్రదేశ్	1,44,251	1,43,050	1,201	98	మిజోరాం	645	645	0	100
హరియాణ	61,451	60,945	506	99	ఒడిశా	42,631	42,584	47	100
హిమాచల్‌ప్రదేశ్	12,649	12,442	107	99	పాండిచ్చేరి	3,051	3,050	1	100
అస్సాం	11,465	11,465	0	100	పంజాబ్	69,522	69,220	302	100
ఛత్తీస్‌గఢ్	39,051	38,979	72	100	సిక్కిం	587	587	0	100
ఢిల్లీ	35,143	35,133	10	100	తమిళనాడు	1,14,798	1,14,722	77	100
గోవా	4,674	4,674	0	100	తెలంగాణ	77,832	77,799	34	100
గుజరాత్	1,37,960	1,37,916	44	100	త్రిపుర	1,547	1,547	0	100
					పశ్చిమ బెంగాల్	60,348	60,274	74	100

పరిశ్రమలకు వారానికి ఒకరోజు పవర్ హాలిడే

- రేపటి నుంచి 15వ తేదీ వరకు వారంలో ఒకరోజు
- విద్యుత్ అవాంతరాలను నివారించేందుకు చర్యలు
- వైద్య సంబంధిత పరిశ్రమలకు, రైస్ మిల్లులకు మినహాయింపు
- డిస్కంల విజ్ఞప్తితో విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి

సాక్షి, అమరావతి: గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమలకు పవర్ హాలిడే అమలుకు అనుమతించాలని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసిన విజ్ఞప్తికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) అంగీకారం తెలిపింది. రేపటి (ఈ నెల 5వ తేదీ) నుంచి 15వ తేదీ వరకు షరతులతో కూడిన పవర్ హాలిడేకి అనుమతిస్తూ ఆదివారం ఆదేశాలు జారీచేసింది. ఏపీఈఆర్సీ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్ధనరెడ్డి, కె.సంతోషరావు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం..

గృహ, పారిశ్రామిక రంగాలతోపాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా ఉంటోంది. రాష్ట్రంలో రోజువారీ అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉంది. థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఇంకా 40 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. తక్కువ వర్షపాతం కారణంగా వ్యవసాయానికి బోర్లపై ఆధారపడిన వారికి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి ప్రతిపాదనలను సమర్పించాయి. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం, వాటి ప్రస్తుత ధరలను పరిశీలించిన కమిషన్.. రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించింది. ఇందులో భాగంగా డిస్కంల పరిధిలోని పరిశ్రమలకు వారానికి ఒకరోజు పవర్ హాలిడే అమలు చేయనున్నారు. విధిలేని పరిస్థితుల్లో మాత్రమే పవర్ హాలిడే అమలు చేస్తున్నామని, విద్యుత్ లభ్యత మెరుగైతే పవర్ హాలిడే ఎత్తివేస్తామని సీఎండీలు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్చేసి తెలియజేయవచ్చని వారు సూచించారు. .

ఇవీ నిబంధనలు

- పరిశ్రమలు ప్రస్తుతం అమలు చేస్తున్న వారానికోరోజు వారాంతపు సెలవులకు అదనంగా ఒకరోజు పవర్ హాలిడే అమలు చేయాలి.
- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాలి.
- సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదు.
- పరిశ్రమలు రోజువారీ విద్యుత్ వినియోగంలో 70 శాతం వినియోగించుకునే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలి.
- ఈ పవర్ హాలిడేని జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తారు.
- ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు వారాలు పవర్ హాలిడే అమల్లో ఉంటుంది.
- నియంత్రణ చర్యలు పాటించని పరిశ్రమలపై కమిషన్ నిర్దేశించిన జరిమానా చార్జీలు విధిస్తారు.
- ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్‌డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలకు మినహాయింపు ఉంది.
- రోజూ విద్యుత్ సరఫరా తీరును సమీక్షించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం అధికారులు తగిన నిర్ణయం తీసుకుంటారు.

ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పార్టీ ముఖ్యనేతలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జలరామకృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణపై పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండటంతోపాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. వైఎస్సార్ జిల్లా బద్వేలులో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి రాలేమన్న ఉద్దేశంతో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు నమోదుతోపాటు అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొంటూ టీడీపీ వారి ఎత్తులను తిప్పికొట్టాలన్నారు. బోగస్ ఓట్లను ఏరివేయాలని, పారదర్శకమైన ఓటర్ల జాబితాతో ఎన్నికలు జరగాలనేది వైఎస్సార్‌సీపీ సిద్ధాంతమని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, దీనిపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ విషప్రచారాలను తిప్పికొట్టాలని చెప్పారు.

తెలంగాణ

క్రైమ్ కథనాలే స్ఫూర్తి!

సాక్షి, హైదరాబాద్: మాదాపూర్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తూ తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు (టీఎస్–నాబ్) చిక్కిన 'ఫిల్మ్ ఫైనాన్షియర్'కారుమూరి వెంకట రత్నారెడ్డికి సంబంధించి మరో వ్యవహారం బయటపడింది. క్రైమ్ కథనాలే స్ఫూర్తిగా నకిలీ ఐఆర్‌ఎస్ అధికారం ఎత్తాడని పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీ కేసులో ఇతడిని కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించామని అధికారులు తెలిపారు. ఆ తర్వాతే నిందితులు ఎందరనే అంశంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. గుంటూరు నగరానికి చెందిన కె.వెంకట రత్నా రెడ్డి 2007 లో ఓ ప్రమాదంలో గాయపడ్డాడు. విశ్రాంతి సమయంలో టీవీలో క్రైం కథనాలు చూసి తానూ అలా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. కేవీఆర్ రెడ్డి పేరుతో ఐఆర్‌ఎస్ అధికారిగా పేర్కొంటూ బోగస్ గుర్తింపుకార్డు తయారు చేశాడు. కొన్ని విజిటింగ్ కార్డులు సైతం రూపొందించుకున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లోని కమిషనర్స్ ఫర్ డిపార్ట్‌మెంట్ ఎక్వయిరీస్‌లో సూపరింటెండెంట్‌గా హోదా క్రియేట్ చేసుకున్నాడు. ఐఆర్‌ఎస్ ఆఫీసర్ అని నమ్మిస్తూ ప్రాజెక్టులు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బు వసూలు చేశాడు.

పారిశ్రామిక ప్రగతి పరుగులు

- హైవే, కృష్ణపట్నం పోర్టులతో అనుకూలత
- రోడ్డు, రైలు, జలమార్గాల ద్వారా రవాణా
- వందలాది మందికి ఉపాధి అవకాశాలు

ఏ పరిశ్రమ ఏర్పాటు కావాలన్నా అనుకూల వాతావరణంతోపాటు రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో ముఖ్యం. ఇవన్నీ పుష్కలంగా ఉన్నచోట పరిశ్రమల ఏర్పాటుకు ఢోకా ఉండదు. అలాగే స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా మెండుగా దొరుకుతాయి. పై అంశాలన్నీ సమృద్ధిగా ఉన్న జిల్లాలోని మనుబోలు మండలంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది.



జీడిపప్పును ప్రాసెస్ చేసే అకాజు ప్రాసెసింగ్ (ప్ర) లిమిటెడ్



పవర్ గ్రిడ్

మనుబోలు: గత కొన్నేళ్లుగా మనుబోలు మండలంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. దీంతో స్థానికంగా ఉండే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. మండల పరిధిలో 10 కిలోమీటర్లకు పైగా విస్తరించిన జాతీయ రహదారి, 15 కిలోమీటర్ల దూరంలో కృష్ణపట్నం పోర్టు, స్థానికంగా రైల్వేస్టేషన్, 140 కిలోమీటర్ల దూరంలో చెన్నై మహానగరం ఉన్నాయి. దీంతో రోడ్డు, రైలు, జలమార్గాల ద్వారా రవాణా సౌకర్యాలకు అనువుగా ఉండడంతో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో బయట నుంచి వచ్చి చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పే వారిని మనుబోలు మండలం విశేషంగా ఆకర్షిస్తోంది.

70 శాతానికి పైగా స్థానికులే..

మనుబోలు మండల పరిధిలో పల్లవా గ్రానైట్ ఫ్యాక్టరీ, 765 కేవీ, 400 కేవీ పవర్ గ్రిడ్స్, ట్రాన్స్‌కో 400 కేవీ సబ్ స్టేషన్, జీడిపప్పు ఫ్యాక్టరీ, ఎస్‌వీఎస్ మినరల్స్, అట్టపెట్టెలు తయారు చేసే ఫ్యాక్టరీ, మెక్ డొనాల్డ్స్ ఫ్రాంఛైజీ ఉన్నాయి. అలాగే హైవేకు ఇరువైపులా 5 పెట్రోల్ బంకులు, 4 దాబా హోటళ్లు ఉన్నాయి. వీటన్నింటిలో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. పవర్ గ్రిడ్ మినహా మిగిలిన పరిశ్రమల్లో 70 శాతానికి పైగా స్థానికులే పనిచేస్తున్నారు. వీటితోపాటు త్వరలో శ్రీచక్ర ఎకోటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెద్ద పాలిస్టర్ పరిశ్రమ, ఎ టూ బి రెస్టారెంట్స్, ఎలక్ట్రిక్ కార్ చార్జింగ్ సెంటర్, స్టార్ బక్స్‌లతోపాటు మరికొన్ని ఫ్రాంఛైజీలు మండలంలో ఏర్పాటు కానున్నాయి. తద్వారా వందలాది మందికి ఉపాధి దొరికే అవకాశం ఉంది.



ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

అనుకూల వాతావరణంతోనే..

మనుబోలు మండలంలో అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉండడంతోనే పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయని తెలుస్తోంది. రవాణా సౌకర్యాలతోపాటు పరిశ్రమలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, స్థానిక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహాయ సహకారాలు ఉండడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఎంతోమంది ముందుకొస్తున్నారని తెలుస్తోంది.

రైలు పట్టాలపై మృత్యు ఘోష

- ఈ ఏడాది 229 మంది మృతి
- 107 మంది అనాథలుగానే తనువు చాలించిన వైనం
- నెలకు సగటున 28 మందికిపైగా మృత్యువాత

ప్రమాదవశాత్తు పట్టాలు దాటే క్రమంలో కొందరు..ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కలహాలతో మరికొందరు..రైల్లో నుంచి జారిపడి ఇంకొందరు ప్రాణాలు విడుస్తున్నారు. ఇలా నిత్యం ఏదోక రూపంలో రైలు పట్టాలపై మృత్యు ఘోష వినిపిస్తోంది. రైలు ప్రమాదాల్లో గుర్తించిన మృతదేహాలు బంధువులకు చేరుతున్నా...గుర్తింపులేనివి కుటుంబ సభ్యుల కడచూపునకు నోచుకోకపోవడం విషాదకరం.



ప్రయాణికులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు(ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో 444 కిలోమీటర్ల మేర రైలు మార్గం విస్తరించి ఉంది. నిత్యం సుమారు 120 రైళ్ల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే ప్రయాణికులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం..ప్రమాదాల నివారణ చర్యల్లో రైల్వే అధికారుల ఉదాసీనత వెరసి నిత్యం ఏదోక చోట నిండు ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. రైలు ప్రమాదాల్లో ఎలాగోలా గుర్తించిన మృతదేహాలు బంధువులకు చేరుతున్నా...గుర్తింపులేనివి అనాథ శవాలుగా మిగిలిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు మాసాంతం వరకు నెల్లూరు రైల్వే సబ్‌డివిజన్ పరిధిలో రైలు పట్టాలపై జారిపడి, బలవన్మరణం, సహజ రూపాల్లో 229 మంది మృతి చెందారు. దీనిని బట్టి చూస్తే నెలకు సగటున 28 మందికిపైగా రైలు పట్టాలపై మృత్యువాత పడుతున్నారు. నెల్లూరు రైల్వే సబ్‌డివిజన్ పరిధిలోని చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు పరిధిలో చిన్న, పెద్ద రైల్వేస్టేషన్లు కలిపి 55 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతిరోజూ ఏదోక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రైలు పట్టాలు దాటుతూ, రైల్లో నుంచి జారిపడి, రైలు కిందపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య క్రమేపి పెరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు మాసాంతం వరకు రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి 107మంది మృతి చెందారు. ప్రేమ విఫలమై, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో 110 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 12 మంది అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందారు. మొత్తంగా వివిధ కారణాలతో 229 మంది మృతి చెందారు. అందులో 122 మంది వివరాలు లభ్యం కాగా వారి మృతదేహాలను రైల్వే పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగిలిన 107 మంది వివరాలు లభ్యం కాకపోవడంతో అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించారు.

కొనఊపిరితో ఉన్న కాపాడలేని పరిస్థితి

సాధారణంగా రహదారిపై జరుగుతున్న ప్రమాదాలు అందరికి కనిపిస్తుంటాయి. రోడ్డు ప్రమాదం జరిగితే ఆయ్యో అంటూ ప్రజలు పరుగులు తీసి అవసరమైన సాయం అందిస్తారు. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవ్వరికి కనిపించవు. ప్రమాదవశాత్తు కొందరు.జీవితంపై విరక్తి చెంది మరికొందరు ఇలా ఎందరో రైలు చక్రాల కింద నలిగి తనువు చాలిస్తున్నారు. రైలు పట్టాలపై జరిగే ప్రమాదాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. లోకో పైలెట్, కీమెన్‌లు, ట్రాక్‌మెన్‌లు స్టేషన్‌మాస్టర్ దృష్టికి తీసుకొస్తే ఆయన రైల్వే పోలీసులకు సమాచారం అందిస్తారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేస్తారు. లోకోపైలెట్, కీమెన్‌లు, ట్రాక్‌మెన్‌లు గుర్తించకపోతే అంతే సంగతులు. జనసంచారం కలిగిన ప్రాంతాల్లో రైలు ప్రమాదంలో తీవ్రగాయాలైన వారికి సకాలంలో వైద్యసేవలు అందించే అవకాశం ఉంది. జన సంచారం లేని ప్రాంతాల్లో తీవ్రగాయాల పాలైన వారిని కాపాడుకోలేని పరిస్థితి. కొన ఊపిరితో ఉన్నా ఎవరూ చూడక, వైద్య అందక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు.

గుర్తింపు కష్టతరం


నెలకు సగటన 28 మంది రైలు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. వారి మృతదేహాలు ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా మారుతుంటాయి. అనేక సందర్భాల్లో మృతదేహాలు రైలుపట్టాల పక్కనున్న ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల మధ్యన పడితే కొన్నిరోజుల వరకు ఎవరూ గుర్తించలేరు. అలాంటి పరిస్థితుల్లో మృతదేహాల గుర్తింపు, తరలింపు మరింత దారుణంగా ఉంటుంది. అయిన వారు సైతం మృతదేహాలను గుర్తుపట్టడం కష్టతరమే. నిబంధనల ప్రకారం గుర్తుతెలియని మృతదేహాలను 72గంటల పాటు మార్చురీలో భద్రపరచాల్సి ఉంటుంది. అప్పటికీ మృతుడి సంబంధీకులు ఎవ్వరూ రాకపోతే రైల్వే పోలీసులే దగ్గరుండి ఖననం చేయిస్తారు. సంబంధీకుల కడసారి చూపునకు కూడా నోచుకోక ఎంతోమంది అనాథలుగా కాలగర్భంలో కలిసిపోతున్నారు. అధికశాతం ప్రమాదాలకు నిర్లక్ష్యమే కారణంగా నిలుస్తోంది. కదిలే రైలు నుంచి ఎక్కడం, దిగడం, ఫుట్‌బోర్డు ప్రయాణం, అటు, ఇటు గమనించకుండా అజాగ్రత్తగా రైలుపట్టాలు దాటడం, తదితరాలు కారణాలుగా నిలుస్తున్నాయి.



ప్రమాదమని తెలిసినా పట్టాలు దాటుతున్న ప్రయాణికులు(ఫైల్)

మంచిమాట

మెట్ట వేదాంతం..?



వేదాంతం అనే మాట తెలుసు అందరికీ, అర్థం సరిగ్గా తెలిసినా లేకపోయినా. ఇంతకీ ఈ మెట్టవేదాంతం ఏమిటి? కాని, ఈ మాటని చాలామంది పెద్దవాళ్ళు వాడుతూ ఉంటారు. మాగాణి వేదాంతం మరొకటి ఉందా? దీనికీ, దానికీ తామరకి, మెట్టతామరకి మధ్య ఉన్నంత తేడా ఉంటుందా? తామర, మెట్టతామర రెండూ పూలు. అంతే వాటి సంబంధం. ఒకటి నీళ్ళలో, మరొకటి నేల మీద పెరుగుతాయి. కాని, వేదాంతానికి మెట్ట వేదాంతానికి ఉన్నది మరొక రకమైన సంబంధం.

వేదాంతం ఒక శాస్త్రం. అన్ని వేదాలు క్షుణ్ణంగా చదివిన తరువాత గురువు సమీపంలో కూర్చుని వేదాలలోని మర్మాలు తెలుసుకుంటాడు శిష్యుడు. ప్రశ్నోత్తరాల రూపంలో ఉన్న ఆ సంభాషణలని ఉపనిషత్తులు అని అంటారు. వేదాధ్యయనం అయిన తరువాత తెలుసుకునే భాగాలు కనుక వేదాంతంగా పరిగణించబడినాయి. సమస్తం భగవంతుడి స్వరూపంగా భావించ గలగటం అప్పటికి అభ్యాసం అయి ఉంటుంది. అందువల్ల వేదాంతం వంట పట్టిన వారు సామాన్య భక్తులలాగా పూజాదికాలకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వరు. నిరంతరం సర్వవ్యాపి అయిన పరబ్రహ్మతత్త్వాన్ని ధ్యానం చేస్తూ, వివేచన చేస్తూ, అనుభూతి చెందటానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు.

> **అన్నానికి సున్నానికి తేడా లేదనటం వేదాంతం. అందుకని రకరకాల అన్నాలు వేద్దామనే నిర్ణయానికి రావటం మెట్టవేదాంతం. ఈ రెండింటికి తేడా లేదని చెప్పటం దంతవేదాంతం. ఆచరణలో చూపటం అసలైన వేదాంతం. రుచికరమైన ఆహారం తినకూడదని కాదు దీని అర్థం. అది కావాలని కోరకూడదు. దొరికినది ఏది అయినా ఒకే భావనతో తినగలగాలి. అట్లాగే ఎట్లాగైనా ఉండగలగాలి. అంటే పట్టుపరుపులైనా, నేలమీదైనా ఒకే రకం గా నిద్రించటం వేదాంతి లక్షణం అయితే, రెండూ ఒకటే కనుక పట్టుపరుపులే కావాలనుకోవటం మెట్టవేదాంతం.**

అటువంటి వారు చెప్పే మాటలని పూర్తిగా అర్థం చేసుకోకుండా కేవలం ఒకటి, రెండు మాటలని పట్టుకుని తమకి అనుకూలంగా వాడుకుంటారు కొంతమంది. కొంతమంది తెలియక కూడా ఆ విధంగా చేస్తారు. అంటే వేదాంత పరిభాషని తన ప్రవర్తనని సమర్థించుకునేందుకు చేసే ప్రయత్నం అని చెప్పవచ్చు. ఇటువంటి సందర్భాలు మనకి అడుగడుగునా, కోకొల్లలుగా కనిపిస్తూ ఉంటాయి. "అన్నమైతేనేమిరా? మరి, సున్నమైతే నేమిరా?" అని అన్నానికి సున్నానికి తేడా లేదని అంతా సమానమేనని ఇంటిముందు అడుక్కునేందుకు వచ్చిన సన్న్యాసి పాడుతాడు. 'అబ్బా ఎంత వైరాగ్యం!' అని అనుకుంటూ ఉంటే ఇట్లా కొనసాగిస్తాడు – "అందుకే ఈ పాడు పొట్టకి అన్నమే వేదాము రా! పప్పన్నమే వేదాము రా! నెయ్యన్నమే వేదాముర! పెరుగన్నమే వేదాము రా!" అంటాడు.

అంతటితో ఆగడు. "చీరలైతేనేమిరా? మరి, నారలైతే నేమిరా? అందుకే ఈ పాడు ఒంటికి చీరలే కడదాముర! పట్టుచీరలే కడదామురా!" ఇట్లా కొనసాగుతూ ఉంటుంది ఆ పాట. ఇటువంటి వాటిని తత్త్వాలు అంటారు. తన శక్తి మేరకు పనిచేసి ఫలితం ఏమైనా పట్టించుకోకపోవటం వేదాంతి అయిన వాడు చేసే పని. కాని, వేదాంత ప్రసంగాలు విని, విని కొన్ని ఊతపదాలు మనకి అలవాటై పోయాయి.

"మన చేతుల్లో ఏముంది?", "ఎట్లా రాసి ఉంటే అట్లా జరుగుతుంది" అంటూ చేతులు ముడుచుకుని కూర్చునేవారు, తమ బద్ధకానికి, చేతకానితనానికి వేదాంతపు ముసుగు వేసుకున్నారు అని అర్థం చేసుకోవాలి. ఇటువంటి వారి వల్లనే మన ధర్మానికి, వేదాలకి, వేదాంతానికి చెడ్డపేరు వస్తోంది. మనం మెట్టవేదాంతులం కాకుండా ఉంటే చాలు. అటువంటి వారి నుండి దూరంగా ఉండటం మంచిది.

– డా.ఎన్. అనంతలక్ష్మి


బౌద్ధవాణి

చిత్తశుద్ధితో చిత్త ఏకాగ్రత

పూర్వం మునులు, తాపసులు, యోగులు, రుషులు, భిక్షువులు, బైరాగులు, శ్రమణులు అనే రకరకాల ముని సంప్రదాయాలు పాటించేవారు ఉండేవారు. భీషణ తాపసులు, కఠోరయోగసాధకులూ ఉండేవారు. లౌకిక సుఖాల్ని వదిలి, మోక్షమార్గం కోసం అన్వేషించే వీరందరూ తమ తమ సాధనలో లీనమైపోయేవారు.

బుద్ధుడు కూడా, శరీరాన్ని ఎండకట్టుకుని, ఆహారం మాని, ఎముకల గూడులా మారాడు. శక్తి హీనుడై నీరసించి పడిపోయాడు. మోక్షసాధనకు ఇలాంటి కఠోరసాధన సరైన మార్గం కాదని గ్రహించి, ధ్యానం అనే నూతన విధానాన్ని ఆవిష్కరించాడు. శరీరాన్ని అటు పూర్తిగా సుఖాల్లో ముంచి తేల్చకుండా, ఇటు కఠోరంగా శిక్షించి ఎండకట్టుకోకుండా ఉద్యమ మార్గంలో సాధన సాగించాడు. ఎరుకలో ఉంటూ, ఏకాగ్రతను సాధించే గొప్ప సాధన ఇది.

రకరకాలుగా సాగే సాధనల్లో ఎవరు నమ్మిన మార్గంలో వారు సాధన సాగించే వారు. ఇలాంటి సాధకులంటే కొందరికి తగని కోపం. వారి ఏకాగ్రతని చెడగొట్టాలని, మోక్షమార్గాన్ని వారికి అందకుండా చేయాలని తీవ్రంగా ప్రయత్నించే వారు. కొందరు సాధకులు ఆ ప్రలోభంలో పడి దొంగ జపాలు చేయడం మొదలుపెట్టారు. కేవలం కదలకుండా కూర్చుని కళ్ళు మూసుకుని ఉండేవారు. చిత్తాన్ని మాత్రం స్థిరంగా ఉంచేవారు కాదు. చిత్తం చంచలమై ఉంటే... దేహం, వేషం మాత్రం ధ్యానంలో ఉన్నట్లు నటించే వారు. దీనితో కొందరు... నదీతీరంలో చేపల్ని పట్టడం కోసం ఒంటి కాలి మీద కొంగలా జపం చేసేవారు. ఇంకొందరు కొమ్మమీద కదలకుండా కూర్చొని, సగం కన్నులు మూసి ఎలుక కోసం చూసే గుడ్లగూబలా ధ్యానించేవారు.



మరికొందరు... పేడపోగుల వద్ద బొమ్మలా కదలక మెదలక కూర్చుండి ఎలుకల కోసం పొంచి చూసే పిల్లుల్లా యోగసాధన నటించేవారు. ఇంకొందరు.. బరువులు దించాక చెట్టు నీడకు చేరి, కళ్ల మూసుకుని శిలాప్రతిమలా నిలబడిపోయే గాడిదలా ఉండేవారు. అలా ఉండి గౌరవాన్ని పొందుతూ ఉండేవారు. ఏ మోక్షం కోసం ఏ ఏకాగ్రత కోసం, ఏ చిత్తాన్ని మలిన రహితం చేయడం కోసం సాధన సాగించారో దాన్ని మరచేవారు. అకుశల కర్మల్ని నమ్మినివారు, వాటిని దూరంగా పెట్టిన వారు మాత్రం నిగ్రహులై నిర్మల చిత్తులై... నిర్వాణ మార్గాన్ని పొందగలిగారు.

బుద్ధుడు చెప్పిన ఈ కంటకులు ఎవరంటే... మనసులోని దోషభావాలే. తప్పుడు ఆలోచనలే అకుశల కర్మలే! వీటికి లొంగిన వారు దొంగ సాధకులై తమ సాధనని ముక్తికి మార్గంగా, వ్యాపారంగా మార్చుకుని అనైతికంగా జీవిస్తారు. ఈ విషయం గురించి భిక్షువులకు బోధిస్తూ...

"భిక్షువులారా! కోర్కెలు మనవెంట పడవు. మనమే వాటివెంట పడతాం. నేను మూర్ఖుణ్ణి దహిస్తాను. దహించాలి అని అగ్ని అనుకోదు. మూర్ఖుడే మండే అగ్నిని తాకి తనకు తాను కాల్చుకుంటాడు. కాబట్టి మీరు మీ చిత్తాన్ని మరల్చకండి. స్థిరంగా, బలంగా మార్చుకోండి. అప్పుడు దోషాలు మన దరికే చేరవు." అని చెప్పాడు. చిత్తశుద్ధితో చిత్త ఏకాగ్రత సాధించాలి అని భిక్షువులు గ్రహించారు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

కళలు వర్షించాలి

అన్నార్ధవంతు భూతాని... అసలు ప్రాణుల పుట్టుకకు, మనుగడకు అన్నం కావాలి. అన్నం దొరకాలంటే భూమికి ఆర్ద్రత ఉండాలి. ఆకాశంలో నుంచి పడిన వర్షంతో భూమి అంతా చెమ్మగిల్లి మొక్కలు పుట్టినట్లు, ఒక దేశసంస్కృతి నిలబడాలంటే కళలు.. అనే వర్షం కావాలి. కళల ద్వారా సంస్కృతి పెరుగుతుంది. సంస్కృతి పెరిగితే ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలి, నడవడిక, ఆ దేశపు కీర్తిప్రతిష్ఠలు నిర్ణయింప బడతాయి. కళలు... అంటే కవిత్వం, శిల్పం, నృత్యం, వాద్యం.. ఎప్పుడూ అవతలివారికి సంస్కృతిని కల్పించేవి అయి ఉంటాయి. ఇవన్నీ కళలు కాబట్టి ఇవి వర్షం లాంటివి. అవి సంస్కృతిని మొలకెత్తించడానికి కారణం కావాలి.


మన దేశానికి ఇన్ని కీర్తిప్రతిష్ఠలు రావడానికి కారణం ఏమిటి? భగవద్గీత పుట్టిన భూమి. రామాయణం, భారతం, భాగవతం వంటివి పుట్టిన భూమి. గంగానది ప్రవహిస్తున్న భూమి. ఒకనాడు తాళంకప్ప అవసరం తెలియని భూమి. సంస్కృత భాషలో తాళం కప్ప అన్నదానికి పదం లేదు.. ఆ అవసరం రాలేదు. కారణం – పరద్రవ్యాణి లోష్టవత్... రహదారిమీద రాయి దొరికితే నాది కాదు అని ఎలా అంటామో అలాగే నాది కానిదేదీ, పరవాడివస్తువు ఏదయినా నాకు దొరికితే నాది కాదు కాబట్టి అది నాకు రాయితో సమానమే... అన్న భావన. అదీ ఈ దేశ సంస్కృతి. ఇది ఎక్కడినుంచి వచ్చింది? రామాయణంలోనుంచి, భారతంలోంచి.. వచ్చింది. నీదికానిది నీవు కోరుకుంటే .. పతనమయిపోతావన్న హెచ్చరిక... దాని జోలికి వెళ్ళనీయదు.



కళలు ఈ దేశపు సంస్కృతిని ప్రతిబింబించేవి అయి ఉంటాయి. మీరు ఏది వింటున్నా, ఏది చూస్తున్నా, మన శ్శాంతికి కారకమైన భగవంతుని తత్త్వాన్ని ఆవిష్కరింప చేసేవిగా ఉంటాయి. ఒక నృత్యం జరుగుతోంది. 'కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభమ్ నాసాగ్రే నవ మౌక్తికమ్...' అంటూ సాగుతున్న కీర్తనకు నర్తకి అభినయిస్తుంటే నర్తకి క్రమేణా కనుమరుగై కృష్ణపరమాత్మ కనబడడం మొదలవుతుంది.

పాట అభినయంగా మీకు శ్రీకృష్ణ దర్శనం చేయించి, మీ ఉద్వేగాలను శాంతపరుస్తుంది. పాలగిన్నె కింద అగ్నిహోత్రం పెడితే పాలు పొంగుతాయి. నీళ్ళు చల్లితే పొంగు చల్లారుతుంది.

అలా మనదేశంలో ఉన్న కళలు మన భావోద్వేగాలను అణచి ప్రశాంతతను, మనశ్శాంతిని కల్పించడానికి ఉపయుక్తమయ్యాయి. అందుకే ప్రపంచ వ్యాప్తంగా కీర్తిని, ఆదరణనూ పొందాయి. ఈ కళలన్నీ శాంతిని ప్రసాదించగల దివ్యత్వాన్ని సంతరించుకున్నాయి. ఇవన్నీ కూడా వేదాలకు ఉపవేదాలయినటువంటి వాటినుండీ వచ్చాయి. సామవేదానికి గాంధర్వ వేదం ఉపవేదం. మిగిలినవి ఇతర వేదాలకు ఉపవేదాలు. వేదానాం సామవేదోస్మి... అన్నాడాయన. ఎందుకు అంతస్థాయిని పొందింది? అంటే తినడం ఒక్కటే కాదు, శరీరం పెరగడం ఒక్కటే కాదు ప్రధానం, అది ఎంత అవసరమో, మనసు సంస్కారవంతంగా తయారు కావడం కూడా అంతే ప్రధానం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా రీల్స్

నీటిలో డిష్యుం డిష్యుం



● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'దేవర'. ఈ సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. అందులో భాగంగా ఇప్పటికే తొలి షెడ్యూల్‌లో షిప్‌లో ఓ పోరాట సన్నివేశాన్ని చిత్రీకరించారు కొరటాల శివ. తాజాగా 'దేవర'లో కీలకంగా ఉండే మరో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆరంభించారని టాక్. పూర్తిగా నీటిలో సాగే ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా ఉంటుందని భోగట్టా. దాదాపు 20 రోజుల పాటు ఈ ఫైట్‌ని చిత్రీకరించనున్నారట మేకర్స్. ఈ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా వచ్చేందుకు ఎన్టీఆర్ మూడు రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారట. ఫైట్ మాస్టర్ కింగ్ సోలొమన్ ఈ సీక్వెన్స్‌ని డిజైన్ చేసినట్లు సమాచారం. ఇక ఈ చిత్రం ద్వారా నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర చేస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

నవంబర్‌లో సలార్?

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'సలార్'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకురానుంది. తొలి భాగం'సలార్: పార్ట్ 1–సీజ్‌ఫైర్' ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే గ్రాఫిక్స్ ఇంకా పూర్తి కాకపోవడంతో చిత్రం విడుదలని వాయిదా వేయాలనుకుంటున్నారని టాక్. ఈ నేపథ్యంలో క్రిస్మస్ కానుకగా డిసెంబరులో అని, సంక్రాంతి సందర్భంగా జనవరిలో రిలీజ్ చేస్తారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో అసలు 'సలార్'ను ఎప్పుడు రిలీజ్ చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం ఈ సినిమాని నవంబర్‌లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'సలార్'లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, పృథ్వీరాజ్ కీలక పాత్రలు చేశారు.



● ప్రభాస్

బాసూ రెడీయా...

'ఏం బాసూ రెడీయా.. వెల్ కమ్ టు ది వరల్డ్ ఆఫ్ మార్క్ ఆంటోని' అనే డైలాగ్స్‌తో 'మార్క్ ఆంటోని' ట్రైలర్ ఆరంభం అయింది. విశాల్ పలు షేడ్స్‌లో టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం ఇది. పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రాన్ని అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్. వినోద్ కుమార్ నిర్మించారు. ఈ నెల 15న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఆదివారం ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రానా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ – "ఈ చిత్రంలో మంచివాడిగా, విలన్‌గా, గుండుతో స్టైలిష్‌గా, తండ్రిని కాపాడుకోవాలనుకునే వ్యక్తిగా... ఇలా పలు షేడ్స్‌లో విశాల్ కనిపిస్తారు. ఓ టైమ్ మిషన్ కాకుండా ఓ ఫోన్ హీరోని గతానికి తీసుకెళ్తే తనేం చేశాడనే కథాంశంతో 'మార్క్ ఆంటోని'ని రూపొందించాం" అన్నారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సునీల్, సెల్వ రాఘవన్, రీతూ వర్మ తదితరులు కీలక పాత్రలు చేశారు.



● విశాల్

గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కి ఇదో వేదిక

"సౌత్‌లోని అన్ని చిత్రపరిశ్రమలూ కలిసి జరుపుకునే వేడుక సైమా. పదకొండేళ్లుగా నేనీ వేడుకల్లో భాగమవుతున్నాను. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కి చేరుకోవడానికి ఇదొక గొప్ప వేదిక. దుబాయ్‌లో కలుద్దాం" అన్నారు రానా. – రానా

'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2023 అవార్డ్స్ వేడుక ఈ నెల 15, 16 తేదీల్లో దుబాయ్‌లో జరగనుంది. ఈ వేడుక విశేషాలు తెలియజేయడానికి ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రానా పాల్గొన్నారు.



● శశాంక్ శ్రీవాత్సవ్, నిధి అగర్వాల్, బృందా ప్రసాద్, రానా, మీనాక్షి

"సైమా వేడుక అన్ని చిత్ర పరిశ్రమలకు ఒక రీ యూనియన్ లాంటిది" అన్నారు సైమా చైర్ పర్సన్ బృందా ప్రసాద్. "సైమా వేడుకల్లో ఇదివరకు పాల్గొన్నాను. మళ్లీ ఈ వేదిక పంచుకోవడం ఆనందంగా ఉంది" అన్నారు నిధీ అగర్వాల్. "తొలిసారి సైమా వేడుకల్లో పాల్గొనబోతున్నాను" అన్నారు మీనాక్షీ చౌదరి. ఈ సమావేశంలో శశాంక్ శ్రీవాస్తవ్ పాల్గొన్నారు.

రాజాధి రాజ.. రాజ గంభీర

'రాజాధి రాజ.. రాజ గంభీర.. రాజ మార్తాండ.. రాజ కుల తిలక.. వేట్టయ రాజు వేంచేయనున్నారు' అంటూ 'చంద్రముఖి 2' సినిమా ట్రైలర్ విడుదలైంది. రాఘవ లారెన్స్, కంగనా రనౌత్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. రజనీకాంత్ హీరోగా నటించిన 'చంద్రముఖి' (2005) సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం ఇది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన పి. వాసునే రెండో భాగాన్ని తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. తెలుగులో రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు. 'చంద్రముఖి 2' ట్రైలర్‌ని ఆదివారం విడుదల చేశారు. ట్రైలర్‌లో హారర్, థ్రిల్లింగ్, కామెడీ అంశాలను చూపించారు. ఈ చిత్రంలో వేట్టయ్ రాజుగా, మరో పాత్రలో లారెన్స్ కనిపిస్తారు. చంద్రముఖిగా కంగనా నటించారు. వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్ కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.



● రాఘవ లారెన్స్

తారంగ హిట్టవ్వాలి

– ఎంపీ దయాకర్



● సంపత్, నవీన్, దయాకర్

"తారంగ' ట్రైలర్ చూస్తుంటే బలమైన కథతో దర్శకుడు చక్కగా తీశాడనిపిస్తోంది. చిన్న సినిమాగా తెరకెక్కిన 'సారంగ' హిట్టయి, పెద్ద సినిమా అవ్వాలి" అన్నారు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్. కట్ల ఇమ్మోర్టల్, కట్ల డాండి, పూజ నాగేశ్వర్ కీలక పాత్రల్లో సంపత్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'తారంగ'. శ్రీనివాస రెడ్డి కర్రి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను పసునూరి దయాకర్, గ్లింప్స్‌ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్ యాదవ్ విడుదల చేశారు. నిర్మాత టి. రామ సత్యనారాయణ, దర్శకుడు శివ నాగు, నైజాం డిస్ట్రిబ్యూటర్ రాజేంద్ర ప్రసాద్ ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. "సస్పెన్స్ థ్రిల్లర్ లవ్‌స్టోరీగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుంది" అన్నారు సంపత్ కుమార్, శ్రీనివాస రెడ్డి కర్రి.

ఆప్యాయనురాగాలతో..



● మంజునాథ, మహేశ్, శివరామ్

పులివెందుల మహేశ్, ప్రియా పాల్ జంటగా శివరామ్ తేజ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి సిన్మా'. జి. మంజునాథ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నవంబరులో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో పీపుల్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాసుల రామకృష్ణ (శ్రీధర్), నటులు నాగమహేశ్, 'బలగం' సంజయ్ అతిథులుగా పాల్గొన్నారు. "ఇంత మంచి సినిమాను నిర్మించడానికి సహకరించినవారికి థ్యాంక్స్" అన్నారు జి. మంజునాథ రెడ్డి. "యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది" అన్నారు శివరామ్ తేజ. "తండ్రీకొడుకుల అనురాగం, బావా–మరదళ్ల ఆప్యాయతతో ఈ సినిమా ఉంటుంది" అన్నారు పులివెందుల మహేశ్.



నటుడు త్రిగుణ్ (అరుణ్ ఆదిత్) ఓ ఇంటివాడయ్యారు. నివేదితతో ఆయన ఏడడుగులు వేశారు. తమిళనాడులోని తిరుపూరులో ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు వీరి వివాహం జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వివాహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కాగా 'పీఎస్‌వీ గరుడ వేగ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, డియర్ మేఘ, కొండా, చీకటి గదిలో చితక్కొట్టుడు, ప్రేమదేశం, 24 కిస్సెస్, కథ కంచికి.. మనం ఇంటికి, తుంగభద్ర..' వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించారు త్రిగుణ్.

మధ్య తరగతి కుర్రాడి కథ

గౌతం కృష్ణ హీరోగా, శ్వేత అవస్తి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా పి. నవీన్‌కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్‌పై సెవెన్ హిల్స్ సతీష్‌కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా మూడు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పి. నవీన్ కుమార్ మాట్లాడుతూ– "ఒక స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎదిగిన మధ్య తరగతి కుర్రాడి కథతో ఈ సినిమా రూపొందుతోంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని మా సినిమా అలరిస్తుంది" అన్నారు. "త్వరలో మా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం" అన్నారు సెవెన్ హిల్స్ సతీష్ కుమార్. పోసాని కృష్ణమురళి, అనితా చౌదరి, షఫీ, ఆర్కే మామ, ఆనంద్ చక్రపాణి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.



● పోసాని కృష్ణ మురళి, గౌతం కృష్ణ, శ్వేత

ప్లాంట్ మాన్ ప్రయోగం



● ప్లాంట్ మాన్ పోస్టర్

'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి హారర్ చిత్రాలు తెరకెక్కించిన దర్శకుడు పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'ప్లాంట్ మాన్'. డీఎం యూనివర్సల్ స్టూడియోస్ స్థాపించి కె. సంతోష్‌బాబుని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు పన్నా రాయల్. "సైంటిఫిక్ కామెడీ మూవీగా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఒక కొత్త తరహా ప్రయోగంతో పూర్తి వినోద ప్రధానంగా రూపొందించాం" అన్నారు పన్నా రాయల్. ఇక ప్రస్తుతం పన్నా రాయల్ దర్శకత్వంలో రూపొందిన 'ఇంటి నెం.13' చిత్రం త్వరలో విడుదల కానుంది.



భారత్ నుంచి హర్మన్‌ప్రీత్ మాత్రమే...

ఆస్ట్రేలియాలో జరిగే మహిళల బిగ్‌బాష్ లీగ్ టి20 టోర్నీకి సంబంధించి ఆదివారం విదేశీ క్రికెటర్ల డ్రాఫ్ట్ కార్యక్రమం జరిగింది. ఇందులో మొత్తం 116 మంది విదేశీ క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా... ఎనిమిది ఫ్రాంచైజీలు 17 మందిని ఎంపిక చేసుకున్నాయి. భారత్ నుంచి 18 మంది క్రికెటర్లు తుది జాబితాలో ఉండగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మాత్రమే అవకాశం దక్కింది. మెల్‌బోర్న్ రెనెగెడ్స్ జట్టు హర్మన్‌ప్రీత్‌ను ఎంపిక చేసుకుంది. 2021-2022 సీజన్‌లో హర్మన్‌ప్రీత్ మెల్‌బోర్న్ తరఫున ఆడి 406 పరుగులు చేయడంతోపాటు 15 వికెట్లు కూడా తీసింది.

మెరిసిన హెడ్... ఆసీస్ క్లీన్‌స్వీప్

దక్షిణాఫ్రికాతో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. డర్బన్‌లో మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఐదు వికెట్లతో గెలిచింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 17.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రావిస్ హెడ్ (48 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) అదరగొట్టాడు. అంతకు ముందు దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 190 పరుగులు చేసింది.



క్వార్టర్స్‌లో ముకోవా



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 10వ ర్యాంకర్ ముకోవా 2 గంటల 34 నిమిషాల్లో 6-3, 5-7, 6-1తో జిన్‌యు వాంగ్ (చైనా)పై గెలిచింది. రెండో సీడ్ సబలెంకా (బెలారస్), మూడో సీడ్ పెగూలా (అమెరికా), ఐదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-2, 6-3, 4-6, 6-3తో ఇవాన్స్ (బ్రిటన్)పై... మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-2, 6-2, 7-6 (8/6)తో బేజ్ (అర్జెంటీనా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-4, 6-7 (5/7), 7-6 (10/6)తో జూలియన్ క్యాష్-హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) ద్వయంపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది.

వరుణుడు కరుణిస్తే!

- నేడు నేపాల్‌తో తొలిసారి భారత్ 'ఢీ'
- ఈ మ్యాచ్‌కూ వాన ముప్పు
- రద్దయినా భారత్ ముందుకు
- మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

పల్లెకెలె: ఆసియా కప్‌లో టీమిండియా నేడు క్రికెట్ కూన నేపాల్‌తో ఏకపక్ష పోటీకి సిద్ధమైంది. ఏ ఫార్మాట్‌లోనైనా నేపాల్ జట్టుతో భారత్‌కిది తొలి మ్యాచ్ కానుంది. భారత్‌లాంటి మేటి జట్టుకు ఈ మ్యాచ్ ఓ లెక్కేకాదు. అయితే ఎవరెంతగా చెలరేగుతారనేదే ఇక్కడ ఆసక్తికరం. కానీ ఇదంతా కూడా మ్యాచ్ జరిగితేనే! ఎందుకంటే వరుసగా భారత్ ఆడే ఈ రెండో మ్యాచ్‌పై కూడా వరుణ ప్రతాపం ఉంది. సోమవారం రోజు కూడా వర్షం పడే అవకాశాలే ఎక్కువని వాతావరణ కేంద్రం సమాచారమిచ్చింది. ఈ ఆసియా కప్‌కే హైలైట్‌గా నిలవాల్సిన భారత్, పాక్ మ్యాచ్ వర్షార్పణమైంది. దాయాదుల మధ్య 'ప్రి ప్రపంచకప్' హోరాహోరీని వీకెండ్‌లో ఆస్వాదించకుండా వరుణుడు అడ్డుపడ్డాడు. ఇప్పుడు భారత ఆటగాళ్లకు ధనాధన్ ప్రాక్టీస్‌ను ఇచ్చే నేపాల్‌తో మ్యాచ్‌కు ఇదే పునరావృతమైతే భారత అభిమానులకు నిరాశ తప్పదు.

బుమ్రా స్వదేశానికి...

వరుణుడు కరుణించి మ్యాచ్ జరిగితే మాత్రం భారత్ ప్రధాన బలగం బరిలోకి దిగుతుంది. టీమిండియా స్థాయికి సరిపోని ప్రత్యర్థి ఎదురవుతున్నప్పటికీ ఇన్నాళ్లు విశ్రాంతిలో ఉన్న ఆటగాళ్లు తప్పకుండా మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఆడతారు. పైగా గత మ్యాచ్‌లో రోహిత్, శుబ్‌మన్, కోహ్లిలతో కూడిన టాపార్డర్ క్లీన్‌బౌల్డయ్యింది. ఇప్పుడు ఏ చాన్స్ తీసుకోకుండా స్టార్ ఆటగాళ్లంతా నేపాల్‌తో ఆడతారని జట్టు వర్గాల ద్వారా తెలిసింది. తన భార్య సంజన ప్రసవ తేదీ దగ్గరకు రావడంతో పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా స్వదేశానికి చేరుకున్నాడు. భారత్ సూపర్-4 మ్యాచ్‌లకల్లా బుమ్రా తిరిగి లంక చేరుకుంటాడు.

రద్దయినా నష్టం లేదు

గ్రూప్ 'ఎ'లో నేపాల్‌పై గెలిచిన పాక్... భారత్‌తో మ్యాచ్ రద్దవడంతో వచ్చిన ఒక పాయింట్‌తో ఇదివరకే సూపర్-4కు అర్హత సాధించింది. పాక్ ఖాతాలో 3 పాయింట్లున్నాయి. అయితే 1 పాయింట్ మాత్రమే ఉన్న టీమిండియా లాంఛనమైన మ్యాచ్ జరిగితే గెలుస్తుంది. తదుపరి దశకు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఇదీ రద్దయినా భారత్ 2 పాయింట్లతో రెండో స్థానంతో సూపర్-4 ఎంచక్కా వెళుతుంది. దాంతో వర్షంవల్ల మ్యాచ్ జరగకపోతే టీమిండియాకు పెద్దగా నష్టమైతే లేదు.



వారెవ్వా వెర్‌స్టాపెన్

ఫార్ములావన్‌లో వరుసగా 10 విజయాలతో ప్రపంచ రికార్డు



మోంజా (ఇటలీ): అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఫార్ములావన్ (ఎఫ్1) చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధికంగా 10 వరుస విజయాలు సాధించిన డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ గుర్తింపు పొందాడు. ఆదివారం జరిగిన ఇటలీ గ్రాండ్‌ప్రిలో రెండో స్థానం నుంచి రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 51 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంట 13 నిమిషాల 41.143 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నాడు. పెరెజ్ రెండో స్థానంలో, సెయింజ్ మూడో స్థానంలో నిలిచారు. ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ 'పోల్ పొజిషన్'తో రేసును మొదలుపెట్టగా... 15వ ల్యాప్‌లో సెయింజ్‌ను వెర్‌స్టాపెన్ ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత వెర్‌స్టాపెన్‌ను ఎవరూ అందుకోలేకపోయారు. దాంతో వెర్‌స్టాపెన్ ఖాతాలో ఈ సీజన్‌లో ఓవరాల్‌గా 12వ విజయం... వరుసగా 10వ విజయంతో కొత్త చరిత్ర నమోదైంది. 2013లో సెబాస్టియన్ వెటెల్ వరుసగా 9 రేసుల్లో గెలిచాడు. వెటెల్ రికార్డును 25 ఏళ్ల వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. అంతేకాకుండా ఈ సీజన్‌లో జరిగిన 14 రేసుల్లోనూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే గెలుపొందడం విశేషం. వెర్‌స్టాపెన్ 12 రేసుల్లో నెగ్గగా... రెడ్‌బుల్ జట్టుకే చెందిన మరో డ్రైవర్ సెర్జియో పెరెజ్ రెండు రేసుల్లో గెలిచాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ప్రస్తుతం వెర్‌స్టాపెన్ 364 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. తదుపరి రేసు సింగపూర్ గ్రాండ్‌ప్రి ఈనెల 17న జరుగుతుంది.



మిరాజ్

గెలిచి నిలిచిన బంగ్లాదేశ్

- 'శత'క్కొట్టిన మిరాజ్, నజ్ముల్
- అఫ్గానిస్తాన్‌పై 89 పరుగులతో గెలుపు
- ఆసియా కప్ టోర్నీ

లాహోర్: ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో బంగ్లాదేశ్ జట్టు 'సూపర్-4' రేసులో నిలిచింది. లంకతో జరిగిన గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో 160 పైచిలుకు పరుగులు చేసేందుకు ఇబ్బంది పడిన బంగ్లాదేశ్ అఫ్గానిస్తాన్‌పై మాత్రం చెలరేగి 89 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ మెహదీ హసన్ మిరాజ్ (119 బంతుల్లో 112 రిటైర్డ్ హర్ట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిడిలార్డర్‌లో నజ్ముల్ హొసేన్ షాంతో (105 బంతుల్లో 104; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. దాంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 334 పరుగులు చేసింది. వన్డేల్లో బంగ్లాదేశ్‌కిది మూడో అత్యధిక స్కోరు. ఓపెనర్ నయీమ్ (28), వన్‌డౌన్ బ్యాటర్ తౌహిద్ (0) నిరాశపరిచినప్పటికీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిరాజ్, నజ్ముల్ మూడో వికెట్‌కు 194 పరుగులు జోడించారు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్, గుల్బదిన్ చెరో వికెట్ తీశారు. అనంతరం కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 44.3 ఓవర్లలో 245 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇబ్రహీం జద్రాన్ (74 బంతుల్లో 75; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హష్మతుల్లా (60 బంతుల్లో 51; 6 ఫోర్లు) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్ 4, షోరిఫుల్ ఇస్లామ్ 3 వికెట్లు తీశారు. మంగళవారం లాహోర్‌లో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ గెలిస్తే మాత్రం బంగ్లాదేశ్‌తో కలిసి ఈ మూడు జట్లు రెండు పాయింట్లతో సమఉజ్జీగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు 'సూపర్-4' దశకు అర్హత సాధిస్తాయి.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (బి) ముజీబ్ 28; మెహదీ హసన్ మిరాజ్ (రిటైర్డ్‌హర్ట్) 112; తౌహిద్ (సి)జద్రాన్ (బి) గుల్బదిన్ 0; నజ్ముల్ (రనౌట్) 104; ముష్ఫికర్ (రనౌట్) 25; షకీబ్ (నాటౌట్) 32; షమీమ్ (రనౌట్) 11; ఆఫిఫ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 334. వికెట్ల పతనం:** 1-60, 2-63, 2-257 (మిరాజ్ రిటైర్డ్), 3-278, 4-294, 5-324. **బౌలింగ్:** ఫరూఖీ 6-1-53-0, ముజీబ్ 10-0-62-1, గుల్బదిన్ 8-0-58-1, కరీమ్ 6-0-39-0, నబీ 10-0-50-0, రషీద్ ఖాన్ 10-1-66-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షోరిఫుల్ 1; జద్రాన్ (సి) ముష్ఫికర్ (బి) హసన్ 75; రహ్మత్ (బి) టస్కిన్ అహ్మద్ 33; హష్మతుల్లా (సి) హసన్ (బి) షోరిఫుల్ 51; నజీబుల్లా (బి) మిరాజ్ 17; నబీ (సి) ఆఫిఫ్ (బి) టస్కిన్ అహ్మద్ 3; గుల్బదిన్ (బి) షోరిఫుల్ 15; కరీమ్ (రనౌట్) 1; రషీద్ ఖాన్ (సి) షకీబ్ (బి) టస్కిన్ అహ్మద్ 24; ముజీబ్ (హిట్‌వికెట్) (బి) టస్కిన్ అహ్మద్ 4; ఫరూఖీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (44.3 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1-1, 2-79, 3-131, 4-193, 5-196, 6-212, 7-214, 8-221, 9-244, 10-245. **బౌలింగ్:** టస్కిన్ 8.3-0-44-4, షోరిఫుల్ 9-1-36-3, హసన్ 9-1-61-1, షకీబ్ 8-0-44-0, అఫిఫ్ 1-0-6-0, మిరాజ్ 8-0-41-1, షమీమ్ 1-0-10-0.

సంయుక్త ఆధిక్యంలో హారిక



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ బ్లిట్జ్ టోర్నీలో తొమ్మిది రౌండ్లు ముగిశాక భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక, జు వెన్‌జున్ (చైనా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నారు. భారత స్టార్ హంపి, ర్యాపిడ్ ఫార్మాట్ టోర్నీ విజేత దివ్య ఐదు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

డ్యూరాండ్ కప్ టోర్నీ విజేత మోహన్ బగాన్

కోల్‌కతా: ఆసియాలోనే అతి పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నమెంట్ డ్యూరాండ్ కప్‌ను మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్ జట్టు రికార్డుస్థాయిలో 17వ సారి సొంతం చేసుకుంది. ఫైనల్లో మోహన్ బగాన్ క్లబ్ 1-0తో ఈస్ట్ బెంగాల్ క్లబ్‌ను ఓడించి 23 ఏళ్ల తర్వాత ఈ టోర్నీలో మళ్లీ చాంపియన్‌గా నిలిచింది. ఆట 71వ నిమిషంలో పెట్రాటోస్ చేసిన గోల్‌తో మోహన్ బగాన్ క్లబ్ గెలిచింది. 135 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్లు 16 సార్లు చొప్పున విజేతగా నిలిచి అత్యధిక సార్లు టైటిల్ నెగ్గిన జట్టుగా సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే తాజా టైటిల్‌తో మోహన్ బగాన్ టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది.

జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ కన్నుమూత



హరారే: జింబాబ్వే క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ కన్నుమూశాడు. 49 ఏళ్ల ఆల్‌రౌండర్ క్యాన్సర్‌తో మృతి చెందినట్లు అతని భార్య నదిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. స్ట్రీక్ అంతర్జాతీయ కెరీర్‌లో 65 టెస్టులాడి 1990 పరుగులు చేశాడు. 216 వికెట్లు తీశాడు. 189 వన్డేల్లో 2943 పరుగులు సాధించి 239 వికెట్లు తీశాడు. భారత్‌తో 2005లో చివరి టెస్టు, అదే ఏడాది కివీస్‌తో చివరి వన్డే ఆడాడు. రిటైర్మెంట్ అనంతరం బంగ్లాదేశ్ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ లయన్స్ (ఇప్పుడు లేదు) జట్లకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. అయితే అంతర్జాతీయ మ్యాచ్‌ల సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్, తుది జట్టు కూర్పు సమాచారాన్ని, గోప్యత పాటించాల్సిన అంతర్గత విషయాలను బుకీలతో పంచుకున్నట్లు తేలడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2021 ఏప్రిల్‌లో హీత్ స్ట్రీక్‌పై 8 ఏళ్ల నిషేధం విధించింది.

అలెన్ అదరహో

మూడో టి20లో కివీస్ గెలుపు



బర్మింగ్‌హమ్: ఇంగ్లండ్ జట్టుతో ఆదివారం జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 74 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిన్ అలెన్ (53 బంతుల్లో 83; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), గ్లెన్ ఫిలిప్స్ (34 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడి అర్ధ సెంచరీలు చేశారు. 203 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 18.3 ఓవర్లలో 128 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ జోస్ బట్లర్ (21 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా వారు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్ (3/23), ఇష్ సోధి (3/33) రాణించారు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

రాయలసీమలో భారీ వర్షాలు



వైఎస్సార్ జిల్లా ఉప్పలపాడు ఇసుక వంక వద్ద భారీగా పారుతున్న వరదనీరు



కోవెలకుంట్ల-జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో లోలెవెల్ వంతెనపై వరద ఉధృతి

- ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
- నేటి నుంచి మూడు రోజులు వర్షాలు

(సాక్షి నెట్‌వర్క్)

రాయలసీమ జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో 16 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

రాజోలి ఆనకట్టకు భారీగా నీరు..

కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు వైఎస్సార్ జిల్లా మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. కుందూ పరీవాహక గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఇందిరారాణి సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కుండపోత వర్షాలు కురిశాయి. జిల్లాలో రికార్డు స్థాయిలో 73.2 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో సగటున 53.4, కర్నూలు జిల్లాలో సగటున 19.8 మి.మీ. వర్షం కురిసింది. రెండు రోజులుగా తిరుపతి జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం జిల్లాలో గరిష్టంగా బాలయపల్లి మండలంలో 118.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తిరుపతి అర్బన్‌లో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలో శనివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా తవణంపల్లె మండలంలో 83.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ మండలాల్లో ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ వర్షాలు కురిశాయి. అటు సత్యసాయి జిల్లా, ఇటు అనంతపురం జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో మొదటిసారిగా పుట్లూరు మండలంలో 111.6 మి.మీ. భారీ వర్షం కురిసింది. ప్రకాశం జిల్లాలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. కృష్ణా జిల్లాలో సగటున 17.2 మి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 25.52 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది.


- వైఎస్సార్ జిల్లా చెన్నూరు వద్ద పెన్నా నదిలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా నీటి ఉధృతి ఎక్కువైంది. నదిలో షికారుకు వెళ్లిన చెన్నూరు కొత్త గాంధీనగర్‌కు చెందిన వెంకట సుబ్బయ్య, రాజు, రమణ(పెద్దోడు), వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు, శ్రీను, రమణ, రాజేష్ పెన్నా నదిలో షికారుకెళ్లి పెన్నా నదిలో చిక్కుకున్నారు. మైదుకూరు రూరల్ సీఐ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోటు సాయంతో అందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.
- శనివారం రాత్రి కురిసిన వర్షానికి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు సమీపంలోని ఇసుక వంకలో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. కర్నూలు నుంచి ప్రొద్దుటూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఇసుక వంకలో చిక్కుకుంది. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ సదాశివయ్య పోలీసులు, రెస్క్యూ టీమ్ వెళ్లి వరద నీటిలో చిక్కుకున్న 13 మంది ప్రయాణికులను, డ్రైవర్, కండక్టర్‌ను తాడు సాయంతో ఉప్పలపాడు వైపు గట్టుకు తీసుకొచ్చారు.

రేపు అల్పపీడనం!

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో మంగళవారం వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడనుంది. మరోవైపు ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు ద్రోణి, ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకుని ఉన్న తెలంగాణపై మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు కోస్తాంధ్ర, రాయలసీమలపై బలంగా ఉన్నాయి. వీటన్నిటి ఫలితంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడా భారీ వర్షాలు కురవనున్నాయి. సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు.. పార్వతీపురం మన్యం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి, తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మంగళవారం ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి, తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోను, బుధవారం ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కోనసీమ, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు కూడా సంభవిస్తాయని తెలిపింది.

మీ రాతల్లోనే 'వెనుకబాటు'

- మీకు 'పచ్చ'కామెర్లు వచ్చాయని నిరూపించుకుంటున్నారు రామోజీ..
- జాతీయ రహదారుల పనుల్లో ఏపీ దేశంలోనే టాప్ అని తెలీదా?
- ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిన విషయాన్ని మర్చిపోతే ఎలా?
- మీ బాబు హయాంలో అన్ని ప్రాజెక్టులూ నత్తనడకే కదా..
- వాటిని వైఎస్సార్‌సీపీ సర్కారు పరుగులు పెట్టిస్తోంటే తట్టుకోలేకపోతున్నారా రామోజీ..



సాక్షి, అమరావతి: ఈనాడు రామోజీరావు తన కళ్లకు 'పచ్చ'కామెర్లు కమ్మాయని మరోసారి నిరూపించుకున్నారు. అందుకే జాతీయ రహదారుల నిర్మాణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉన్న వాస్తవం ఈనాడు కళ్లకు కనిపించడంలేదు. 'జాతీయ రహదారుల పనుల్లో వెనుకబాటు' అంటూ ఓ అసత్య కథనం ప్రచురించి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నించింది. జాతీయ రహదారుల నిర్మాణం, అందుకోసం వేగంగా భూసేకరణలో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటిస్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిన విషయన్ని ఈనాడు ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. చంద్రబాబు ప్రభుత్వంలో నత్తనడకన సాగిన ప్రాజెక్టులను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సత్వరం పూర్తిచేసి.. కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలనూ శరవేగంగా సాగేలా చూస్తోంది. ఉదా..

- విజయవాడలో బెంజిసర్కిల్ మొదటి ఫ్లై ఓవర్, కనకదుర్గ ఫ్లైఓవర్ పనులను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిచేయలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ రెండు ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసింది.
- విజయవాడ బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించి ఏడాదిలో పూర్తిచేసింది. విజయవాడ పశ్చిమ బైపాస్ పనులను శరవేగంగా పూర్తిచేస్తోంది.
- అలాగే ఎన్‌హెచ్-216 నిర్మాణ పనులు అత్యంత వేగంగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటోంది.
- కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ రహదారిని 2015-16, 2016-17లో మంజూరు చేసింది. ఒంగోలు నుంచి కత్తిపూడి వరకూ తీర ప్రాంతాన్ని ఆనుకుని 374.83 కి.మీ. పొడవున రూ.3,826.84 కోట్లతో జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించింది. అందుకోసం మొత్తం 10 ప్యాకేజీలుగా ఈ పనులను విభజించారు. ఇందులో చంద్రబాబు ప్రభుత్వం కేవలం ఒక్క ప్యాకేజీ పనులనే పూర్తిచేయగలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు ప్యాకేజీల పనులను పూర్తిచేశారు. మొత్తంగా ఏడు ప్యాకేజీల రూపంలో 360కి.మీ మేర రహదారిని నిర్మించారు. మిగిలిన మూడు ప్యాకేజీల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- కాకినాడ బైపాస్ కింద తిమ్మాపురం-గురజానపల్లి జాతీయ రహదారి పనులు 95శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఆ రహదారి నిర్మాణం పూర్తవుతుంది.
- పొసర్లపూడి-దిండి సెక్షన్‌లో రహదారి నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తిచేయలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఆ భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించింది. ఇప్పటికే 50శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది మే నాటికి ఈ రహదారి నిర్మాణం పూర్తిచేస్తారు.
- ఇక రేపల్లె, ఈపురుపాలెం సెక్షన్‌లో రహదారి పనుల కోసం భూసేకరణ ప్రక్రియను కూడా టీడీపీ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దానిని పూర్తిచేయడమే కాక 90శాతం వరకు నిర్మాణం పనులు పూర్తిచేసింది. ఈ నెలాఖరు నాటికి ఈ పనులు పూర్తికానున్నాయి. ఆర్‌ఓబీతో రహదారిని అనుసంధానించడంతోపాటు టోల్‌ప్లాజా, రెస్ట్ ఏరియా ఏర్పాటు పనులు మాత్రమే పెండింగులో ఉంటాయి. వాటిని కూడా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయనుంది.

సీతమ్మ కొండపై నేడు 'హర్ శిఖర్ తిరంగా'

- ఏపీలోనే ఎత్తైన పర్వత యాత్ర
- కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ ఆధ్వర్యంలో ఆర్మీ బృందం ట్రెక్కింగ్
- ఎవరెస్ట్ శిఖరం అధిరోహకుడు ఆనంద్‌కుమార్ రాక
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం

సాక్షి, పాడేరు: రాష్ట్రంలో అత్యంత ఎత్తైన (1,680 మీటర్లు) సీతమ్మ కొండకు అరుదైన గౌరవం దక్కనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని సీతమ్మ (అర్మ) కొండపైకి వెళ్లి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించేందుకు సర్వం సిద్ధమైంది. ఆజాదీ కా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా అన్ని రాష్ట్రాల్లోని అత్యున్నత శిఖరాలపై జాతీయ జెండా ఎగురవేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 'హర్ శిఖర్ తిరంగా' మిషన్ పనిచేస్తోంది. పర్వత ప్రాంతాల్లో సాహసయాత్ర చేసి.. జాతీయ జెండా ఎగురవేయడం దీని ప్రధాన ఉద్దేశం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్) డైరెక్టర్ కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ నాయకత్వంలో ఈ నెల 4వ తేదీ సోమవారం 15 మందితో కూడిన ఆర్మీ బృందం అర్మ కొండపై యాత్ర చేపట్టి జాతీయ జెండా ఎగురవేయనుంది. ఈ కార్యక్రమానికి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తెలంగాణకు చెందిన పర్వతారోహకుడు సాధనపల్లి ఆనంద్‌కుమార్ హాజరవుతారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో..

ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత ఎత్తులో ఉన్న సీతమ్మ (అర్మ) కొండపై హర్ శిఖర్ తిరంగా మిషన్ సాహస యాత్రతో పాటు జాతీయ జెండా ఆవిష్కరిస్తుందని ఇండియన్ ఆర్మీ ఏపీ ప్రభుత్వానికి గత నెలలో లేఖ పంపింది. ఇందుకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డి పోలీస్, రెవెన్యూ, టూరిజం శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ టూరిజం అథారిటీతో పాటు ప్రభుత్వంచే స్థాపించబడిన అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా క్లైంబింగ్, లాజిస్టిక్స్ సంపూర్ణ మద్దతు ఇస్తోంది. సోమవారం ఉదయం ఈ యాత్ర ప్రారంభమవుతుంది. హుకుంపేటలో ముందుగా పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం తీగలవలస-తడిగిరి పంచాయతీల సరిహద్దు నుంచి కల్నల్ రణవీర్‌సింగ్ జమ్వాల్ నేతృత్వంలోని ఆర్మీ బృందం అర్మ కొండకు సాహస యాత్ర చేపడుతుంది.



ఆంధ్రాలో అత్యంత ఎత్తయిన హుకుంపేట మండలంలోని అర్మ (సీతమ్మ)కొండ

మిషన్ లక్ష్యమిదీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ అనేది భారత రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సంస్థ. ఇది హర్ శిఖర్ తిరంగా పేరిట జాతీయ ఐక్యతను ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తోంది. వైవిధ్యాన్ని ప్రదర్శించడం, దేశభక్తిని పెంపొందించడం, సాహసం, అన్వేషణపై ప్రోత్సాహం, ప్రకృతి, పర్యావరణ అవగాహన, ప్రకృతి దృశ్యాలు ప్రపంచ గుర్తింపును ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తోంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,032	▽	3
డోజోన్స్	34,838	▲	116
ఎఫ్‌టీఎస్ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

‘ఎఫ్‌డీ’ నిచ్చెన ఎక్కుతారా..?

• వడ్డీ రేట్లు తగ్గుతాయా? పెరుగుతాయా? • అన్ని సందర్భాల్లో ఊహించడం కష్టం
• దీనికి పరిష్కారమే ఎఫ్‌డీ లాడార్ • వేర్వేరు మెచ్యూరిటీపై డిపాజిట్లు • అవసరాలకు నిధుల లభ్యత



డిపాజిట్లపై వడ్డీ రేటు 8 శాతానికి చేరుకోవడంతో ఈ సమయంలో ఎఫ్‌డీలలో ఇన్వెస్ట్ చేయాలా..? లేక మరికొన్ని రోజులు వేచి చూడాలా? అన్నది ఎంతో మంది ఎదుర్కొంటున్న సందేహం. నిజానికి ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు ఇంకా పెరగొచ్చు. లేదంటే కొంత విరామం తర్వాత రేట్లు తగ్గొచ్చు. మరి ఈ సమయంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగితే అదనపు రాబడి అవకాశాన్ని కోల్పోతామేమో..? అనుకునే వారు ఒక రకం అయితే.. ఈ రేట్లపై ఇన్వెస్ట్ చేయకపోతే, రానున్న రోజుల్లో ఆర్‌బీఐ రేట్లను తగ్గిస్తే అప్పుడు మెరుగైన రాబడి చాన్స్ మిస్ అవుతామేమో అనుకునే వారు ఇంకో రకం. ఇలాంటి అయోమయ వాతావరణాన్ని చూసి పెట్టుబడుల అవకాశాలను కోల్పోకూడదు. పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, వాటికి తగినట్టు పెట్టుబడుల వ్యూహాలను అనుసరించడమే ఇన్వెస్టర్ల ముందున్న మెరుగైన మార్గం. ఇలాంటి తరుణంలో ఇన్వెస్టర్లు 'ఎఫ్‌డీ లాడరింగ్' (అంచెలంచెలుగా) విధానాన్ని అనుసరించొచ్చు. అంటే డిపాజిట్ మొత్తాన్ని ఒకేసారి గడువు తీరే విధంగా ఇన్వెస్ట్ చేసుకోకుండా ఉండడం. మున్ముందు ఏం జరుగుతుందోనన్నది అన్ని సందర్భాల్లోనూ అంచనా వేయలేం. అటువంటప్పుడు వడ్డీ రేట్ల అస్థిరతలను అధిగమించేందుకు ఎఫ్‌డీ లాడార్ ఉపయోగపడుతుంది. మెరుగైన రాబడులకు మార్గం చూపుతుంది.





ఆర్‌బీఐ గడిచిన రెండు ద్రవ్య విధాన సమీక్షల్లో కీలకమైన రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్యోల్బణం ఇప్పటికీ ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్యానికి ఎగువనే చలిస్తోంది. దీంతో వడ్డీ రేట్ల పెంపునకు ముగింపు పడిందా? అంటే అవునని చెప్పలేని పరిస్థితి. త్వరలో వెలువడనున్న ఆగస్టు ద్రవ్యోల్బణం తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ద్రవ్యోల్బణం ఎగసి పడుతుండడంతో అదనపు సీఆర్ఆర్ రూపంలో బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ మరింత లిక్విడిటీని తీసుకునే నిర్ణయాన్ని గత సమీక్షలో ప్రకటించింది. మరోవైపు యూఎస్ ఫెడ్ రానున్న సమీక్షల్లో రేట్లను పెంచే అవకాశాలే ఉన్నట్టు సంకేతాలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టాలా? వేచి చూడాలా? అన్న సందిగ్ధత ఎదుర్కొనే వారు ఎఫ్‌డీ లాడార్‌ను అనుసరించొచ్చు.

కాలానుగుణంగా వడ్డీ రేట్ల మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ఎఫ్‌డీ లాడార్ సాయపడుతుంది. ఈ విధానంలో పెట్టుబడి మొత్తాన్ని ఒకే కాల వ్యవధికి ఇన్వెస్ట్ చేయకుండా.. వివిధ కాల వ్యవధుల మధ్య భాగాలుగా చేసుకోవాలి. సాధారణంగా వడ్డీ రేట్లు పడిపోతున్న తరుణంలో ఇన్వెస్టర్లు దీర్ఘకాలానికి కాకుండా స్వల్ప కాలానికి ఎఫ్‌డీలు చేస్తుంటారు. ఒకవేళ వడ్డీ రేట్లు మళ్లీ పెరగడం మొదలు పెడితే.. స్వల్పకాలానికి చేసిన ఎఫ్‌డీ గడువు తీరి చేతికి వస్తుందని, ఆ మొత్తాన్ని మెరుగైన రేటుపై మళ్లీ ఎఫ్‌డీ చేసుకోవచ్చని అనుకుంటారు. అదే మాదిరిగా, వడ్డీ రేట్లు పెరుగుతూ వెళుతుంటే అప్పుడు దీర్ఘకాలానికి ఎఫ్‌డీలు చేస్తుంటారు. ఒకవేళ అక్కడి నుంచి వడ్డీ రేట్లు పడిపోవడం మొదలు పెడితే.. అధిక రేటుపై ఎఫ్‌డీ చేసుకున్నట్టు అవుతుందని భావిస్తుంటారు. కానీ, ఇది సరైన విధానం కాబోదు. వడ్డీ రేట్లు అస్థిరంగా ఉన్న సమయంలో పెట్టుబడినంతా ఒకే ఎఫ్‌డీగా మార్చుకోవడం సరైన నిర్ణయం అనిపించుకోదు.

వడ్డీ రేట్ల అస్థిరతలకు చెక్



''ఇన్వెస్టర్లు సాధారణంగా గరిష్ట రేటుపై ఎఫ్‌డీ చేసుకోవాలని చూస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది చాలా కష్టం. భవిష్యత్ వడ్డీ రేట్ల గమనాన్ని అంచనా వేయడం రిస్క్‌తో కూడుకున్నదే అవుతుంది. దీనికి బదులు వడ్డీ రేట్ల చలనంతో వచ్చే రిస్క్‌ను తగ్గించుకునేందుకు ఎఫ్‌డీ లాడరింగ్ ఒక టెక్నిక్''అని ముంబైకి చెందిన సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అభిజిత్ తాలూక్‌దార్ సూచించారు. ''లాడరింగ్‌ను క్రమం తప్పకుండా అనుసరించినట్టయితే వడ్డీ రేట్ల మార్పిడికి భిన్నంగా లేకుండా ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు కనిష్ట స్థాయిలో, కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉండొచ్చు. ఎఫ్‌డీలను తిరిగి రెన్యువల్ చేసుకునే సమయంలో అప్పటి వరకు ఉన్న రేటు కంటే మెరుగైన రేటు రావొచ్చు. లేదంటే తక్కువ రేటు ఉండొచ్చు. కాకపోతే మొత్తం మీద నా పెట్టుబడులపై రేటు సగటుగా ఉంటుంది. ఎఫ్‌డీ లాడరింగ్‌తో మెరుగైన రేటుపైనే ఇన్వెస్ట్ చేయాలన్న సందిగ్ధత, అయోమయం తొలగిపోతుంది''అని 'ఇంటర్నేషనల్ మనీ మ్యాటర్స్' సంస్థ ఎండీ, సీఈవో లోవై నవలకి వివరించారు.

ఉదాహరణకు మీ వద్ద రూ.9 లక్షలు ఉన్నాయని అనుకుందాం. ఈ మొత్తాన్ని ఒకే ఎఫ్‌డీగా కాకుండా.. రూ.3 లక్షల చొప్పున మూడు భాగాలు చేసుకోవాలి. ఒక్కో భాగాన్ని వేర్వేరు కాల వ్యవధికి ఎఫ్‌డీగా మార్చుకోవాలి. ఏడాది, రెండేళ్లు, మూడేళ్లకు ఒకటి చొప్పున ఎఫ్‌డీగా మార్చుకోవాలి. మొదటి రూ.3 లక్షలు ఏడాదికి మెచ్యూరిటీ తీరి చేతికి వస్తుంది. ఈ మొత్తాన్ని తిరిగి మళ్లీ ఎఫ్‌డీ చేసుకోవాలి. వడ్డీ రేట్లు పెరుగుతూ వెళ్లే తరుణంలో అధిక రేటుపై ఎఫ్‌డీ చేసుకున్నట్టు అవుతుంది. అదే వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో అప్పటి వరకు చేసిన రేటు కంటే కొంచెం తక్కువకు ఎఫ్‌డీ చేసుకోవాల్సి వస్తుంది. కాకపోతే మిగిలి ఉన్న రెండు, మూడేళ్ల ఎఫ్‌డీలపై అధిక రేటు పొందినట్టు అవుతుంది. ఎఫ్‌డీ లాడార్ విధానం వల్ల ఇన్వెస్టర్ తన పెట్టుబడిపై పొందే రేటు సగటుగా మారుతుందని, మెరుగైన రాబడికి వీలు కలుగుతుందని అభిజిత్ తాలూక్‌దార్ వివరించారు.

•••

ఉదాహరణకు రూ.9 లక్షలను రూ.3 లక్షల చొప్పున ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలానికి ఎఫ్‌డీ చేశారని అనుకుందాం. 2018 జనవరి నుంచి 2020 డిసెంబర్ మధ్య ఈ ఎఫ్‌డీలు మెచ్యూరిటీ తీరేట్టుగా డిపాజిట్ చేశారు. అప్పుడు వడ్డీ రేట్లు క్షీణ బాటలో ఉన్నాయి. కనుక 6.5 శాతం, 6 శాతం, 4.7 శాతంపై ఎఫ్‌డీ చేసినట్టు అయింది. 2020 డిసెంబర్ చివరికి మూడు ఎఫ్‌డీలపై కలిపి రూ.1,63,500 రాబడిగా వచ్చి ఉండేది. అలా కాకుండా మొత్తం రూ.9 లక్షలను 2018 జనవరిలో మూడేళ్ల కాలానికి

రాబడి సగటుగా మారి..



(2020 డిసెంబర్‌లో గడువు తీరే విధంగా) ఎఫ్‌డీ చేసి ఉంటే, అప్పుడు రూ.1,75,500 రాబడిగా వచ్చి ఉండేది. మూడు భాగాలుగా చేయడం వల్ల (ఎఫ్‌డీ లాడరింగ్) ఈ ఉదాహరణలో (వడ్డీ రేట్లు పడిపోయే క్రమంలో) రూ.12,000 తక్కువ రాబడి పొందినట్టు తెలుస్తోంది. ఇప్పుడు మరో ఉదాహరణలో.. 2021 జనవరి నుంచి 2023 జూలై వరకు ఇంతే మొత్తాన్ని మూడు భాగాలుగా ఎఫ్‌డీ చేసుకుని ఉంటే (4.25 శాతం, 5.50 శాతం, 6.75 శాతం) మొత్తం మీద వడ్డీ రాబడి రెండున్నరేళ్లలో రూ.1,35,000 వచ్చి ఉండేది. అలా కాకుండా రూ.9 లక్షలను 2021 జనవరిలో ఒకే ఎఫ్‌డీగా చేసి ఉంటే, దీనిపై రాబడి రూ.1,14,750గా ఉండేది. ఎఫ్‌డీ లాడర్ కారణంగా రూ.20,300 అధిక రాబడి వచ్చినట్టు తెలుస్తోంది. ''క్షీణించే, పెరుగుతూ పోయే వడ్డీ రేట్ల సైకిల్‌ను పరిగణనలోకి తీసుకుని 2018–2023 కాలంలో ఎఫ్‌డీ లాడరింగ్ చేసి ఉంటే, ఈ మొత్తంపై రూ.8,250 అధిక రాబడికి అవకాశం లభించేది''అని ముంబైకి చెందిన ఫిన్‌టెక్ సంస్థ 'స్ట్రాటజీ' ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ ప్రశాంత బర్వాలియా వెల్లడించారు.

నిజానికి వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో కంటే.. పెరుగుతున్న తరుణంలో, మిశ్రమంగా చలించే తరుణంలో ఎఫ్‌డీ లాడర్ ప్రయోజకరంగా ఉంటుంది. ఒక్క వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలోనే ఎఫ్‌డీ లాడర్ వల్ల కొంత నష్టపోవాల్సి వస్తుంది. కానీ, ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు పెరుగుతాయా? లేదంటే తగ్గుతాయా? వడ్డీ రేటు గరిష్ట స్థాయికి చేరినట్టు ధ్రువీకరించుకోగలరా..? సాధారణ ఇన్వెస్టర్లకు ఇది క్లిష్టమైన టాస్క్ అవుతుంది. వడ్డీ రేట్లు ఇక్కడి నుంచి కచ్చితంగా పెరుగుతాయని అనిపించినప్పుడే ఎఫ్‌డీ లాడర్ చేసుకోవచ్చు. అలా కాకుండా ఊహలు, అంచనాలపై ఆధారపడకుండా అన్ని కాలాల్లోనూ ఎఫ్‌డీ

ఏమిటి మార్గం..?

లాడార్ చేసుకోవడం అనుకూలమైన విధానం. ఎఫ్‌డీ లాడర్‌తో వడ్డీరేట్ల అస్థిరతలను అధిగమించడంతోపాటు, మరో ప్రయోజనం కూడా ఉంది. లిక్విడిటీ సమస్య ఉండబోదు. ఏడాదికోసారి లిక్విడిటీ చేతికి అందుతుంది. రిటైర్మెంట్ తీసుకున్న వారికి క్రమం తప్పకుండా ఆదాయం అవసరం పడుతుంది. అటువంటి వారు మూడు నెలలు, ఆరు నెలలు, తొమ్మిది నెలలు, పన్నెండు నెలల కాలానికి ఒక్కో భాగం చొప్పున ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ''ఎఫ్‌డీ లాడరింగ్ అనేది వడ్డీ రేటు, పెట్టుబడుల రిస్క్‌ను తగ్గిస్తుంది. దీనికితోడు వివిధ కాలాల్లో స్థిరమైన నగదు ప్రవాహాలకు అవకాశం కల్పిస్తుంది. కాకపోతే ఏడాదిలోపు కాల వ్యవధులకు చేసే మినీ లాడర్‌పై తక్కువ రాబడి వస్తుంది''అని రాకెట్‌ఫోర్డ్ ఫిన్‌క్యాప్ వ్యవస్థాపకుడు వెంకట కృష్ణన్ శ్రీనివాసన్ సూచించారు. ఇక డిపాజిట్ చేసే ముందు అందుబాటులోని వివిధ బ్యాంకులు ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లను పరిశీలించాలి. మెరుగైన రేటును ఆఫర్ చేసే బ్యాంక్‌లో ఎఫ్‌డీ చేసుకోవడం ద్వారా రాబడిని పెంచుకోవచ్చు. సాధారణంగా బ్యాంకుల్లో ఎఫ్‌డీల కాలవ్యవధి ఏడు రోజుల నుంచి పదేళ్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం అయితే 7.5 శాతం వరకు వడ్డీ రేటు ఎఫ్‌డీలపై లభిస్తోంది. 60 ఏళ్లు నిండిన వారికి అర శాతం అదనపు రేటు లభిస్తుంది. ఎఫ్‌డీ లాడార్‌లో వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో రాబడి తగ్గుతుంది. అయినా కానీ, ఈ విధానంపై నమ్మకం ఉన్న వారే దీన్ని ఎంపిక చేసుకోవాలి. ముఖ్య విషయం ఏమిటంటే.. ఏదైనా ఒక బ్యాంకులో అన్ని డిపాజిట్లు కలిపి రూ.5 లక్షలు మించకుండా, వేర్వేరు బ్యాంకుల్లో డిపాజిట్లు చేసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఏదైనా బ్యాంకు సంక్షోభంలో పడినా, రూ.5 లక్షల వరకు బీమా రూపంలో వెనక్కి వస్తుంది.



ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ ప్రో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గిఫ్ట్ ప్రో పేరుతో కొత్త ఇన్‌కం ప్లాన్‌ను పరిచయం చేసింది. ఇది వినియోగదారులకు సంవత్సరానికి పెరుగుతున్న ఆదాయాన్ని లేదా స్థిరమైన సాధారణ ఆదాయాన్ని 30 ఏళ్ల వరకు పొందే అవకాశాన్ని అందిస్తుంది. అదనంగా ఈ నాన్-పార్టిసిపేటింగ్ సేవింగ్స్ ఉత్పాదన అందించే జీవిత బీమాతో కుటుంబానికి ఆర్థిక భద్రతను కలిగి ఉండేలా చేస్తుంది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ టెక్నాలజీ ఫండ్

సెప్టెంబర్ 5 వరకు అందుబాటులో



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 'హెచ్‌డీఎఫ్‌సీ టెక్నాలజీ ఫండ్'ను ప్రారంభించింది. సెప్టెంబర్ 5 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. స్టాక్ ఎంపికకు బోటమ్ అప్ విధానాన్ని అనుసరిస్తుంది. అంటే విడిగా కంపెనీల ఆర్థిక మూలాలను పరిగణనలోకి తీసుకుని ఇన్వెస్ట్ చేస్తుంది. ఐటీ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్, ఔట్‌సోర్సింగ్, ఐటీ ఉత్పత్తులు, హార్డ్‌వేర్, ఇంటర్నెట్ కంపెనీలు, ఇంటర్నెట్ ఆధారిత సేవలు అందించే కంపెనీలు, టెలికమ్యూనికేషన్స్, మీడియా, ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, డేటా, డేటా సొల్యూషన్స్ కంపెనీల్లో 80 శాతం వరకు ఇన్వెస్ట్ చేయనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
4-9-2023	
విశాఖ	485-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
3-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

చోళ ఇన్వెస్ట్‌మెంట్ — ఆనంద్ రాఠి — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,129 టార్గెట్: రూ. 1,425

ఎందుకంటే: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డిజిటల్, ఎస్ఎంఈ, కన్జూమర్ ఫైనాన్స్ విభాగాలలో కార్యకలాపాలను మరింత పటిష్టపరచేందుకు చర్యలు చేపట్టింది. దీర్ఘకాలిక రిటర్న్ ఆన్ అసెట్స్(ఆర్‌వోఏ)ను పెంచుకునే బాటలో కంపెనీ వ్యవస్థాగత మార్పులకు తెరతీసింది. దీంతో కంపెనీ నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణ బాటలో సాగుతోంది. ఈ ప్రణాళికల ప్రభావం 2024–25 నుంచి కనిపించనుంది. ప్రస్తుతం 20 శాతానికిపైగా నమోదవుతున్న కొత్త బిజినెస్‌లలో రుణ పంపిణీ మరింత మెరుగుపడనుంది. సంప్రదాయ బిజినెస్‌లతో పోలిస్తే అత్యధిక స్థాయిలో రిటర్న్ ఆన్ టోటల్ అసెట్స్(ఆర్‌వోటీఏ) సాధనకు కొత్త విభాగాలను రూపొందిస్తోంది. వెరసి గరిష్టస్థాయిలో రుణ వృద్ధి కొనసాగేందుకు వీలు చిక్కనుంది. కస్టమర్ కేంద్రంగా మూడు నియమాల(3సీ)తో రూపొందించిన ప్రణాళికలు కొత్త బిజినెస్ వృద్ధికి దోహదం చేయనున్నాయి. కంపెనీ విడుదల చేస్తున్న రుణాల్లో అత్యధిక శాతం సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారు, వృత్తినిపుణుల(ఎస్ఈపీ) విభాగం ఆక్రమిస్తోంది. అండర్‌రైటింగ్ కార్యకలాపాల్లో నైపుణ్యం, వసూళ్ల(కలెక్షన్లు) ప్రాసెస్‌లో పటిష్ట నిర్వహణ వంటి అంశాలు కోవిడ్–19 పరిస్థితుల్లోనూ కంపెనీ కార్యకలాపాలకు అండగా నిలిచాయి. దీంతో కరోనా సవాళ్లలోనూ పటిష్ట పనితీరు చూపగలిగింది. ఇదేపద్ధతిలో కొత్త బిజినెస్‌లలోనూ విస్తరించనుంది. క్రెడిట్ అండర్‌రైటింగ్ ప్రమాణాలు, కలెక్షన్ ఫస్ట్ విధానాలు ఇందుకు సహకరించనున్నాయి. సుప్రసిద్ధ ప్రమోటర్ గ్రూప్, కంపెనీ అవలంబిస్తున్న పటిష్ట విధానాలు, వ్యవస్థలు షేరుకి మద్దతునిచ్చే అంశాలుగా పరిగణించవచ్చు.



శూల వైన్‌యార్డ్స్ — కీనోట్ క్యాపిటల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 493 టార్గెట్: రూ. 587

ఎందుకంటే: రాజీవ్ సామంత్ 1999లో ఏర్పాటు చేసిన శూల వైన్‌యార్డ్స్ దేశీయంగా వైన్ బిజినెస్‌లో పాగా వేసింది. కంపెనీ ఆదాయంలో వైన్లు 92 శాతం ఆక్రమిస్తుంటే.. వైన్ టూరిజం వాటా 8 శాతంగా నమోదుకావడం ఈ అంశాన్ని ప్రతిఫలిస్తోంది. వైనరీ విభాగం 56 సొంత బ్రాండ్ల పోర్ట్‌ఫోలియోతో పటిష్టతను సంతరించుకుంది. అంతేకాకుండా మరో 21 అంతర్జాతీయ వైన్, స్పిరిట్స్ (థర్డ్‌పార్టీ) బ్రాండ్లతో కంపెనీ కార్యకలాపాలు విస్తరించింది. 2023 మార్చికల్లా మహారాష్ట్ర, కర్ణాటకలలో ఆరు తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. వీటి మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 16.7 మిలియన్ లీటర్లు కాగా.. 2,800 ఎకరాల ద్రాక్ష తోటల నుంచి 500 మందికిపైగా రైతుల ద్వారా ముడిసరుకు పొందుతోంది. 2022–23కల్లా అమ్మకాల పరిమాణం రీత్యా దేశీ అన్‌ఫోర్టిఫైడ్ మార్కెట్లో కంపెనీ 52 శాతం వాటాను కలిగి ఉంది. విలువరీత్యా అత్యంత ఖరీదైన, విలువైన వైన్ విభాగంలో 61 శాతం వాటాను ఆక్రమిస్తోంది. గత రెండేళ్ల (2021–23)లో వార్షిక ప్రాతిపదికన సొంత బ్రాండ్ల బిజినెస్ 13 శాతం, వైన్ టూరిజం 17 శాతం చొప్పున వృద్ధిని అందుకున్నాయి. దీంతో 2023 మార్చికల్లా ప్లాంట్ల తయారీ సామర్థ్యాన్ని వార్షికంగా 14 శాతంమేర పెంచింది. వెరసి 16.7 మిలియన్ లీటర్లకు చేర్చింది. ఇదేవిధంగా స్టోరేజీ అవసరాలకు రూముల సామర్థ్యాన్ని సైతం గత 15 నెలల్లో 49 శాతంమేర హెచ్చించింది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికాని(ఏప్రిల్–జూన్)కల్లా 100 రూములను మించి ఏర్పాటు చేసింది. ఈ ఏడాది వైన్ వినియోగం పరిమాణంలో 15 శాతం, ధరలు 4 శాతం చొప్పున పుంజుకునే వీలుంది. తద్వారా నాయకత్వస్థాయిని కొనసాగించే అవకాశముంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జీఎంఆర్ పవర్‌కు భారీ ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ పవర్ అనుబంధ సంస్థ జీఎంఆర్ స్మార్ట్ ఎలెక్ట్రిసిటీ డి్స్ట్రిబ్యూషన్ (జీఎస్ఈడీపీఎల్)కు పూర్వాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ నుంచి రూ. 5,123 కోట్ల విలువ చేసే ఆర్డర్లు లభించాయి. వీటి కింద ఉత్తర్‌ప్రదేశ్‌లోని పూర్వాంచల్ (వారణాసి, ఆజమ్‌గఢ్ జోన్, ప్రయాగ్‌రాజ్, మీర్జాపూర్ జోన్)లో 50.17 లక్షల స్మార్ట్ మీటర్ల ఇన్‌స్టాలేషన్, నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఇందులో ప్రయాగ్‌రాజ్–మీర్జాపూర్ జోన్ కాంట్రాక్టు విలువ రూ. 2,387 కోట్లుగాను, వారణాసి–ఆజమ్‌గఢ్ జోన్ కాంట్రాక్టు విలువ రూ. 2,736.65 కోట్లుగాను ఉంటుందని సంస్థ తెలిపింది. త్వరలోనే దక్షిణాంచల్ (ఆగ్రా, అలీగఢ్ జోన్)లో 25.52 లక్షల స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టుకు సంబంధించి దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ నుంచి కూడా కాంట్రాక్టు లభించే అవకాశం ఉందని పేర్కొంది.

ఎక్స్‌పర్ట్ ఏసీతో హైకావా అప్లయెన్సెస్ జట్టు



హైదరాబాద్: జపాన్‌కు చెందిన ఏసీలు, గృహోపకరణాల తయారీ దిగ్గజం హైకావా అప్లయెన్సెస్ తాజాగా నేషనల్ ఎయిర్‌కాన్ ఇండియాలో భాగమైన ఎక్స్‌పర్ట్ ఏసీ సొల్యూషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో దక్షిణాదిలో హైకావా ఉత్పత్తులకు ఎక్స్‌పర్ట్ సొల్యూషన్స్ సూపర్ స్టాకిస్టుగాను, సర్వీస్ ప్రొవైడరుగాను ఉండనుంది. తద్వారా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు కూడా తమ కార్యకలాపాలు విస్తరించగలమని హైకావా సీఈవో మక్బూల్ సూర్య తెలిపారు. తమ డీలర్లు, డి్స్ట్రిబ్యూటర్ల విస్తృత నెట్‌వర్క్ ద్వారా విక్రయాలను గణనీయంగా పెంచేందుకు కృషి చేయగలమని నేషనల్ ఎయిర్‌కాన్ ఎండీ షాముద్దీన్, ఎక్స్‌పర్ట్ ఏసీ డైరెక్టర్ జయిన్ పేర్కొన్నారు.

ఆరు నెలల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

Q & A

మూడు నుంచి ఆరు నెలల కాలానికి రూ.50వేలు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మెరుగైన రాబడుల కోసం ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– సంతోష్ కుమార్

పెట్టుబడులకు చాలా స్వల్పకాలం ఉంది. కనుక మెరుగైన రాబడుల కోసం పెట్టుబడిపై రిస్క్ తీసుకోవడం సరికాదు. పెట్టుబడికి భద్రత ఎక్కువ ఉండాలి. రాబడుల కంటే పెట్టుబడిని కాపాడుకునే విధంగా వ్యూహం ఉండాలి. కనుక ఈ మొత్తాన్ని మీరు బ్యాంకు ఖాతాలోనే ఉంచుకోవచ్చు. లేదంటే ఆరు నెలల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో రాబడులు తక్కువే అయినా గ్యారంటీతో కూడినవి. పైగా పెట్టుబడికి భద్రత ఎక్కువ. బ్యాంకులో చేసే డిపాజిట్ రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ నుంచి బీమా ఉంటుంది. అలాగే, లిక్విడ్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వ సెక్యూరిటీలు, రెపో సర్టిఫికెట్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. గరిష్టంగా 91 రోజుల కాల వ్యవధి కలిగిన సెక్యూరిటీల్లోనే లిక్విడ్ పథకాలు ఇన్వెస్ట్ చేస్తాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే లిక్విడ్ ఫండ్స్‌లో కొంచెం అదనపు రాబడి వస్తుంది. కాకపోతే పెట్టుబడి భద్రతకు అవి హామీ ఇవ్వవు.


నేను యూఎస్ లేదా గ్లోబల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. ఇందుకోసం ఫండ్స్‌ను ఎలా ఎంపిక చేసుకోవాలి? వీటికి ఎంత మేర కేటాయింపులు చేసుకోవాలి?

– వరుణ్

దేశం వెలుపలి ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే పథకాలను ఇంటర్నేషనల్ ఫండ్స్ అని పిలుస్తారు. తమ పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలని కోరుకునే వారు ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. విదేశీ కరెన్సీలో అయ్యే వ్యయాలకు ముందు నుంచే ఈ రూపంలో ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పిల్లలు స్కూల్‌లో చేరినప్పటి నుంచి వారి భవిష్యత్ విదేశీ విద్య కోసం ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో సిప్ ద్వారా క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. దేశీయంగా మెరుగైన రాబడులను ఇచ్చే పథకాలు ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ కరెన్సీ విలువల పరంగా ఉండే రిస్క్‌ను దృష్టిలో పెట్టుకుని కొంత మొత్తాన్ని మంచి రాబడినిచ్చే అంతర్జాతీయ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మేలైన నిర్ణయం అవుతుంది. వివిధ రంగాల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే వైవిధ్యంతో కూడిన ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. మనం భారత్‌లో నివసిస్తున్నప్పుడు, మన ఆదాయం, వ్యయాలు, ఆస్తులన్నీ ఇక్కడే ఉంటాయి. అంతర్జాతీయ పెట్టుబడులు అన్నవి మన మార్కెట్‌తో సంబంధం కలిగి ఉండవు. కాకపోతే ఈ మార్గం ద్వారా తగినంత వైవిధ్యాన్ని పాటించొచ్చు. అలాగే, కేవలం ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టే ఇంటర్నేషనల్ ఫండ్స్‌కు దూరంగా ఉండాలి. ఇంటర్నేషనల్ ఫండ్స్ థీమ్యాటిక్ ఫండ్ లేదా కమోడిటీ ఫండ్ లేదా ఒకే దేశానికే సంబంధించి పెట్టుబడులతో కూడిన పథకాల్లో రిస్క్ ఉంటుంది. అప్పటి వరకు సానుకూలంగా ఉన్న రాబడులు ప్రతికూలంగా మారిపోవచ్చు. అందుకని వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో ఉన్న పథకాలను ఎంపిక చేసుకోవాలి.

అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లో డాలర్ విలువ ఏటేటా బలపడుతోంది. 2017లో యూఎస్ డాలర్ రూపాయితో 65 దగ్గర ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఐదేళ్లలో ఏటా 4 శాతానికి పైనే డాలర్ బలపడింది. డాలర్ మారకంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఈ విధమైన కరెన్సీ ప్రయోజనాన్ని పొందొచ్చు. డాలర్ మారకంతో కూడిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా క్షీణించే రూపాయి విలువ పరంగా రక్షణ ఉంటుంది. ఫలితంగా మెరుగైన రాబడి అందుకోవచ్చు. అలాగే, ఈక్విటీ పథకాల మాదిరే ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోనూ దీర్ఘకాలం దృష్టితోనే పెట్టుబడులు పెట్టాలి. ఏడాది, మూడేళ్ల కాల పనితీరు చూసి పెట్టుబడులు పెట్టకూడదు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను ఆదాయపన్ను చట్టం నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తుంది. కనుక డెట్ ఫండ్స్ మాదిరే పన్ను విధానం అమలవుతుంది.

కాలుష్య నియంత్రణ సామర్థ్య విస్తరణ


ఆధునీకరించిన ఓఆర్‌-1 బెర్త్


ట్రక్ టెర్మినల్ ముఖ ద్వారం

- సరికొత్త ప్రణాళికలతో విశాఖపట్నం పోర్టు అడుగులు
- మేజర్ పోర్టులతో పోటీపడుతూ అభివృద్ధి పనులు
- నేడు కేంద్ర మంత్రి శర్బానంద చేతుల మీదుగా శ్రీకారం

రూ.237.51 కోట్లతో పోర్టులో చేపడుతున్న విస్తరణ పనులు

రూ.33.80 కోట్లతో కవర్డ్ స్టోరేజ్ యార్డులు నిర్మాణం

రూ.167.66 కోట్లతో బెర్త్‌ల పునరుద్ధరణ పనులు

రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్ నిర్మాణం

విశాఖపట్నం పోర్టు అథారిటీ ప్రగతి పథంలో పయనిస్తోంది. నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటూ దేశంలోని మేజర్ పోర్టులతో పోటీ పడుతూ ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అనుసరిస్తోంది. పోర్టు ద్వారా నగరంలోకి వస్తున్న కాలుష్య నియంత్రణతో పాటు సామర్థ్యాన్ని విస్తరించే ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించింది. రూ.237.51 కోట్ల అభివృద్ధి పనులకు ఈ నెల 4న కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది.

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడుల ప్రవాహం.. పెరుగుతున్న సామర్థ్యానికి అనుగుణంగా విస్తరణ పనులతో విశాఖ పోర్టు అథారిటీ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సరికొత్త సొబగులద్దుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీల విస్తరణ, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతుండటంతో విశాఖ పోర్టు ప్రపంచ వాణిజ్య కేంద్రానికి చిరునామాగా మారనుంది. ఈ పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేసి దేశంలోని మేజర్ పోర్టుల్లో నాలుగో స్థానంలో నిలిచిన విశాఖను నెంబర్ వన్‌గా నిలబెట్టాలని వీపీఏ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ట్రక్ పార్కింగ్ టెర్మినల్ పనుల వేగం పుంజుకుంది.


కవర్డ్ స్టోరేజ్ యార్డులు

రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్

ప్రస్తుతం పోర్టుకు ఉన్న ట్రక్ పార్కింగ్ సామర్థ్యం 300 వాహనాలు మాత్రమే. అయితే పోర్టు అనుబంధ సంస్థ విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రాజెక్టు లిమిటెడ్ (వీసీటీపీఎల్) సామర్థ్యం రమారమి 5 లక్షల టీఈయూ (20 ఫుట్‌కంటైనర్) వరకు ఉంది. దీంతో పాటు 300 నుంచి 500 వరకూ ట్రైలర్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. వీసీటీపీఎల్ విస్తరణ పనులు సాగుతుండటంతో సామర్థ్యం మరో 5 లక్షల టీఈయూలతో పాటు మరో 300 నుంచి 400 వాహనాలు అదనంగా వచ్చే అవకాశాలున్నాయి. ఈ కారణం వల్ల మరో ట్రక్ టెర్మినల్ అవసరమని భావించిన పోర్టు 20 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను నిర్మించింది. రూ.36.05 కోట్లతో రూపుదిద్దుకున్న ఈ టెర్మినల్ పోర్టుకు వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు అవాంతరాలు లేని వాహనాల రవాణా కోసం ఉపయోగపడనుంది. ఈ టెర్మినల్‌లో మొత్తం 666 వాహనాల పార్కింగ్ చేసుకునే సౌలభ్యం ఉంది. 100 బెడ్‌లతో కూడిన డార్మెటరీతో పాటు 9 దుకాణాలు, ఏటీఎం, వాహనాల విడిభాగాల విక్రయ కేంద్రాన్ని కూడా నిర్మించారు.

ఓఆర్‌-1, 2, 3 బెర్తుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం

విశాఖ పోర్టును ఏ విధంగా విస్తరించాలనే అంశంపై విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. బెర్తుల ఆధునికీకరణ, సామర్థ్య విస్తరణతో పాటు సరికొత్త పనులకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు చానెల్స్, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల సైతం నుంచి ఆదాయం ఆర్జించేలా సరికొత్త మార్గాలను అన్వేషిస్తోంది. వివిధ జెట్టీల ద్వారా మాంగనీస్, బొగ్గు, జిప్సం, బాక్సైట్ తదితర ఖనిజాలు, ఇతర ప్రధాన ఉత్పత్తులు రవాణా జరుగుతుంటుంది. భవిష్యత్తులో వీటి రవాణా సామర్థ్యం పెరిగే అవకాశం ఉన్నందున జెట్టీ సామర్థ్యాన్ని కూడా పెంచేలా పోర్టు పనులు ప్రారంభించింది. ఓఆర్‌-1, ఓఆర్‌-2, ఓఆర్‌-3 బెర్తుల పునరుద్ధరణ పనులకు రూ.167.66 కోట్లతో శ్రీకారం చుట్టింది. 14.5 మీటర్ల డ్రాఫ్ట్ వెసల్స్, 85 వేల డీడబ్ల్యూ వెసల్స్‌ను హ్యాండిల్ చేసే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే 243 మీటర్ల పొడవుతో 3.81 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఓఆర్‌-1 బెర్త్ అందుబాటులోకి వచ్చింది. ఓఆర్‌-2, ఓఆర్‌-3 బెర్తుల ఆధునికీకరణ 2024 అక్టోబర్ నాటికి పూర్తికానున్నాయి. ఈ పనులను కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఈ నెల 4న ప్రారంభించనున్నారు.

నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా..

విశాఖలో పోర్టు కాలుష్యం దాదాపు తగ్గినప్పటికీ బొగ్గు నిల్వల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోర్టు నుంచి సుమారు 3 చదరపు కిలోమీటర్ల వరకూ బొగ్గుకు సంబంధించిన నల్లటి రేణువులు విస్తరించి కలుషితంగా నగరం మారుతోంది. దీన్ని అధిగమించేందుకు విశాఖ పోర్టు కవర్డ్ స్టోరేజ్ షెడ్లు నిర్మించింది. ఇప్పటికే టార్పాలిన్లు కప్పుతూ లారీల ద్వారా లోడ్స్ తీసుకొస్తున్నారు. ఆ లారీలు నేరుగా షెడ్లలోకి వెళ్లి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తాయి. దీనివల్ల ఆ సమయంలో ఎగిరే బొగ్గు కణాలన్నీ షెడ్‌లలోనే ఉండిపోతాయి. బయటకు ఎగరకుండా ఉంటాయి. దీని వల్ల నగరంలోకి ఎగిరే బొగ్గు రేణువుల శాతం గణనీయంగా తగ్గుతుంది. రూ.33.80 కోట్ల వ్యయంతో ఆర్‌-11 ప్రాంతంలో కవర్డ్ స్టోరేజ్ యార్డును నిర్మించారు. స్టాక్ యార్డుల నుంచి ఉత్పత్తయ్యే కాలుష్యాన్ని నియంత్రించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ యార్డు ద్వారా 84,000 టన్నుల బల్క్, బ్యాగ్‌డ్ కార్గోను నిర్వహించగలరు. ఇవి అందుబాటులోకి రావడంతో కాలుష్యం మరింత తగ్గే అవకాశం ఉంది.

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

వైభవంగా శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధన వేడుకలు


ప్రహ్లాదరాయలు


రాఘవేంద్రుల మూలబృందావనం

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి 352వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో వేకువ జామున 5.30 గంటల నుంచే సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు, రాయరు పాదపూజ, మూలదేవర సంస్థాన పూజ, శ్రీరాఘవేంద్ర స్వామి మఠం 13వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన చేపట్టారు. రాత్రి 10 గంటలకు ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వ వాహనంపై మంగళ వాయిద్యాలు, దాస సాహిత్య మండలి మహిళల భజనలు, అశేష భక్త జనం హర్ష ధ్వానాలు మధ్య శ్రీమఠం మాడ వీధుల్లో ఊరేగారు. అనంతరం చెక్క, వెండి, అంబారి, స్వర్ణ రథయాత్రలు నిర్వహించారు.వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీమఠం యోగీంద్ర మంటపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన నాట్య సరస్వతి కూచిపూడి నృత్యం ఆకర్షించింది. పుత్తూరు విద్వాన్ జగదీష్ ఆచార్య దాసవాణి భక్తి గేయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరు శ్రీశారద కళా కేంద్ర ట్రస్టు బృందం భరతనాట్య ప్రదర్శనలకు భక్తులు మంత్రముగ్ధులయ్యారు. వేడుకలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ఏపీఆర్వో బిందుస్వామి పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు..

ఆరాధనోత్సవాల్లో ఆఖరిరోజు సోమవారం సర్వ సమర్పణోత్సవం జరుగనుంది. ఏక కాలంలో పంచవాహనాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు, రాఘవేంద్రులను శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగిస్తారు. ఉదయం అనుమంత్రాలయం తుంగభద్ర గ్రామంలో మృత్తిక బృందావన క్షేత్రంలో ఆరాధన వేడుకలు, రథయాత్ర నిర్వహిస్తారు.

మింగేస్తున్నారు!

భోజనానికి ముందు మాత్రలు మింగుతున్న జనం

బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులే అధికం

పెరిగిన వినియోగం.. జోరుగా ఫార్మసీ వ్యాపారం



అజాగ్రత.. మితిమీరిన దుర అలవాట్లు.. డబ్బుంటే ఏ వ్యాధి అయినా నయం అవుతుందనే ధీమా.. వెరసి మనిషి జీవితాన్ని నాశనం చేస్తోంది. ఫలితంగా నిద్ర లేవగానే ముద్ద కంటే ముందు మందు బిళ్లలు తినాల్సి వస్తోంది. మాత్రల వినియోగంపై ప్రత్యేక కథనం.

సాక్షి తిరుపతి: జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లు బానిసకావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రాలపై అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నాయి. జనం తిండికంటే ముందు పరకడుపున మాత్రలను తీసుకోవాల్సి వస్తోంది. ఈ రకమైన మాత్రలు వాడే వారి సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా ఫార్మసీ వ్యాపారం జిల్లాలో మూడు మందు బిల్లులు..ఆరు ఇంజెక్షన్లుగా విరాజిల్లుతోంది. దీంతో మందుల వ్యాపారం రూ. కోట్లల్లో సాగుతున్నట్లు డ్రగ్స్, వైద్యనిపుణులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచింగ్ ఆస్పత్రులు 2, ఒక జిల్లా ఆస్పత్రి 1, ఏరియా ఆస్పత్రులు 7, సీహెచ్‌సీలు 15, పీహెచ్‌సీలు 108, ప్రైవేటు ఆస్పత్రులు 4 వేలకు పైగా ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 25 వేలకుపైగా ఓపీలు వస్తుంటాయి. ఇందులో అధికంగా బీపీ, మధుమేహం, గుండె, కడుపుమంట, శ్వాస సంబంధిత సమస్యలకు సంబంధించిన వారే అధికంగా వస్తుంటారు. ఎన్‌సీడీ సర్వే ఆధారంగా 2,03,175 బీపీ కేసులు, 2,45,812 మధుమేహ కేసులు, 2401 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే కిడ్నీ బాధితులు 4,365 మంది, శ్వాస సంబంధిత సమస్యలు 12,365 మందికి ఉన్నట్లు ఓపీల ఆధారంగా అధికారులు గుర్తించారు. ఇలాంటి వ్యాధుల నివారణకు తినకముందే మాత్రలు వాడకం పరిపాటిగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రకమైన మాత్రలు వాడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ విస్తరిస్తోంది. అన్నం తినకముందే తినే మాత్రల అమ్మకాలు నిత్యం దాదాపు రూ. 2 కోట్లు ఉండవచ్చని ఫార్మసీ సంఘం నాయకులు చెబుతున్నారు.

పొద్దునే మింగాల్సిందే...



జబ్బులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధింత వ్యాధులు అధికంగా పట్టి పీడిస్తున్నాయి.ఈ వ్యాధులున్న వారి సంఖ్య పెరగడంతో మందులు, మాత్రల వినియోగం ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు సుమారు రూ. 8 కోట్లు విలువ చేసే మాత్రలు, మందులను అందజేస్తోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతిరోజు రూ.8 కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు ఫార్మసీ నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో భోజనం తినకముందే తినే మాత్రలు అధికంగా అమ్ముడుపోతున్నాయి. ఉదయం నిద్ర లేవగానే టీ, కాఫీ, అల్పాహారానికి బదులు కొన్ని రకాల మాత్రలను వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ రకమైన మాత్రలను భారీగా అమ్మకానికి తెచ్చిపెడుతున్నారు. ముద్ద మింగక ముందే మింగే మందు బిళ్లల వ్యాపారం ప్రైవేటు షాపులో సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇకపోతే యాంటీ బయోటిక్ మాత్రలను పరకడుపున అధిక మోతాదులో మింగేస్తున్నారు. ఈ యాంటీ బయోటిక్ మాత్రల అమ్మకాలు జోరందుకుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా చాలా మంది షాపు కెళ్లి మాత్రలు కొని, మింగుతున్నారు. దీంతో మరికొన్ని జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సి వస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించకపోతే....

అందరికీ ఆరోగ్య సూత్రాలు తెలుసు. కానీ పాటించే వారు కనీసం రెండు శాతం మంది కూడా లేరు. చిన్న చిన్న అజాగ్రత్తలతో ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్నారు. అజాగ్రత్తకు తోడు వైద్యశాస్త్రం పురోగమించింది. కొత్త కొత్త ఖరీదైన మందులెన్నో వచ్చాయి. ఆధునాతన ఆపరేషన్లు పుట్టుకొచ్చాయి. మంచి సదుపాయాలున్న ఆస్పత్రులు ఉన్నాయి. డబ్బుంటే చాలు, అన్నీ తగ్గించుకోవచ్చనే ధీమా పెరిగిపోతోంది. ఆరోగ్య సూత్రాలు పాటించకపోవడంతో నిద్రలేమి సమస్య, దురలవాట్లతో గుండెపోటు, పక్షవాతం వస్తాయి. మాదక ద్రవ్యాల వ్యసనంతో కొలస్ట్రాల్ సమస్య, జంక్‌ఫుడ్‌తో రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతోంది.

మాత్రలతో ముప్పు..

ముక్క లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులు పోయాయి. ఇప్పుడు మాత్రలు లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులొచ్చాయి. ఇందుకు కొన్ని జబ్బులే ప్రధానం. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతోనే జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయటి ఫుడ్‌కు అలవాటు పడకూడదు. డాక్టరు సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు మింగకూడదు. నొప్పులు వెంటనే తగ్గాలని పెయిన్ కిల్లర్స్‌కు అలవాటు పడితే..అది మిమ్మల్ని చంపేస్తాయి. తర్వాత కిడ్నీ, గ్రాస్టిక్ సమస్యలను తెచ్చుకోవడం ఖాయం. జాగ్రత్తలు పాటించి మాత్రల ముప్పు నుంచి బయట పడాలి. **–డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు**

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీశైలంలో రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలలో వేచి ఉన్న భక్తులకు అల్పాహారం, తాగునీరు, బిస్కెట్లు అందించారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిక్కిరిశాయి. స్వామి అమ్మవార్ల దర్శన అనంతరం భక్తులు అన్నపూర్ణ భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



- ఆదిదంపతుల ఆర్జిత సేవలో ఉభయదాతలు
- సర్వ భక్తజనుల ఆరోగ్యం కోసం సూర్యోపాసన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని పలువురు నూతన వధూవరులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవ దంపతులు, వారి కుటుంబ సభ్యులు, అమ్మవారి ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలు, సాధారణ భక్తులతో ఇంద్రకీలాద్రిపై రద్దీ కనిపించింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఉదయానికి కాస్త తెరిపి ఇవ్వడంతో భక్తుల రద్దీ ఒక్క సారిగా పెరిగింది. ఉదయం ఏడు గంటల నుంచే భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు ఉదయం 11.40 గంటలకు అన్ని దర్శనాలను నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఈ రద్దీ మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. అంతరాలయ దర్శన క్యూలైన్ ఖాళీ అయిన వెంటనే రూ.300 టికెటు కొనుగోలు చేసిన భక్తులకు ముఖ మండప దర్శనం, రూ.100 టికెటు క్యూలైన్‌లో భక్తులను రూ.300 టికెటు క్యూలైన్‌లోకి మళ్లించి రద్దీని నియంత్రించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయ దాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

లోక సంరక్షణార్థం సూర్యోపాసన

లోక సంరక్షణార్థం, సర్వ భక్తజనుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ సేవ అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

పేదింటి బిడ్డకు విదేశీ విద్య

అమెరికా చదువుకు ఎంపికైన నవీన.. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ కూలీలు

మార్కాపురం: వారిది రెక్కాడితే కానీ.. డొక్కాడని పేద కుటుంబం. తమ కుమార్తె బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ఆశించారు. అయితే ఇంటర్ సెకండియర్‌లోనే అమెరికా వెళ్లి తమ కుమార్తె చదువుతుందని కలలో కూడా ఊహించలేదు. అమెరికాకు వెళ్లారని ఎవరైనా చెబితే వినడమే తప్ప తమ కుమార్తె స్వయంగా అమెరికాకు వెళ్తుందని కళాశాల ప్రిన్సిపల్ చెప్పేదాకా తెలియదు. రాష్ట్ర విద్యారంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువుకు, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల ఫలితంగా పేదింటి అమ్మాయి అమెరికా చదువుకు ఎంపికై ంది. కెన్నడీ లూగర్ -యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ (కేఎల్-వైఈఎస్) కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా అందులో మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థిని దారా నవీన ఎంపికై ంది.


తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, కేశయ్యలు మాట్లాడుతూ తమ కుమార్తె దేశాలు దాటి అమెరికాకు వెళ్తుందన్న ఆలోచనే సంతోషాన్నిచ్చిందని తెలిపారు. పెద్ద చదువులకు అమెరికాకు వెళ్తుంది అనుకున్నామే కానీ ఇంటర్‌లోనే అమెరికాకు వెళ్తుందని ఊహించలేదన్నారు.

పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన దారా కేశయ్య, ఆదిలక్ష్మమ్మల కుమార్తె నవీన 1 నుంచి 4వ తరగతి వరకూ స్వగ్రామమైన పుచ్చకాయలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. 5 నుంచి ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ వరకూ రాయవరం సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతోంది. 10వ తరగతిలో 541 మార్కులు రాగా, ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో 470 కి గానూ 418 మార్కులు సాధించింది. విదేశీ విద్య పథకం కింద ఎంపికైన నవీన అమెరికాలోని మేరీ ల్యాండ్స్ స్టేట్‌లో డెల్టాస్ విల్ ప్రాంతంలోని హైపాయింట్ హైస్కూల్‌లో 10 నెలల పాటు చదువుకోనుంది. ఇందుకయ్యే ఖర్చంతా ఏపీ ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కుతో పాటు ట్యాబ్, విమాన టికెట్స్‌ను అందించారు. కెన్నడీ లూగర్-యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాంను అమెరికాకు చెందిన సాంస్కృతిక వ్యవహారాల శాఖ నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన విద్యార్థులు 10 నెలల పాటు అక్కడే చదువుకుంటారు. ఒక్కొక్క విద్యార్థికి నెలకు 200 డాలర్లను స్టైఫండ్‌గా అందిస్తారు. రాబోయే పదిరోజుల్లో అమెరికాకు వెళ్తారు. వీరికి అవసరమైన నిత్యావసరాలు, బ్యాగ్‌లు, దుస్తులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సమకూరుస్తుంది. దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థులు ఎంపిక కాగా మన రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.

ప్రజలకు సేవలందిస్తా

సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్ అయి ప్రజలకు సేవలందిస్తాను. వెనుకబడిన ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తాను. సీఎం వైఎస్ జగన్ విద్యలో ప్రవేశపెట్టిన మార్పుల వలన నేను అమెరికాలో చదువుకునే అదృష్టం దక్కింది. ఆయనకు రుణపడి ఉంటాను.
– నవీన, విద్యార్థిని

చదువులో బెస్ట్

5వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకూ నవీన ఇక్కడే చదివింది. చదువులో మంచి మార్కులు వస్తున్నాయి. మా పాఠశాల విద్యార్థిని నవీన అమెరికాకు వెళ్లడం గర్వకారణంగా ఉంది.
– ఆశాలత, ప్రిన్సిపల్

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

హెచ్చెల్సీకి మళ్లీ గండి

- రైతుల్లో ఆందోళన
- ఆధునికీకరణ పనులు జరిగిన చోటే..
- వందల కోట్లు వ్యయం చేసినా తరచూ గండ్లు
- డ్యాం నుంచి కాలువకు నీరు నిలుపుదల


గండి పడిన ప్రాంతంలో నీరు బయటకు పోతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటక పరిధిలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని అనంతపురం జిల్లాకు తాగు, సాగు నీరు అందించే హెచ్ఎల్సీ కాలువకు ఆదివారం మళ్లీ గండి పడింది. వారం రోజులు క్రితం గండి పడిన కాలువకు ఎదురుగానే కోళగల్లు వద్ద 78 కిమీ వద్ద నాలుగు వందల మీటర్ల దూరంలో ఎడమవైపు గండిపడింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. గండి సమాచారం అందుకున్న బోర్డు అధికారులు హుటాహుటిన చేరుకుని మరమ్మతు పనులు చేయడంపై దృష్టి సారించారు. ఎమ్మెల్యే గణేష్ కూడా గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రూ. కోట్లు వ్యయం చేసినా నాసిరకం పనులు ?

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి వర్షాలు కురవకపోవడంతో డ్యాంలోకి నీరు అదునులో చేరకపోవడంతో కాలువకు కూడా నీరు ఆలస్యంగా విడుదల చేశారు. దీంతో తుంగభద్ర ఆయకట్టు కింద వరి, పత్తి, మిర్చి తదితర పంటలను అష్టకష్టాలతో సాగు చేశారు. వరుణుడు కూడా ముఖం చాటేశారు. డ్యాం నుంచి సరఫరా చేసే నీటిపైనే రైతులు పంటలు ఆధారపడ్డాయి. ఇలాంటి క్లిష్ట,కరువు పరిస్థితుల్లో హెచ్ఎల్సీ కాలువ పదే పదే గండ్లు పడటం ప్రారంభం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. హెచ్ఎల్సీ కాలువ ఆధునీకరణకు వందల కోట్లు నిధులు వెచ్చించారు. నాలుగు సంవత్సరాలు క్రితం ఆధునీకరణ పనులు జరిగిన చోటే గండ్లు పడుతుండటంపై పనులు నాణ్యతపై రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఆధునీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్లు, అధికారులు సక్రమంగా పనులు చేయకపోవడంతోనే గండ్లు పడుతున్నాయని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ ఆరోపించారు. నాసిరకంగా, తూతుమంత్రంగా పనులు చేసి రైతులకు నీరు సరఫరా కాకుండా ఆటంకాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందల కోట్లు వెచ్చించి మరమ్మతు పనులు చేసిన కాలువ గుండా రైతులకు నీరు సక్రమంగా అందించేందుకు వీలు కాకపోవడంతో బోర్డు అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. అనంతపురం సరిహద్దుకు నీరు చేరిన మూడు రోజుల వ్యవధిలోపే మళ్లీ గండి పడటంతో రెండు జిల్లాలకు నీరు చేరుతాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఖైదీ పరారీ


అన్వర్ బాషా

రాయచూరు రూరల్: సబ్జైలు నుంచి ఓ ఖైదీ పరారైన ఘటన దేవదుర్గలో చోటుచేసుకుంది. ఓ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్వర్ బాషా దేవదుర్గ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఆదివారం ఉదయం సిబ్బంది కళ్లుగప్పి పారిపోయాడు. విషయం తెలుసుకున్న జిల్లా జైలర్ అందాని దేవదుర్గ జైలును పరిశీలించి వివరాలు సేకరించారు. ఖైదీ కోసం గాలింపు చేపట్టారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

కంప్లి: పట్టణంలోని సత్యనారాయణ పేట నంజనగూడు శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆదివారం సుప్రభాతం, నిర్మల్య విసర్జనం, అష్టోత్తర సహిత ఫల పంచామృతం, కనకాభిషేకం, పల్లకీసేవలు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం


హాస్టల్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

రాయచూరు రూరల్: హాస్టల్ సిబ్బందిపై సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం ఆయన నగరంలోని జోళదరాశి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న మొరార్జీ దేశాయ్ గురుపాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. భోజన సదుపాయాల గురించి విద్యార్థులతో ఆరా తీశారు. అక్కడ వండిన ఉగ్గాని తిని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లేదని, అధికారులపై మండిపడ్డారు.

ప్రశాంతంగా టెట్


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లాలో ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హొసపేటె నగరంలోని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల, చిత్తవాడిగి పీయూ కళాశాల్లో, విజయనగర డిగ్రీ కాలేజీలో, నర్మదా పాఠశాలతో పాటు 16 కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాశారు. విజయనగర జిల్లాధికారి దివాకర్, నగర ప్రభుత్వ బాలికల పీయూ కాలేజీలోని పరీక్ష కేంద్రానికి వెళ్లి సందర్శించి పరిశీలించారు. 12 కేంద్రాల్లో సుమారు 3651 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం రెండో విడత పేపర్కు మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో 5116 విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించారని అదే విధంగా పరీక్ష కేంద్రం వద్ద 200 మీటర్ల వరకు ఆంక్షలు విధించారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంజాయి విక్రేతపై బహిష్కరణ వేటు

హుబ్లీ: హుబ్లీ-ధార్వాడ నగర పరిధిలో గంజాయి విక్రయంతో పాటు వివిధ నేరాల్లో పాల్గొన్న యల్లాపుర వీధి కత్తిపూరచాల నివాసి సాహిల్ మహమ్మద్ రఫీక్ నదాఫ్ను ఆరు నెలల పాటు సరిహద్దు బహిష్కరణ చేస్తూ పోలీసు కమిషనర్ రేణుక కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పలు కేసుల్లో ఉన్న ఇతను జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో ఆరు నెలల పాటు చామరాజ్ నగర జిల్లా కొల్లగాళ నగర సరిహద్దు బహిష్కరణ విధించారు.

అధికంగా నీరు విడుదల చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న దృశ్యం

కంప్లి: తుంగభద్ర జలాశయం 10వ డిస్ట్రిబ్యూటర్ కాలువకు అధికంగా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కురుగోడు పట్టణంలోని నిరావరి శాఖ ఎదుట అఖిల భారత వ్యవసాయ కృషి కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ ఈ సమస్య పట్ల ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకువచ్చామని, స్పందించకపోవడంతో ధర్నా చేపట్టామన్నారు.

రైతు సమస్యలపై ఆందోళన విరమించం


మాట్లాడుతున్న పాటిల్

రాయచూరు రూరల్: రైతులు సమస్యలపై సర్కార్ స్పందించే వరకు ఆందోళన విరమించమని రైతు పోరాట సమితి నేతలు హెచ్చరించారు. ఆదివారం జేసీఐ భవనంలో ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో గౌరవాధ్యక్షుడు చామరస మాలి పాటిల్ మాట్లాడారు. బీమా పథకంలో రైతులకు అన్యాయం జరిగిందని, పత్తి పంటకు నష్టపరిహారం, విక్రయించిన జొన్నకు నేటికి నగదు ఇవ్వలేదని, కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. పత్తి, మిరప, వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయన్నారు.

వేడుకగా పత్రికా దినోత్సవం

నేటి ఆధునిక సమాజంలో మానవుడు అన్ని రంగాలలో సత్తాను చాటుతున్నారని బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విద్యాలయంలో జరిగిన పత్రికా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమావేశంలో బసప్ప గోరెబాల్, హాజీ, ఇమ్తియాజ్, చంద్రు, దత్తు, వీరేష్, వినయ్కుమార్, మునిరెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి భూములకు నీరందాలి


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజ్

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువకు నీరు విడుదల చేస్తున్న తరుణంలో నీటి నిర్వహణ చేపట్టాలని చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సిరవార 92,103వ మైలు వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలని ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. మంత్రి వెంట ఎస్ఈ సత్యనారాయణ, ఇంజనీర్లు బసవనగౌడ పాటిల్, గోడేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి పూజ

సిరవార తాలూకా కవితాళ, బాగలవాడలలో రూ.50 లక్షలతో నిర్మించే ఆయూష్ ఆస్పత్రి నిర్మాణాలకు చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హంపయ్య నాయక్, శరణయ్య, సూగుప్ప, బ్రిజేష్ పాటిల్, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించండి

- జిల్లా ఇన్చార్జ్ మంత్రి నాగేంద్ర


మంచినీటి ప్లాంటును పరిశీలిస్తున్న మంత్రి నాగేంద్ర

సాక్షి,బళ్లారి: నగరంలో కలుషిత నీరు సరఫరా కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగర శివార్లలోని సంగనకల్లు సమీపంలోని శుద్ధమంచినీటి ప్లాంటును పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నీటి సమస్య తలెత్తకుండా గట్టిచర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి సరఫరా అవుతున్న నీరు ఎంతో మంచిదని, ఆ నీటిని శుద్ధీకరణ చేసి సరఫరా చేయడంతో మంచినీరుగా మారుతుందన్నారు. నీటి సమస్య రాకుండా ఉండేందుకు నిధులు కొరత లేదని, ఎక్కడైన సమస్య వస్తే వెంటనే మరమ్మతులు చేసి నీటి సరఫరా చేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఆయన వెంట జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, పాలికె కమిషనర్ ఖలీల్సాబ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మూల స్తంభాలు

హొసపేటె: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షులు రామనగౌడ అన్నారు. ఆదివారం జిల్లాలోని హరపనహళ్లి పట్టణంలో అంబ్లీదొడ్డ భర్మప్ప కాలేజీలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రతిభా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దేశానికి మూల స్తంభాలని, దేశం అన్ని విధాలా అభివృద్ధికి విద్యార్థులు నడుం బిగించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మృత్యుంజయ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలనకు పాటుపడాలని వైద్యకీయ శాఖ మంత్రి శరణు ప్రకాశ్ పాటిల్ అన్నారు. శనివారం రాత్రి దేవసూగురులో విద్యాశాఖ, సాక్షరత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని అన్నారు. కార్యక్రమంలో మంత్రి శరణు బసప్ప, ఎమ్మెల్యేలు బసనగౌడ, హంపనగౌడ, శరణేగౌడ, జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కంప్లి: తాలూకాలోని సుగ్గేనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో 31 మంది విద్యార్థులకు మంగళముఖి రాజమ్మ రూ.20 వేలతో టీ షర్టులు, ప్యాంట్లు, అందించారు. ఈసందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి దుస్తులు ధరించి రావాలని తన వంతు సాయం చేసినట్లు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


సయ్యదా సాజిద్ ఫాతిమా

రాయచూరు రూరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాయచూరు జిల్లా నుంచి సయ్యదా సాజిద్ ఫాతిమా ఎంపికయ్యారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ మండలి విడుదల చేసిన జాబితాలో ఫాతిమా పేరు ప్రకటించారు. రాయచూరు తాలూకా యరమ రాప్ క్యాంప్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 25 ఏళ్లుగా ఆంగ్లం బోధిస్తున్నారు. ఫాతిమా సావిత్రి బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును అందుకోనున్నారు. మంగళవారం బెంగళూరులో అవార్డును అందుకోనున్నారు.

వేడుకగా ఉచిత వివాహాలు


ఒక్కటైన జంటలు

బళ్లారి అర్బన్: కన్నడ రక్షణ యువ వేదిక జిల్లా అధ్యక్షుడు కప్పగల్ మునిస్వామి నేతృత్వంలో 17వ వార్షిక ఉచిత సామూహిక వివాహాలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. స్థానిక కప్పగల్ రోడ్డు శిరివార గ్రామం సమీపంలోని శ్రీ అమరేశ్వర దేవస్థానం ఆవరణంలో 9 జంటలకు వివాహం జరిపించారు. ఇప్పటి వరకు 975 జంటలకు వివాహాలు జరిపించినట్లు నిర్వాహకులు తెలిపారు. తాళి, పెళ్లి దుస్తులు అందజేశారు. సామూహిక వివాహాలకు విచ్చేసిన వారికి విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కన్నడ రక్షణ యువ వేదిక అధ్యక్షుడు కప్పగల్ సుశీలమ్మ మునిస్వామి, ప్రధాన కార్యదర్శి శివశంకర్రెడ్డి, బీ.పరుశురాం, ఈ.కృష్ణమూర్తి, తిప్పేస్వామి, బసవ, అమరేశ్వర దేవస్థాన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి నగదు వాపస్


శివమ్మ

రాయచూరు రూరల్: గృహలక్ష్మీ పథకం కింద జమ చేసిన నగదును ఓ వృద్ధురాలు వెనక్కి ఇచ్చిన ఘటన కొప్పళ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని కుష్టిగి తాలూకాకు చెందిన నీడశేషి శివమ్మకు ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద రూ. 2 వేల నగదును ఆమె ఖాతాలో జమ చేసింది. విషయం తెలుసుకున్న శివమ్మ నగదు తనకు అవసరం లేదని, వెనక్కు ఇచ్చేసింది. గ్రామ చెరువు అభివృద్ధికి తన సొంత నగదును వినియోగించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

వైభవంగా ఊరేగింపు

కంప్లి: పట్టణంలో విశ్వకర్మ సమాజపు కాళికా కమతేశ్వర దేవత గంగస్థల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తుంగభద్ర నది తీరాన గంగాస్థల ప్రారంభించి ప్రముఖ మార్గాల మీదుగా సాగి కాళికా కమతేశ్వర దేవస్థానం చేరుకున్నారు. కంప్లి నగర విశ్వకర్మ సమాజ అధ్యక్షుడు డీఏ. రుద్రప్పాచార్, పదాధికారులు డీ. మౌనేష్, నారాయణచార్, రవి, కృష్ణ, మెత్రిషన్ముక, ఏ. ఎంకణ్ణ, ఎం. మంజునాథాచార్, శశిధర్, గురుమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా ఆరాధనోత్సవాలు


బృందావనానికి అలంకరణ


మహిళల కోలాట ప్రదర్శన

హొసపేటె: నగరంలో ఆదివారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్తరారాధన సందర్భంగా బృందావనానికి అష్టోత్తర, వాయుస్తుతి పారాయణం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కనకాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

8న రైతు మోర్చా ధర్నాలు

యశవంతపుర: రైతులకు బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలను కొనసాగించటంతో పాటు వ్యవసాయ పంప్సెట్లకు విద్యుత్ను సక్రమంగా అందించాలని డిమాండ్ చేస్తూ రైతు మోర్చా ఉద్యమబాట పట్టనుంది. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో టీపీ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించినట్లు రాజ్యసభ సభ్యుడు, రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఈరణ్ణ కడాడి తెలిపారు. ఆదివారం అయన బెళగావిలో విలేకరులతో మాట్లాడారు.

తొలగింపులు ఆపండి

కోలారు: జిల్లాలోని శ్రీనివాసపురం తాలూకాలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్న రైతుల భూములను ఆక్రమణల నెపంతో స్వాధీన ప్రక్రియను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాంధీనగర నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటవీశాఖ స్వాధీనం చేసుకున్న భూములకు రైతులు తాలూకా భూ మంజూరాతి సమితి నుంచి చట్టబద్ధంగా సాగుపట్టా లభించింది. ఈ భూములను పలు సంవత్సరాలుగా వీరు సాగు చేసుకుంటున్నారు. అటవీ శాఖ అధికారులు రైతులను వీధి పాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అటవీశాఖ అధికారులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు టిఎం వెంకటేష్, పిఆర్ సూర్యనారాయణ, ఎం విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లతో పోలీసులు

కెజీఎఫ్: ట్రాక్టర్లను దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన కామసముద్రం పోలీసులు వారి వద్ద నుంచి 2 ట్రాక్టర్లు, 5 ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. కెజీఎఫ్కు చెందిన మునిరాం, ఆనందరెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. కామసముద్రం సీఐ నారాయణస్వామి నేతృత్వంలో కార్యాచరణ చేసిన పోలీసులు నిందితులను శనివారం అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, ట్రాలీల విలువ రూ. 9.7 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారం ఎంతో అవసరం

హొసపేటె: మహిళలకు పౌష్టిక ఆహారం ఎంతో అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధీశులు మహాలక్ష్మి తెలిపారు. ఆదివారం వియజనగర జిల్లా కూడ్లిగి తాలూకాలో మహిళా, పిల్లల అభివృద్ధి శాఖ, న్యాయ సేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టిక ఆహార సప్తహా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గర్భిణులకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పిస్తే పుట్టబోయే పిల్లలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది మెహబూబ్బాషా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాయ స్వామి జయంతి


స్వామివారికి ప్రత్యేక అలంకరణ

మాలూరు: పట్టణంలోని ధర్మరాయస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీద్రౌపది దేవి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో వహ్నికుల క్షత్రియ సంఘం, శ్రీధర్మరాయస్వామి దేవాలయ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ గాజులు పూలను అమ్మవారికి సమర్పించారు. పూజల్లో ఎంపీ మునిస్వామి, హూడి విజయకుమార్, ధర్మరాయస్వామి దేవాలయ సమితి అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

శ్రీనివాసపురం: ఒక్కలిగ సముదాయం వారు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదిచుంచనగిరి మహా సంస్థాన పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మాలానంద స్వామీజీ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో తాలూకా వక్కలిగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నాడప్రభు కెంపేగౌడ జయంతి ఉత్సవంలో పాల్గొని మాట్లాడారు. నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టి కన్నడ నాడు అభ్యుదయానికి కారణమైందన్నారు. ప్రముఖంగా బెంగుళూరు నగర అభివృద్ధికి కెంపేగౌడ తనదైన సేవలు అందించారన్నారు. కోలారు తాలూకాలోని సీతి కొండపై 5 వేల మంది విద్యార్థులకు ఉచిత విద్యాభ్యాసం అందించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ అన్ని సముదాయాల విద్యార్థులు ఉంటారన్నారు. శ్రీనివాసపురం తాలూకాలో 30 వేల హెక్టార్లలో మామిడి పండిస్తున్నారని, అయితే మామిడి వ్యాపారానికి సంబంధించి ప్రతి సంవత్సరం ఏదో ఒక సమస్యను రైతులు ఎదుర్కొంటున్నారు. తాలూకాలో మామిడి సంరక్షణ యూనిట్ను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం శ్రీనివాసపురం తాలూకాలో మామిడి సంరక్షణా యూనిట్ను స్థాపించడం ద్వారా రైతులను ఆదుకోవాలన్నారు. స్థానిక, జిల్లా ప్రజా ప్రతినిధులు ఇందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. లోక్సభ సభ్యుడు ఎస్ మునిస్వామి మాట్లాడుతూ... కెంపేగౌడ ఆదర్శ పాలన నేడు రాష్ట్రానికి ఎంతో అవసరముందన్నారు. సమాజంలోని అన్ని సముదాయాలకు సమాన అవకాశాలు కల్పించాలని బెంగుళూరు నగరంలో 64 ప్రత్యేక వీధులను నిర్మించారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం జరిగింది. సాధకులను సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే జి కె వెంకటశివారెడ్డి, తాలూకా ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి జిఎస్ రమేష్, డి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావంతో పనిచేయాలి


నౌకర్లకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: అక్షర దాసోహ పథకం నౌకర్లు సేవా మనోభావంతో విధులు నిర్వహించాలని అక్షర దాసోహ పథకం అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రమణి అన్నారు. ఆదివారం తాలూకాలోని సుగటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అక్షర దాసోహ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. వంటలు తయారు చేసే సమయంలో శుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. సీగేహళ్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేష్ సుగటూరు క్లస్టర్లో పని చేస్తున్న 40 మంది అక్షర దాసోహ నౌకర్లకు దుస్తులు అందించారు. ధర్మేష్ తన వేతనంలో ప్రతినెలా రూ. 10 వేలు పొదుపు చేసి దానిని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తుండడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు బైరేగౌడ మాట్లాడుతూ... విద్యార్థులు దాతలు అందిస్తున్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటరాం, దాని ఎస్ఆర్ ధర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా కారంజిలో విద్యార్థుల ప్రతిభ



అందుకున్న సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోలారు: తాలూకాలోని అరాభికొత్తనూరు క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజి పోటీలలో మడేరహళ్లిలో ఉన్న అర్క ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ సాధన చేశారు. పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాలలో నిర్వహించిన అంశాలలో 9 ప్రథమ, 9 ద్వితీయ, 6 తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, పాలనాధికారి జెస్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎల్ కీర్తిలు అభినందించారు.

ఉన్నత విద్యావంతులు కావాలి


అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: ప్రభుత్వం అందిస్తున్న సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని డివైసిపి చంద్రకళా పిలుపునిచ్చారు. ఆదివారం తాలూకాలోని బెళమారనహళ్లి క్లస్టర్లో నిర్వహించిన ప్రతిభా కారంజి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు మధ్యాహ్న భోజనం, గుడ్డు, క్షీరభాగ్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యార్థి వేతనం అన్ని అందిస్తోంది..అయినా పాఠశాలల్లో విద్యార్థులు నమోదు తగ్గుతుండడం సరికాదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలో విద్యార్థుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రతిభావంత విద్యార్థులు ఉండి వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిభాకారంజీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోషకులు, ఉపాధ్యాయులు ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు అశ్వత్థ నారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి ఎస్ నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు టి అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో ఉత్తమ సేవలు అందించిన పలువురిని సన్మానించారు.